అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 24-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 175 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఆశాలకు పరీక్షలా?



ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని బహిరంగలేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సర్క్యులర్ ఆధారంగా ఆశా వర్కర్లకు పరీక్షలు నిర్వహిస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. కేంద్ర ప్రభుత్వానికి ...11లో



విద్యాశాఖపై సీఎం, డిప్యూటీ సీఎంల సమీక్ష

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

ఎంపీల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు

- మంత్రి వర్గ విస్తరణపై అధిష్టానంతో చర్చలు
- నామినేటెడ్ పదవులు, పీసీసీ అధ్యక్ష పదవిపైనా మంతనాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఢిల్లీకి వెళ్లనున్నారు. సోమవారం పార్లమెంట్‌లో ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కానున్నారు. సీఎం రెండు రోజుల పాటు ఢిల్లీలోనే ఉండనున్నారు. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన రాష్ట్రానికి చెందిన అంశాలపై ఎంపీలకు ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు. అలాగే మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక తదితర అంశాలపై అధిష్టానంతో చర్చించే ...2లో

నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

వివరాలు 2లో

హస్తం గూటికి జగిత్యాల ఎమ్మెల్యే

కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్‌పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్యూ కడుతున్నారు. మొన్న ఆపార్టీ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా సైలెంట్‌గా జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి, అక్కడే కాంగ్రెస్ కండువా కప్పించుకున్నారు. ఇదే తోవలో మరో 18 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారనే ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. అప్పట్లో బీఆర్ఎస్ ఎలాగైతే ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమపార్టీలో చేర్చుకుందో...అదే తరహాలో ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ కూడా వ్యవహరిస్తుండటం గమనార్హం!



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం

హోలీ పండుగ తరహాలో బీజేపీ,కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బొగ్గు మసిని తలాకొంచెం ముఖాలకు పూసుకుంటున్నాయి. ఎవరి ముఖం వారికి కనిపించక, నీ ముఖాన మసి ఉందంటే...నీ ముఖానే ఉంది చూసుకో అని ఒకరికొకరు వేలెత్తి చూపుకుంటున్నారు. ఇప్పుడు రాజకీయమంతా ఈ నల్లబంగారం చుట్టూనే తిరుగుతోంది. తప్పు మీదంటే...కాదు మీదంటూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ జనాన్ని 'మాయ' చేస్తున్నారు. ఈ విమర్శల జడివానలోనే వేలంపాటల ద్వారా నల్లబంగారాన్ని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేస్తున్నారు. అసలు వేలంపాటే తప్పు అని కమ్యూనిస్టు పార్టీలు తప్ప, మరెవ్వరూ నోరెత్తడం లేదు. వేలంపాటే లేకుంటే 'సింగరేణి'కి బొగ్గు గనులు కేటాయించాలనే డిమాండే ఉండదు కదా! ఆ గనులన్నింటినీ ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి, కోల్ ఇండియా సంస్థలే నిర్వహిస్తాయి కదా! ప్రజల ఆస్తి ప్రజలకే చెందుతుంది కదా! ఈ మాత్రం సోయిని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చూపట్లేదు. పార్టీలు, దాన్ని నడిపే వ్యక్తులు వేర్వేరైనా, వారందరివీ ఒకేరకమైన పెట్టుబడిదారీ విధానాలే అనడానికి ఇంతకంటే సాక్ష్యం ఇంకేం కావాలి?

కోల్‌గేమ్



కొట్లాడినట్టే చేస్తూ...బొగ్గువేలానికి సహకరిస్తున్న పార్టీలు

- తిలాపాపం తలా పిడికెడు...సింగరేణి కష్టాలకు కారణమదే...
- ప్రజల్ని మోసం చేస్తూ పొలిటికల్ డ్రామాలు • వేలమే వద్దని అడిగితే ఒట్టు..

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ 2017లో కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ తీసుకొచ్చిన మైన్స్ అండ్ మినరల్ యాక్ట్ సవరణల బిల్లుపై వ్యూహాత్మకంగా మౌనం వహించింది. 2021లో బొగ్గు గనుల్ని వేలం వేయొద్దనీ, సింగరేణికే వాటిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ, కేంద్రంపై యుద్ధం ప్రకటిస్తున్నట్టే చేసి, సజావుగా వేలం ముగిసేందుకు తనవంతు సహకారాన్ని అందించింది. అసలు వేలమే తప్పు అని మాత్రం కేంద్రానికి చెప్పే సాహసం చేయలేదు. ఇక ఆనాటి వేలంలో కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు గనుల్ని తన అనుయాయులకు వచ్చేలా చేసేందుకే అప్పటి సీఎం కేసీఆర్ సింగరేణిని వేలంలో పాల్గొనకుండా అడ్డుకున్నారంటూ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలకు దిగింది. వీటన్నింటికీ మూల కారణమైన బీజేపీ కూడా ఇప్పుడు బీఆర్ఎస్ వల్లే సింగరేణి నష్టాలపాలైందంటూ మొత్తుకుంటోంది. ఓ ప్రభుత్వరంగ సంస్థను ...11లో



వేలకోట్లు డివిడెండ్‌గా తీసుకుంటున్నారు

సింగరేణి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలకోట్ల రూపాయల్ని డివిడెండ్ రూపంలో తీసుకుంటున్నాయి. బొగ్గుపై రకరకాల పన్నుల్ని కేంద్రం వసూలు చేస్తోంది. అసలు గనుల వేలం ఎందుకు వేయాలి? అవి ప్రజల ఆస్తి. వాటిని వేలంద్వారా ప్రయివేటు వ్యక్తులు, సంస్థలకు ఎలా కట్టబెడతారు? ప్రభుత్వరంగ సంస్థల్ని మరింత నిర్వీర్యం చేయడం కోసమే ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నారు. కేంద్రం ఎన్ఎండీసీ, ఎన్టీపీసీకి బిడ్డింగ్ లేకుండానే పనులు అప్పగిస్తున్నది. వాటికి వర్తించని నిబంధనలు సింగరేణికి మాత్రమే వర్తిస్తాయా?

- ఎమ్ వేణుగోపాలరావు, కన్వీనర్, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్



బోర్డు నిర్ణయాన్నీ పట్టించుకోలేదు

సింగరేణి కాలరీస్ బోర్డు 2021లో వేలంలో పాల్గొనాలని నిర్ణయం చేసింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకొని, తమ అనుయాయులకు కోయగూడెం, సత్తుపల్లి గనులు దక్కేలా చక్రం తిప్పారు. బొగ్గుగనుల్ని వేలం వేసేలా 2017లో కేంద్రం చట్టం చేస్తే, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ఇది పరోక్షంగా వేలాన్ని సపోర్ట్ చేయడమే కదా! ఇప్పుడు ఆపార్టీ ఎంత గగ్గోలు పెట్టినా ఏం ఉపయోగం? ఇప్పుడు కాంగ్రెస్ కూడా వేలంలో పాల్గొన వద్దని నిర్ణయం తీసుకుంటే...అదికూడా తప్పే!!

- కే రఘు, విద్యుత్‌రంగ నిపుణులు

సింగరేణి లాభాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరిన సొమ్ము (రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	కేంద్రం	రాష్ట్రం	మొత్తం
2014-15	1,863.11	1,996.58	3,859.69
2015-16	2,492.60	1,802.63	4,295.23
2016-17	2,887.60	2,453.38	5,340.98
2017-18	3,438.72	3,504.23	6,942.95
2018-19	3,680.45	3,348.40	7,028.85
2019-20	3,330.22	1,906.47	5236.69
2020-21	2,107.25	2,054.27	4,161.52
2021-22	2,932.57	654.06	3,586.63
2022-23	3,216.65	5,418.42	8,635.07
మొత్తం	25,949.17	23,138.44	49,087.61



మాఫియా గుప్పెట్లో విద్యావ్యవస్థ

అవినీతిపరులకు కేంద్రం అప్పగింత : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : దేశంలోని విద్యా వ్యవస్థను మోడీ ప్రభుత్వం మాఫియా, అవినీతి పరుల చేతుల్లో పెట్టిందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆదివారం ధ్వజమెత్తారు. నీట్.. యూజీ ప్రశ్నాపత్రం లీక్ అయితే ...11లో

నేటి నుంచి పార్లమెంట్

ప్రొటెం స్పీకర్ నియామకంపై ప్రతిపక్షాల నిరసన

- 26న స్పీకర్ ఎన్నిక...27న రాష్ట్రపతి ప్రసంగం



న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభం కాబోతున్నాయి. ముందుగా నూతన సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. 26వ తేదీన స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 27న ప్రసంగిస్తారు. ప్రొటెం స్పీకర్‌గా బీజేపీ నేత, ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికైన భర్తృహరి మెహతాబ్‌ను నియమించడం వివాదానికి దారితీసింది. దీనిపై ప్రతిపక్షాలు సభలో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది. సీనియర్ సభ్యుడైన కాంగ్రెస్ ఎంపీ కె. సురేష్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాల్సి ఉండగా ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు కురిపించాయి.

మెహతాబ్ వరుసగా ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారని, అందువల్ల ఆయనే ప్రొటెం స్పీకర్ పదవికి ...11లో

గాయపడిన పాలస్తీనా పౌరుణ్ణి వెహికల్ బాయ్‌నెట్‌కు కట్టి ఊరేగింపు

ఇజ్రాయిల్ సైన్యం దాష్టీకం

సోషల్ మీడియాలో వైరల్

గాజా సిటీ: ఇజ్రాయిల్ సైన్యం దాష్టీకాలకు అడ్డు అదుపులేకుండాపోతోంది. తమ దాడుల్లో గాయపడిన ముజాహిద్ అజ్మీ అనే పాలస్తీనా పౌరుణ్ణి సైనిక వాహనం బాయ్‌నెట్‌కు కట్టి ఊరేగించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వెస్ట్ బ్యాంక్‌లోని జునిన్‌పై ఇజ్రాయిల్ దాడి చేసిన తరువాత ఈ ఘటన చోటుచేసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా తెలిపింది. బాంబు దాడిలో గాయపడి నెత్తురోడుతున్న పాలస్తీనీయుని పట్ల అత్యంత అమానుషమైన రీతిలో ఇజ్రాయిల్ సైన్యం వ్యవహరించడంపై నెటిజెన్లు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాస్ 'ఉగ్రవాదులపై' జరిపిన కాల్పుల్లో అజ్మీ గాయపడ్డాడని, అతను ఉగ్రవాది అన్న అనుమానం కలుగుతోందంటూ ఇజ్రాయిల్ సైన్యం తన చర్యను సమర్థించుకునే యత్నం చేసింది. అజ్మీని ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు అంబులెన్స్ కోసం వెతుకుతుండగా, ఇంతలోనే ఇజ్రాయిల్ సైన్యం అక్కడికి వచ్చి అతణ్ణి సైనిక వాహనానికి కట్టి ఊరేగింపుగా తీసుకెళ్లిందని స్థానిక మీడియా తెలిపింది. ఇంత దారుణం జరిగినా అమెరికా కానీ, ఇతర పశ్చిమ దేశాలు కానీ దీనిని ఖండించకపోవడం గమనార్హం.





నీట్ అక్రమాలపై సీబీఐ

- ఎఫ్ఐఆర్ నమోదు
- ముగిసిన నీట్ రీ-ఎగ్జామ్.. సగం మంది దుమ్మా

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన నీట్ ప్రవేశపరీక్ష అక్రమాలపై సీబీఐ ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల ...11లో

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సస్పెండ్

ఉత్తర్వులు జారీ చేసిన వీసీ

- ఇది అప్రజాస్వామికం, నిరంకుశత్వానికి నిదర్శనం : యూనివర్సిటీ విద్యార్థి నేతలు



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పది మంది ఎస్ఎఫ్ఐ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ వీసీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేయడం విద్యార్థులను ఆగ్రహానికి గురిచేసింది. ఇటీవల హెచ్‌సీయూలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనపై యూనివర్సిటీ అధికారుల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులపై కేసు నమోదు చేశారు. దాంతో వీసీ ఇంటి ఎదుట ధర్నా చేసిన కారణంగా పది మంది విద్యార్థులను సస్పెండ్ చేస్తున్నట్టు వీసీ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి సంఘం అధ్యక్షులు అతిక్ హమద్, నాయకులు కృప మారియా, మోహిత్, సోయల్ అహ్మద్, హసికను ఏడాది పాటు సస్పెండ్ చేశారు. సుభాషిని, నికిత్, రిషికేష్, పంకజ్, అజయ్‌ని ఆరు నెలలు సస్పెన్షన్ చేయడంతో పాటు ...5లో

చిక్కులు వీడితేనే మాఫీ సాఫీ

గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీలో పలు సమస్యలు

- సర్కారు లక్ష్యం నెరవేరాలంటే వాటిని అధిగమించాల్సిందే..!
- మార్గదర్శకాలు ఎలా ఉంటాయనే దానిపై రైతుల ఆసక్తి.. ఆరా..
- కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారేమోనని అనుమానం
- ఖాతా నంబర్లలో లోపాలు వెతికి తిరికాసు పెట్టొద్దని విజ్ఞప్తి
- విధివిధానాలు వెల్లడైతేనే అపోహలకు ఫుల్‌స్టాప్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వం వ్యవసాయ రుణమాఫీ పథకంలో రకరకాల కొర్రీలు పెట్టడంతో పాటూ అనేక సాంకేతిక సమస్యలూ ఎదురయ్యాయి. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అధిగమిస్తేనే పథకం ఉద్దేశం నెరవేరుతుందని రైతులు, రైతుసంఘాల నేతలు అంటున్నారు. గతంలో లాగా కాకుండా ఏకకాలంలో రూ.2లక్షల లోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని మంత్రివర్గం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నా.. కొర్రీలు లేకుండా సాఫీగా అమలు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. అమలు విషయంలో ఎలాంటి డౌట్ లేకున్నా.. విధివిధానాలపై మాత్రం పలు సందేహాలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వం 2018 డిసెంబర్ 12లోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని హామీ ఇచ్చినా.. అమలు నాటికి కొర్రీలు పెట్టింది. కుటుంబం ప్రాతిపదికగా అనడంతో అనేక రకాల సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ ప్రభుత్వం కూడా అలాంటివేవైనా తలపెడితే రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశమూ లేకపోలేదు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేండ్లలో ...11లో



నాన్న..అన్న..ఇప్పుడు తమ్ముడు

ప్రజ్వల్ సోదరుడు సూరజ్ రేవణ్ణ అరెస్ట్


- పార్టీ కార్యకర్తతో స్వలింగ సంపర్కం • లైంగికదాడి కేసుల్లో జేడీఎస్ నేతలు

బెంగళూరు: కర్నాటకలోని ప్రముఖ సెక్స్ స్కాండల్‌లో రేవణ్ణ కుటుంబానికి చెందిన ముగ్గురి పేర్లు బయటపడ్డాయి. వందలాది మంది మహిళలపై లైంగిక వేధింపుల కేసులో మొదట జేడీఎస్ నేత హెచ్‌డీ రేవణ్ణ, ఆయన పెద్ద కొడుకు ప్రజ్వల్ రేవణ్ణ పేర్లు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు ఆయన చిన్న కొడుకు సూరజ్ రేవణ్ణపై కూడా సంచలన ఆరోపణలు వచ్చాయి. సూరజ్ తనతో బలవంతంగా స్వలింగ సంపర్కానికి పాల్పడ్డాడని ఓ పార్టీ కార్యకర్త ఆరోపించారు. ఈ విషయమై హాసన్‌లోని హొలెనర్సిపురా పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 377, 342, 506, 34 కింద కేసు నమోదు చేసిన పోలీసులు సూరజ్‌ను అరెస్ట్ చేశారు.

కుటుంబంపై కుట్ర

తన చిన్న కుమారుడు సూరజ్‌ను అరెస్టు చేశాక.. హెచ్‌డి రేవణ్ణ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. తన కుటుంబంపై కుట్ర జరుగుతోందన్నారు. కుట్రలో తన రెండో కుమారుడిని ఇరికించారని అంటున్నారు. తనకు దేవుడిపై, న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. దేనిపైనా వ్యాఖ్యానించడం మానేసి.. సమయం వచ్చినప్పుడు అన్నీ చెబుతానని అన్నారు. నేను ఇపుడు స్పందించను.. సీఐడీ దర్యాప్తు చేయనివ్వండి.. దర్యాప్తు చేయవద్దని ఎవరు చెప్పారు.. దీనిపై ఇప్పుడే ఏమీ మాట్లాడను.. న్యాయవ్యవస్థను గౌరవిస్తాను అన్నారు.

ఆయన ఇంకా మాట్లాడుతూ.. ఇలాంటి కుట్రలకు భయపడను.. అది ఏమిటో నాకు తెలుసు.. కాలమే నిర్ణయిస్తుంది. ఎవరు ...11లో



నాన్న హెచ్‌డీ రేవణ్ణ



ప్రజ్వల్ రేవణ్ణ



సూరజ్ రేవణ్ణ

ముందుకు కదలని ధరణి

ప్రహసనంగా ధరణి కమిటీ

- మొక్కుబడి సమావేశాలు, సిఫారసులపై భిన్నాభిప్రాయాలు
- ఎండోమెంట్, అటవీ భూములపై తేలని లెక్కలు
- తహసీల్దార్, ఆర్డీవోలకు బదిలీ కాని అధికారాలు
- క్షేత్ర స్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే
- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు 3లక్షలు
- డిజిటల్ సంతకం కోసం 1.8 లక్షల ఎకరాలు
- 130 రకాలకుపైగా రెవెన్యూ సమస్యలు
- ధరణి పోర్టలా? భూ భారతా?
- ఏటూ తేల్చుకోలేక పోతున్న సర్కార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పేరుకు పోయిన భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ ముందుకు కదలడం లేదు. భూ వ్యవస్థలోని లోటుపాట్లను సవరిస్తూ, వాటికి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కమిటీ ప్రహసనంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోర్టల్‌లో చేయాల్సిన మార్పులు, పలు సిఫారసుల విషయంలో భిన్నాభిప్రాయాలు ఏర్పడటంతోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంలో కాలయాపన జరుతున్నదని తెలుస్తోంది. ఫలితంగా ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోయాయి. రెండు విడతల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో దాదాపు లక్షా 20 వేల ఫైళ్లను పరిశీలించి నివేదికలు తయారు చేశామని అధికారులు అంటున్నారు. అయితే అందులో ఒక్క ఆర్డీ కూడా ధరణి పోర్టల్‌లో ఇప్పటి వరకు అప్‌డేట్ కాలేదు.

భూ సమస్యల పరిష్కారం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలో భూసమస్యలు తగ్గక పోగా మరింతగా పెరిగాయి. ఈ పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, ధరణి వచ్చాక ఆ సమస్యల సంఖ్య 130కి పెరిగిందని భూ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత డిసెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ భూ సమస్యల పరిష్కారం కోసం మార్చిలో ధరణి కమిటీని ఏర్పాటు చేసింది. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీకి నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు విధించారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయి నివేదిక అందించలేదు. పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చినప్పుడు తెచ్చిన ఆర్వోఆర్ చట్టం అమలు చేసేందుకు అవసరమైన మార్గదర్శకాలేమీ ధరణిలో లేవు. మండల, డివిజనల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు పరిష్కరించాలో ఏ స్థాయి అధికారికి ఏయే అధికారాలు ఉంటాయన్న మార్గదర్శకాలు పొందుపరచలేదు. వీటికి సంబంధించి ఏవిధమైన సిఫారసులు, సూచనలు చేయాలనే విషయంలో సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలుస్తున్నది. దీనికి తోడు అటవీ, దేవాదాయ భూముల లెక్కలు కొలిక్కి రావడం లేదు. భూచట్టాలన్నింటిని ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి, కొత్తగా ఆర్ఓఆర్ చట్టం తీసుకురావాల్సిన అవసరముందని సభ్యుల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ ఏలా ముందుకెళ్లాలనే అంశంలో సమన్వయం లేదని తెలుస్తోంది. అదే సందర్భంలో ధరణి పేరుతోనే పోర్టల్‌ను ఉంచాలా? దాని పేరు మార్చి భూ భారతి పేరుతో కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలా అనే విషయంలోనూ ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాలేక పోతున్నదని సమాచారం.

పెండింగ్ దరఖాస్తులు 3 లక్షలు

రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో పస్తుతం 1 నుంచి 33 వరకు టెక్నికల్ మాడ్యూల్స్ (టీఎం) ఉన్నాయి. ఈ మాడ్యూళ్లలో పరిష్కారం కోసం గత ప్రభుత్వంలో 2.46 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు దఫాలుగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మరో 60 వేలకు పైగా కొత్తగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో మొత్తం ధరఖాస్తుల సంఖ్య 3 లక్షలు దాటాయి. మరో 1.8 లక్షల ఎకరాల భూములకు సంబంధించి డిజిటల్ సంతకాల (డీఎస్) కోసం భూ యాజమానులు ఎదురు చూస్తున్నారు.. ఇవే కాకుండా సాదా బైనామా కోసం 9.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం అవకాశం లేదు. అమల్లోకి తెచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో చిన్నపాటి సవరణ చేస్తే సాదాబైనామా కోసం నిరీక్షిస్తున్న లక్షలాది మంది బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వివిద మాడ్యూల్స్‌లో ఉన్న సమస్యల పరిష్కారం వేగంగా జరిగేందుకు మార్చిలో సీసీఎల్, కలెక్టర్ల వద్ద ఉన్న అధికారాలను ఆర్డీవో, తహసిల్దార్లకు ప్రభుత్వం బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాని మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారా బదిలీ పూర్తి కాలేదు. దాంతో క్షేత్ర స్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోయాయి. అధికారాలను బదిలీ చేస్తే పెండింగ్‌లో ఉన్న 3లక్షల ధరఖాస్తుల్లో సగానికి పైగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆర్డీవోలకు బదిలీ కాని అధికారాలు

1. టీఎం	7 -	పాస్‌బుక్ లేకుండా నాలా కోసం దరఖాస్తు
2.టీఎం	16 -	సేకరించిన భూములకు సంబంధించిన ఫిర్యాదులు
3. టీఎం	20 -	ఎన్ఆర్ఐ పోర్టల్ వివాదాలు
4. టీఎం	22 -	సంస్థ కోసం పట్టాపాస్ బుక్ జారీ
5. టీఎం	26 -	కోర్టు కేసుల సమాచారం
6). టీఎం	33 -	పాస్‌బుక్ డేటా సవరణ కోసం దరఖాస్తు

తహసీల్దార్లకు బదిలీ కాని అధికారాలు

1. టీఎం	14 -	ఆధార్‌లో తప్పులు, ఆధార్ లేక పోవడంపై ఫిర్యాదులు
2. టీఎం	10 -	జీపీఏ, ఎస్‌పీఏ, ఎగ్జిక్యూటెడ్ జీపీఏ కోసం దరఖాస్తు
3. టీఎం	4 -	అసైన్డ్ భూములతో సహా వారసత్వం కోసం దరఖాస్తు
4. టీఎం	32-	ఖాతా విలీనం దరఖాస్తు

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉంది. డిసెంబర్ 6న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు తనతో పాటు మరో 11 మందికి మంత్రి వర్గంలో చోటు దక్కింది. ఇంకా ఆరుగురికి అవకాశముండటంతో పలువురు నేతలు అదిష్టానం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం డిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాకు మంత్రి వర్గంలో అత్యధిక ప్రాధాన్యత లభించింది. ఇక్కడి నుంచి ముగ్గురికి చోటు లభించగా, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌కు రెండేసి మంత్రి పదవులు దక్కాయి. మెదక్ నుంచి ఒకరికి అవకాశం లభించింది. అయితే రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు రేవంత్ జట్టులో చోటు లభించలేదు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనపై ఆయా జిల్లాలకు చెందిన పలువురు ఆశలు పెట్టుకున్నారు. అలాగే పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి జూన్ 27న రేవంత్ గడువు ముగుస్తున్నప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఆయననే అధ్యక్షునిగా కొనసాగించే అవకాశమున్నట్టు సమాచారం.

నామినేట్ పదవుల భర్తీపై సమాలోచనలు

పార్లమెంట్ ఎన్నికల ముందు నామినేట్ పదవుల భర్తీకి సంబంధించి 37 కార్పొరేషన్లకు చైర్మెన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదు. ఎన్నికల ఫలితాలు, తదనంతర పరిణామాల నేపథ్యంలో గతంలో వెలువడిన నామినెట్ పదవుల భర్తీని యధావిదిగా కొనసాగిస్తారా? మారుస్తారా? అనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉంది. నామినేటెడ్ పోస్టుల భర్తీని పున:సమీక్షించాలని కొంతమంది నాయకులు అధిష్టానానికి విన్నవించినట్టు సమాచారం. సీనియార్టీ ప్రాతిపదికన కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో నామినెట్ పదవుల్లో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశముందని భావిస్తున్నారు.

నియోజకవర్గానికోకా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నియోజక వర్గానికొక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. ఆ పాఠశాలల ఏర్పాటుపై ఆదివారం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్కిటెక్చర్స్ రూపొందించిన పలు నమూనాలను వారు పరిశీలించారు. ఒకే చోట ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఓబీసీ,మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేయాలనీ, పైలట్ ప్రాజెక్ట్‌గా కొడంగల్, మధిర నియోజవర్గాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో 20ఎకరాలచొప్పున భూమిని ప్రభుత్వం సేకరించింది.

'నీట్' లీకేజిలో కేంద్ర మంత్రుల హస్తం

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నీట్ ప్రశ్నాపత్రం లీకేజిలో కేంద్ర మంత్రుల హస్తం ఉందనీ, వెంటనే పరీక్షను రద్దు చేయాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి డిమాండ్ చేశారు. పరీక్షా పత్రం లీక్ చేసిన నిందితులను విచారిస్తే బీజేపీ నేతల బండారం బయటపడుతుందని తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడించేందుకు యత్నించింది. గాంధీభవన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.

బీజేపీ ప్రభుత్వం విద్యార్థులకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా శివసేనారెడర్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ లీకేజిలో 14 మంది కేంద్ర మంత్రుల ప్రమేయ ముందని ఆరోపించారు. వారి పిల్లల భవిష్యత్ కోసం ప్రశ్నాపత్రం లీక్ చేశారని విమర్శించారు. అసలు నిజాలు బయటపడితే, కేంద్ర ప్రభుత్వం కుప్పకూలుతుందన్నారు. అందుకే పరీక్ష రద్దు చేసేందుకు కేంద్రం వెనకాడు తున్నదని విమర్శించారు. ఈ లీకేజికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్‌ను రద్దు చేయకపోతే యూత్ కాంగ్రెస్ పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

రామచంద్రయ్య మృతి పట్ల భట్టి దిగ్భ్రాంతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జానపద కళాకారుడు రామచంద్రయ్య మృతి పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవంపోసి... గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన పద్మశ్రీ సాకిని రామచంద్రయ్య మరణం జానపద కళకు తీరని లోటని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తోలుపునూరీ కృష్ణగౌడ్

- నియామాక పత్రాన్ని అందజేసిన జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిణ్ రెడ్డి



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు తోలుపునూరీ కృష్ణగౌడ్‌ను ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిణ్ రెడ్డి ఆదివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోహిణ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపునిస్తుందన్నారు. ప్రతీ కార్యకర్త ఇందుకు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కష్ణగౌడ్ మాట్లాడుతూ.. ఆయన నియామకానికి సహకరించిన మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు విహెచ్ హనుమంతరావుకు, రోహిణ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి లకుపతి యాదగిరి గౌడ్, లేబర్ బోర్డ్ మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

- సీఎం రేవంత్ రెడ్డికి ఆర్‌యూపీపీ ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భాషా పండితుల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యుపీపీ-టీఎస్) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి నర్సింహులు, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, విజయ్ కుమార్ (నాగర్ కర్నూల్ జిల్లా) ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డిని కలిసి దశాబ్దాల తమ కల నెరవేర్చారంటూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 8,630 మంది భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు వచ్చాయని చెప్పారు. అడెక్వెసి బ్యాక్‌లాగ్ కారణంగా పదోన్నతులు రానటువంటి భాషాపండితులకు భవిష్యత్‌లో భాషాపండితులుగా నియామకమయ్యేవారు ఎవరూ లేనందున బ్యాక్‌లాగ్ పోస్టులను సాధారణ పోస్టులుగా మార్చి పదోన్నతులు కల్పించాలని కోరారు.

అప్‌గ్రేడ్ కాకుండా మిగిలిపోయిన వెయ్యి మంది భాషా పండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్ భాషలుగా అప్‌గ్రేడ్ చేసి పండిత వ్యవస్థను పూర్తిస్థాయిలో రద్దు చేయాలనీ విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. భాషా పండితులకు స్కూల్ సిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు- తెలంగాణ (ఆర్‌యుపీపీటీ) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని ఆ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, కోశాధికారి వి.ఎస్.ఎస్.సి.శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల దాడి అమానుషం : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరీంనగర్‌లో బండి సంజయ్ ఇంటి ముట్టడి సందర్భంగా విద్యార్థి నాయకులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తక్షణమే నీట్‌ను రద్దు చేసి, మళ్ళీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్ర మంత్రులు స్పందించకుంటే అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులందరినీ తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో పోలీసు దాడులు, నిజామాబాద్ జిల్లాలో లాఠీచార్జ్ చేయటం ద్వారా ప్రజాస్వామిక హక్కులు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. నీట్ పరీక్షా పేపర్ లీకేజీ వల్ల దేశంలో సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగులు పోస్టులు తక్షణం భర్తీ చేయాలి

- పదోన్నతులపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్
- టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులు జాయిన్ కాకుండా మిగిలిన పోస్టులను, సీనియారిటీ ప్రకారం తర్వాత ఉన్నవారితో వెంటనే భర్తీ చేయాలని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని టీఎస్‌యుటీఎఫ్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి కె. సోమశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదోన్నతుల్లో కొంతమంది టీచర్లు రెండు, మూడు సబ్జెక్టుల్లో పదోన్నతులకు ఎంపికయ్యారని గుర్తు చేశారు. వారు కోరుకున్న సబ్జెక్టును మినహాయించి మిగతా వాటికి తర్వాత సీనియారిటీ ప్రకారం ఉన్నవారితో భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంలో ప్రజాప్రతినిధులు కూడా కీలకపాత్ర వహించాలన్నారు. గురుకుల, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో బదిలీలు వెంటనే నిర్వహించాలని, అనంతరం పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. జీవో నెంబర్ 12ను సవరించి ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులకు బీఈడీ చేసిన వారిని అర్హులుగా గుర్తించి వారికి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్టీజోన్-1, 2లలో జరుగుతున్న ఎస్జీటీల బదిలీల్లో ఖాళీల సంఖ్య తెలపాలన్నారు. సీనియారిటీ జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను వెంటనే నియమించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, రిటైరయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ త్వరితగతిన ఇవ్వాలని కోరారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు గొప్ప సమ్మారావ్, కె. రంజిత్ కుమార్, ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఆవారి శ్రీనివాస్, గురుకుల ఉపాధ్యాయుల కన్వీనర్ ఎల్లయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు సీహెచ్ రవీందర్ రాజు, హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, నాయకులు బద్దం వెంకటరెడ్డి, తాటికాయల కుమార్, సి సుజన్ ప్రసాదరావు, చంద్రశేఖరరావు, మురళి, యాకూబ్, వాసుదేవరెడ్డి తిరుపతి, రామయ్య, ఆరు జిల్లాల ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో 'పుష్పక్' ప్రయోగం సక్సెస్



బెంగళూరు: పునర్వినియోగ వాహకనౌకల (రీయూజబుల్ లాంచ్ వెహికిల్ ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్-) సామర్థ్యాన్ని పరీక్షించే ప్రయోగం మూడోసారి విజయవంతమైనట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వెల్లడించింది. ఈసారి మరింత సవాళ్లతో కూడిన వాతావరణంలో ప్రయోగాన్ని చేపట్టినట్టు తెలిపింది. అంతరిక్షం నుంచి వచ్చే వాహక నౌక పనితీరు, ల్యాండింగ్ పరిస్థితులను తాజా ప్రయోగం ద్వారా కండ్లకు కట్టినట్టు పేర్కొంది.

అంతరిక్షంలోకి ప్రయోగించిన ఉపగ్రహాల్లోని విడిభాగాలు, వాటిని మోసుకెళ్లే వాహకనౌకల పునరుద్ధరణ దిశగా ఇస్రో ఈ ఆర్ఎల్‌వీ ఎల్ఈఎక్స్ ప్రయోగాలను చేపడుతోంది. తద్వారా ఆర్ఎల్‌వీల అభివృద్ధికి అవసరమైన అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడంలో ఇస్రో నైపుణ్యాన్ని తాజా ప్రయోగం పునరుద్ఘాటిస్తున్నట్టు తెలిపింది. ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్ సిరీస్‌లో చివరి పరీక్షను కర్నాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ లో ఆదివారం ఉదయం నిర్వహించినట్టు వెల్లడించింది. ఆర్ఎల్‌వీ ఎల్ఈఎక్స్-01, ఎల్ఈఎక్స్-02 మిషన్ విజయవంతమైన తర్వాత మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన గాలి పరిస్థితుల్లో చేపట్టినట్టు తెలిపింది. తద్వారా స్వయంప్రతిపత్తి ల్యాండింగ్ సామర్థ్యాన్ని తిరిగి ప్రదర్శించినట్టు వివరించింది.

మూడు ముక్కలాట..!

- విభిన్న రాజకీయం,విచిత్ర పరిస్థితులు
- రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్
- ఎంపీ బీజేపీ, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్..!
- అందరూ కలిసి పనిచేస్తేనే అభివృద్ధి
- ఇదీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రస్తుత పరిస్థితి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజకీయాల్లో ఒక్కోసారి విచిత్ర ఘటనలు చోటు చేసుకుంటూ ఉంటాయి. అధికారంలో ఒక పార్టీ ఉంటే, మరో పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు నియోజక వర్గాల్లో ఉంటుంటారు. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సత్సంబంధాలు లేకుంటే అభివృద్ధికి ఆటంకమే.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం అలాంటి విచిత్ర పరిస్థితే నెలకొంది. ఇక్కడి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ.. రాష్ట్రంలో అధికారంలో లేదు. అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక ఎంపీ లేరు. ఎంపీగా గెలుపొందిన పార్టీ రాష్ట్రంలో అధికారంలోనే కాదు, ప్రధాన ప్రతిపక్షంలో కూడా లేదు. ఈ విపత్కర పరిస్థితుల వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విచిత్ర రాజకీయ పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి కూన శ్రీశైలంగౌడ్, రాంచందర్‌రావు, కాంగ్రెస్ నుంచి మైనంపల్లి హనుమంతరావు లాంటి వారు పోటీ పడ్డారు. ఇలాంటి ఉద్దండులను కాదని ఓటర్లు జిల్లాలోని ఐదు స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించారు. అనూహ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాయి. ఇక్కడ అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల మధ్య సరైన సంబంధాల్లేవు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీకి చెందిన నేతలు ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ఇక్కడ తాము ఎమ్మెల్యేలమనీ, ప్రొటోకాల్ పాటించకుంటే ఊరుకునేది లేదని బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. దీంతో అధికార పార్టీ నేతల మాట వినాలా..? ఎమ్మెల్యేల మాట వినాలా..? అన్న దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లోనూ విచిత్ర పరిస్థితి

పార్లమెంట్ ఎన్నికల్లోనూ జిల్లాలో ఇలాంటి విచిత్ర పరిస్థితే ఉంది. మల్కాజిగిరి ఎంపీగా బీజేపీ నుంచి ఈటల రాజేందర్ విజయం సాధించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ రాష్ట్రంలో కాకుండా, కేంద్రంలో అధికారం ఉంది. మెజారిటీ స్థానాలు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు రావడంతో ఆ కూటమే అధికారం చేపట్టింది. దీంతో జిల్లా రాజకీయాలు విచిత్రంగా మారాయి. జిల్లా ప్రజలు కూడా తమకు ప్రభుత్వంతో పనులు చేయించుకునేందుకు ఎవరిని కలవాలన్న దానిపై తేల్చుకోలేకపోతున్నారు. కాగా ఎమ్మెల్యే, ఎంపీ ఏ పార్టీకి చెందిన వారైనా, అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేసేవారికి గుర్తింపు లభిస్తుందన్నది జగమెరిగిన సత్యం. ప్రభుత్వ పెద్దలను కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించి, అవసరమైన నిధులు మంజూరు చేయించుకు రావాల్సిన బాధ్యత ఎమ్మెల్యే, ఎంపీపై ఉంటుంది.

అందరూ కలిస్తేనే అభివృద్ధి

జిల్లా కేంద్రంగా ఎదిగిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీలో అక్కడక్కడ రోడ్ల సమస్యలు ఉన్నాయి. ఎండాకాలంలో తాగునీటి సమస్య, మార్కెట్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీలు, ఈగోలను పక్కన పెట్టి కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రస్తుతం కూన శ్రీశైలం గౌడ్, రాంచందర్‌రావు, మైనంపల్లి హనుమంతరావు ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓటమి పాలైనా.. వారికి దాదాపు 50వేల మందికిపైగా ఓట్లు వేశారు. వారి కోసమైనా వీరు అభివృద్ధికి సహకరించాల్సి ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల అభివద్ధితో పాటు విద్యారంగ అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారం కోసం, పనుల విషయంలో అందరూ కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

షాక్‌కు గురయ్యాం



- నీట్-పీజీ పరీక్ష వాయిదా బాధాకరం
- కేంద్రంపై విద్యార్థుల ఆగ్రహం
- ఇంకా కొత్త తేదీని ప్రకటించని సర్కారు

న్యూఢిల్లీ : పోటీ పరీక్షలైన నీట్, నెట్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నేడు జరగాల్సిన నీట్-పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) పరీక్షలు కేంద్రం వాయిదా వేసింది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షల పవిత్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే, పరీక్ష జరగటానికి ముందురోజు రాత్రే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవటం విద్యార్థులను షాక్‌కు గురి చేసింది. పరీక్ష కోసం దేశ, విదేశాల నుంచి వచ్చిన పలువురు విద్యా ర్థులు మోడీ సర్కారు తీరును తీవ్రంగా తప్పుబడుతు న్నారు. వారంతా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. చివరి గంటలో పరీక్ష వాయిదా పడటంతో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, వాయిదా పడిన పరీక్ష కొత్త తేదీని ప్రభుత్వం ఇంకా ప్రకటించాల్సి ఉన్నది. చాలా మంది విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవటానికి ఇతర నగరాలకు వెళ్లాల్సి వచ్చింది. కాగా, విద్యార్థులు తమ ఆందోళనలను సామాజిక మాధ్యమాలే వేదికగా వెలిబుచ్చుతున్నారు. "చాలా మంది విద్యార్థులకు చాలా బాధ ఉన్నది. పరీక్షల వాయిదాలతో ఆడుకుం టున్నారు" అని ఒక విద్యార్థి ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. "నేను 168 కి.మీలు ప్రయాణించాను. నిద్రలేచి చూడగానే పరీక్ష వాయిదా పడింది. మేరా దేశ్ మహాన్ హై" అని ఒక వ్యక్తి రాసుకొచ్చాడు. "నేను పరీక్ష కోసం 470 కిలోమీటర్లు ప్రయాణించాను. నేను హిమాచల్‌వాసిని. హిమాచల్‌లో పని చేస్తున్నాను. నేను హర్యానాలోని హిసార్‌లో పరీక్షా కేంద్రం పడింది" అని ఒక అమ్మాయి పేర్కొన్నది. "ఇదేమిటి? మిగతా పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. నీట్ పీజీ వంటి పరీక్షలను పరీక్షకు ఒకరోజు ముందు వాయిదా వేయడం విద్యార్థులకు ఎంత బాధ కలిగించగలదో మీరు ఊహించగలరా? ఎవరూ ఏమీ చెప్పటం లేదు. రేపు పరీక్ష నిర్వహించటంలో తప్పు ఏమిటి?" అని ఓ ఎక్స్ వినియోగదారు పోస్ట్ చేశాడు. నీట్‌లో అవకతవకలు, యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఇలాంటి తరుణంలో కేంద్ర దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చీఫ్‌ని ఇప్పటికే ఆ పదవి నుంచి తొలగించింది. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సుబోధ్ కుమార్‌సింగ్ స్థానంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ సింగ్ ఖరోలా నియమితులయ్యారు.

'వైద్యుల భావోద్వేగాలతో ఆడుకుంటున్న ప్రభుత్వం'

షెడ్యూల్ చేయబడిన పరీక్ష రద్దును విమర్శిస్తూ యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్య మిట్టల్ మాట్లాడారు. దీనిని 'డాక్టర్ల భావోద్వేగాలతో ఆడుకోవడం'తో పోల్చారు.భారత వైద్య విద్యా వ్యవస్థ తీవ్రంగా బలహీనపడిందని ఆయన నొక్కి చెప్పారు. "ఆదివారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను తాజాగా రద్దు చేశారు. సమగ్రతను, సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షను వాయిదా వేసినట్టు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తన పత్రికా ప్రకటనలో పేర్కొన్నది. నీట్-యూజీ తర్వాత ఇది మరో స్కామ్. షెడ్యూల్‌కు 10 గంటల ముందు పరీక్ష రద్దు చేయటం వైద్యుల భావోద్వేగాలతో ఆడుకోవటం కంటే తక్కువ కాదు" అని మిట్టల్ అన్నారు.పరీక్ష వాయిదాపై ఒక అభ్యర్థి మాట్లాడుతూ, " నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకైంది నీట్-పీజీ పరీక్ష 12 గంటల ముందు వాయిదా పడింది. పరీక్ష తేదీని ఇంకా ప్రకటించలేదు. ఆరోగ్య రంగంపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో దీన్నిబట్టి అర్థమవుతుంది. కేంద్ర ఆరోగ్య మంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి చేసిన పనికి క్షమాపణ చెప్పాలి. ఈ ఖర్చులను ప్రభుత్వం తిరిగి చెల్లించాలి" అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు నీట్ పీజీ పరీక్ష రాయటానికి తాను ఖతార్ నుంచి వచ్చిన ఒక విద్యార్థిని.. పరీక్ష వాయిదా పడటంతో షాక్‌కు గురైంది.

పేపర్ లీక్ స్పష్టం - కేంద్రానికి బీహార్ ఈఓయూ నివేదిక

నీట్-యూజీ పరీక్ష లీక్‌కు సంబంధించి బీహార్ ప్రభుత్వ ఆర్థిక నేరాల విభాగం (ఈఓయూ) కేంద్రానికి నివేదికను సమర్పించింది. నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్‌ను స్పష్టంగా సూచిస్తున్నదని పేర్కొన్నది.

మోడీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం : రాహుల్ గాంధీ

నీట్-పీజీ వాయిదాపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దేశంలో విద్యా వ్యవస్థ నాశనమైందనటానికి ఇది మరొక దురదృష్టకర ఉదాహరణ అని ఆయన అభివర్ణించారు. "ఇప్పుడు నీట్-పీజీ కూడా వాయిదా పడింది. మోడీ పాలనలో విద్యా వ్యవస్థ నాశనమైందనటానికి ఇది మరొక దురదృష్టకర ఉదాహరణ. బీజేపీ పాలనలో విద్యార్థులు చదువుతో కెరీర్‌ను నిర్మించుకోకుండా, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు ప్రభుత్వంతో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేపర్ లీక్ రాకెట్, ఎడ్యుకేషన్ మాఫియా ముందు పూర్తిగా నిస్సహాయంగా ఉన్న మోడీ.. ప్రతిసారీ కళ్లజోడును మౌనంగా చూసేవాడని ఇప్పుడు అర్థమైంది. మోడీ అసమర్థ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు పెను ముప్పు. దాని నుంచి దేశ భవిష్యత్తును మనం కాపాడాలి" అని ఎక్స్‌లో రాహుల్ పేర్కొన్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో డిమాండ్

దేశంలో నీట్-యూజీ, నెట్, నీట్-పీజీ పరీక్షల విషయంలో చోటు చేసుకున్న పరిస్థితులపై సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్ర ఆవేదనను వ్యక్తం చేసింది. పరీక్షల్లో ఇలాంటి అవకతవకలు, ప్రక్రియల పూర్తి పతనం దేశంలోని ఉన్నత విద్యకు సంబంధించిన ముఖ్యమైన రంగాలను ప్రభావితం చేస్తుందని ఆందోళన వెలిబుచ్చింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. దీని ప్రకారం.. "ఇది ప్రాథమికంగా చెప్పినట్టు అవినీతి ఫలితం మాత్రమే కాదు. ఇది విద్యా రంగంలో కేంద్రీకరణ, వాణిజ్యీకరణ, మతతత్వాల నుంచి ఉద్భవించింది. ఇది జాతీయ విద్యా విధానంలో ముఖ్యమైన అంశం. కొత్త ప్రభుత్వం(మోడీ సర్కార్) ఈ కుంభకోణాలపై దర్యాప్తు చేయటానికి సీబీఐ సేవల కోసం పిలుపునివ్వటమంటే 'వ్యాపమ్ స్కామ్'లో లాగే నీరు గార్చేందుకు దాని విధానాన్ని నిర్ధారిస్తుంది. ఉన్నత విద్యలో పాలసీ ప్రిస్క్రిప్షన్ల పూర్తి పతనాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి. దీనికి మొత్తం ప్రభుత్వం, ముఖ్యంగా విద్యా మంత్రి బాధ్యత వహించాలి. మంత్రి రాజీనామా చేయాలి. భారత్ వంటి పెద్ద, వైవిధ్యభరితమైన దేశంలో ఉన్నత విద్య పరిపాలన కేంద్రీకరణను తిప్పికొట్టాలి. కేంద్రీకృత నీట్ పరీక్షలను రద్దు చేయటం మొదటి అడుగు కావాలి. వృత్తిపరమైన విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ప్రతి రాష్ట్రం పరీక్షలను నిర్వహించటానికి వారి స్వంత ప్రత్యేక విధానాలను అనుమతించాలి" అని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

కేరళ ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ మంత్రిగా ఒఆర్ కేలు

తిరువనంతపురం : కేరళ రాష్ట్ర షెడ్యూల్డ్ తరగతులు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖ మంత్రిగా ఒఆర్ కేలు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఆరిఫ్ ముహమ్మద్ ఖాన్ ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రివర్గ సహచరులు హాజరయ్యారు. ఒఆర్ బాలు మనంతవాడి నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రమాణస్వీకారం చేసిన అనంతరం సచివాలయం నార్త్ బ్లాక్‌లోని కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఆయన భార్య శాంత, పిల్లలు మిథున, భావన, ఇతర బంధువులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. ఇదివరకు ఈ శాఖ మంత్రిగా ఉన్న దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ అధ్యక్షుడు కె రాధాకృష్ణన్ పార్లమెంటుకు ఎన్నికకావడంతో ఆయన స్థానంలో ఒఆర్ కేలు కేబినెట్‌లోకి వచ్చారు.



రెండు దశాబ్దాలకు పైగా కేలు ప్రజాప్రతినిధిగా సేవలందిస్తున్నారు. తిరునెల్లి గ్రామ పంచాయతీలోని ఎడయూర్‌కున్ వార్డులో 2000 సంవత్సరంలో ప్రజాప్రతినిధిగా గ్రామ పంచాయతీ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. సిపిఎం రాష్ట్ర కమిటీలో వయనాడ్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన తొలి గిరిజన నాయకులు కేలు కావడం విశేషం. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పలు గిరిజనోద్యమాలకు ఆయన నేతృత్వం వహించారు. ప్రస్తుతం మనంతవాడి (ఎస్‌టి) నుంచి ఆయన శాసనసభ సభ్యునిగా ఉన్నారు. కురిచ్య కమ్యూనిటీకి చెందిన ఆయన ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై శాసనసభ కమిటీకి ఛైర్మన్‌గానూ, కేరళ పశు, పశుసంవర్థక శాస్త్ర విశ్వవిద్యాలయ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యునిగానూ పనిచేస్తున్నారు. తిరునెల్లి గ్రామ పంచాయతీకి 2005 మరియు 2010లో వరుసగా 10 సంవత్సరాలు అధ్యక్షులుగా సేవలందించారు. అనంతరం 2015లో తిరునెల్లి డివిజన్ నుంచి మనంతవాడి బ్లాక్ పంచాయతీ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పికె జయలక్ష్మిపై మనంతవాడి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మనంతవాడి నుంచి మళ్లీ ఎన్నికయ్యారు.

బెయిల్‌పై స్టేను సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ : తన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించడాన్ని సవాలు చేస్తూ ఆప్ జాతీయ కన్వీనర్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు గురువారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ బెయిల్ ఉత్తర్వులు కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలోపే .. స్టే విధించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ హైకోర్టును కోరింది. ఇడి అభ్యంతరాలతో కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. తుది నిర్ణయం కోసం తదుపరి విచారణను మంగళవారం నాటికి వాయిదా వేసింది. దీంతో తన బెయిల్‌పై స్టేను సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

మణిపూర్‌లో ఇరు వర్గాల మధ్య కాల్పులు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. తాజాగా ఇరు వర్గాల మధ్య తాజాగా కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని థమ్నాపోక్పీ, లామ్లాయ్ ప్రాంతాలకు సమీపంలోని కాంగ్‌పోక్పీ జిల్లాలోని కొండపై నుంచి రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కొంతమంది సాయుధ దుండగులు కాల్పులు జరిపినట్టు ఓ పోలీస్ అధికారి తెలిపారు. స్థానిక గ్రామ వలంటీర్లు ఎదురు కాల్పులు జరిపారని అన్నారు. సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయని, గంట తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చిందని చెప్పారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఆ అధికారి తెలిపారు.

అమెరికాలో కాల్పులు - ఏపీ యువకుడు మృతి

బాపట్ల : అమెరికా ఆర్కెన్సాస్‌లోని సూపర్ మార్కెట్‌లో జరిగిన కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన యువకుడు మృతి చెందారు. బాపట్ల జిల్లాకు చెందిన యువకుడు దాసరి గోపీకృష్ణ ఆర్కెన్సాస్ రాష్ట్రంలోని సూపర్ మార్కెట్లో పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం దుండగులు జరిపిన కాల్పుల్లో గోపీకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతుడి స్వస్థలం బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలిగా అధికారులు గుర్తించారు.

భారత్‌లో 40 ఏండ్లలోపే క్యాన్సర్ కేసులు పైపైకి..

న్యూఢిల్లీ : ప్రాసెస్డ్ ఫుడ్, అధిక ఒత్తిడితో కూడిన అనారోగ్యకరమైన జీవన శైలితో భారత్‌లో 40 ఏండ్లలోపు వారిలో కేన్సర్ కేసులను పెంచుతున్నాయని వైద్యులు ఆదివారం పేర్కొన్నారు. కదలకుండా ఎక్కువ సేపు కూర్చుని ఉండటం కూడా భారత్‌లో యువకులు క్యాన్సర్ బారినపడేలా చేస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. ఢిల్లీకి చెందిన కేన్సర్ ముక్త్ భారత్ ఫౌండేషన్ ఇటీవల ఓ సర్వే చేపట్టింది. ఈ సర్వే ప్రకారం భారత్‌లో ప్రస్తుతం 40 ఏండ్లలోపు వారిలో 20 శాతం క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నాయని పేర్కొంది. పురుషులు 60 శాతం ఉండగా, మిగిలిన 40 శాతం కేసుల్లో మహిళలు ఉన్నారని తెలిపింది.

ఓట్లు కావాలి... కానీ సీట్లు ఇవ్వొద్దు

- గెలుపు గుర్రాలు కావన్న కుంటిసాకుతో టిక్కెట్ల నిరాకరణ
- రాజకీయంగా తెరమరుగు చేసేందుకు ఎత్తుగడలు
- చట్టసభల్లో నానాటికీ తగ్గిపోతున్న ప్రాతినిధ్యం





న్యూఢిల్లీ : దేశంలో దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లింల ఓట్ల కోసం వెంపర్లాడుతున్నాయే కానీ వారిని చట్టసభలకు పంపేందుకు మాత్రం సుముఖత చూపడం లేదు. హిందూత్వ పార్టీ అయిన బీజేపీ మొదటి నుండీ ముస్లిం వ్యతిరేకతను నింపుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో పాటు ఇతర బీజేపీ యేతర పార్టీలు కూడా ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపులో ముస్లింలను చిన్నచూపు చూస్తూనే ఉన్నాయి. ఫలితంగా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం నానాటికీ తగ్గిపోతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే దేశంలో ముస్లింలకు రాజకీయ ప్రాతినిధ్యమే లేకుండా చేయాలన్న బీజేపీ లక్ష్యం నెరవేరడానికి ఎంతో కాలం పట్టదు.నరేంద్ర మోడీ నూతన క్యాబినెట్‌లో పది మంది దళితులు, 27 మంది ఇతర వెనుకబడిన తరగతులు, ఐదుగురు మతపరమైన మైనారిటీలు, ఏడుగురు మహిళలకు చోటు లభించింది. ఎన్డీఏ తరఫున సిక్కులెవ్వరూ లోక్‌సభకు ఎన్నిక కాలేదు. ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక సిక్కు రవనీత్ సింగ్ బిట్టూ ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ బిట్టూతో పాటు సిక్కు మతానికే చెందిన రాజ్యసభ సభ్యుడైన హర్‌దీప్ పూరీకి మంత్రి పదవులు లభించాయి. క్రైస్తవుడైన జార్జ్ కురియన్ ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ ఆయనకూ మంత్రిమండలిలో స్థానం కల్పించారు. తన క్యాబినెట్‌లో అన్ని వర్గాలు, మతాల వారికీ ప్రాతినిధ్యం కల్పించిన ప్రధాని నరేంద్ర మోడీ ముస్లింలను మాత్రం పూర్తిగా విస్మరించారు.

ప్రతిపక్షాలదీ అదే దారి

2014 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల తరఫున 320 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ చేశారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో వీరి సంఖ్య 94కు పడిపోయింది. ప్రస్తుతం పార్లమెంటులోనే కాదు...రాష్ట్రాల శాసనసభల్లో కూడా బీజేపీకి చెందిన ముస్లిం ప్రతినిధులెవ్వరూ లేరు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా ముస్లింలకు సముచిత స్థానాన్ని ఇవ్వడం లేదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల నుండి ఆ పార్టీ తరఫున ఒక్క ముస్లిం కూడా పోటీ చేయలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, ఎన్సీపీ, సీపీఐ (ఎం) పార్టీలు కలిపి 43 మంది ముస్లిం అభ్యర్థులను మాత్రమే రంగంలోకి దింపాయి. 2019 ఎన్నికల్లో 115 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ చేస్తే తాజా ఎన్నికల్లో వారి సంఖ్య మరింత తగ్గిపోయింది. సీపీఐ (ఎం) మాత్రం ఈ పార్టీలన్నింటికీ భిన్నంగా ముస్లింలకు టిక్కెట్ల కేటాయింపులో పెద్ద పీట వేసింది. బెంగాల్ నుండి ఐదుగురిని, కేరళ నుండి నలుగురిని, తెలంగాణ నుండి ఒకరిని...మొత్తం పది మంది ముస్లిం అభ్యర్థులను నిలబెట్టింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ముస్లిం ఓట్ల కోసం ప్రయత్నించాయే తప్ప టిక్కెట్ల కేటాయింపులో మాత్రం ఆ వర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని, పూర్తిగా విస్మరించాయని అశోకా యూనివర్సిటీకి చెందిన రాజకీయ శాస్త్రవేత్త, చరిత్రకారుడు అలీ ఖాన్ మహమూదాబాద్ చెప్పారు.

సీపీఐ(ఎం) మినహా.. ముస్లింలపై అన్ని పార్టీలదీ అదే దారి

సంఖ్యా బలం ఉన్నప్పటికీ...

చట్టసభల్లో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గడానికి, అదే సమయంలో బీజేపీ బలం పుంజుకోవడానికి మధ్య సంబంధం ఉన్నదని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. మోడీ హయాం రాకముందు బీజేపీ సైతం జాతీయ రాజకీయాల్లో తన ముస్లిం వ్యతిరేకతను బహిరంగంగా బయటపెట్టలేదు. వందకు పైగా నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని 12 జిల్లాల్లో ముస్లిం జనాభా 90 శాతానికి పైగా ఉంది. 70 నుంచి 90 శాతం ఉన్న జిల్లాలు ఆరు, 60 నుంచి 70 శాతం ఉన్న జిల్లాలు ఆరు, 50 నుంచి 60 శాతం ఉన్న జిల్లాలు తొమ్మిది, 40 నుంచి 50 శాతం వరకూ ఉన్న జిల్లాలు పది ఉన్నాయి. 2014, 2019 ఎన్నికల్లో ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను సంఘటితపరచి మోడీ అధికారాన్ని పొందగలిగారు. 2023 నాటికి భారత చరిత్రలోనే తొలిసారిగా అధికార పార్టీకి ఒక్క ముస్లిం మంత్రి కానీ, ఒక్క ముస్లిం పార్లమెంట్ సభ్యుడు కానీ లేకుండా పోయారు.

విద్వేష ప్రసంగాలతో విషం చిమ్మారు

ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ నేతలు ముస్లింలపై కావాల్సినంత విషం చిమ్మారుసమాజంలోని ఇతర వర్గాల వారిలో వారి పట్ల ద్వేషాన్ని నింపారు. ద్వేష ప్రసంగాలు చేశారు. హింసకు తెగబ డ్డారు. గోవును వధిస్తారంటూ దుష్ప్రచారం చేశారు. లవ్ జిహాద్ ప్రస్తా వన సరేసరి. సాక్షాత్తూ ప్రధాని మోడీ, ఆయ న క్యాబి నెట్ సహచరులు ముస్లింలను లక్ష్యంగా చేసుకొని రెచ్చ గొట్టేలా ప్రసంగించారు. వారిని చొరబా టుదారు లని, అవిధేయు లని, లవ్ జిహాదీలని, ఏదో ఒక రోజు హిందూ మెజారిటీని దాటేయాలన్న కుట్రతో అధి,క సంతానాన్ని కంటున్నారని ...ఇలా పలు నిందలు వేశారు.

విజయావకాశాలు లేవనే ఇవ్వలేదట

లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున పోటీ చేసిన ముస్లిం అభ్యర్థుల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ మొత్తంగా 24 మంది విజయం సాధించారు. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ దాదాపుగా ఇంతే సంఖ్యలో ముస్లింలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. హిందూత్వ పార్టీ అయిన బీజేపీ మొదటి నుండీ ముస్లింలను చిన్నచూపు చూస్తూనే ఉంది. కానీ లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న బీజేపీ యేతర పార్టీలు సైతం టిక్కెట్ల కేటాయింపులో ముస్లింలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం గమనార్హం. ఇది ముస్లింల పట్ల వివక్ష చూపడం కాదని, గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేయడం వల్లనే ఇలా జరిగిందని ప్రతిపక్షాలు చెపుతున్నాయి. మరో మాటలో చెప్పాలంటే గెలిచే అవకాశాలు లేనందుకే ముస్లింలకు టిక్కెట్లు ఇవ్వలేదని అవి అంటున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ముస్లిమేతరులతో పోలిస్తే ముస్లిం అభ్యర్థుల్లోనే సక్సెస్ రేటు అధికంగా ఉంది.

మ్యానిఫెస్టోలూ అంతే...

ఇక వామపక్షాలు మినహా మిగిలిన ప్రతిపక్ష పార్టీలన్నీ తమ ఎన్నికల ప్రచారంలో దేశంలోని ప్రధాన సమస్యలను ప్రస్తావించాయే తప్ప ముస్లింల ఊసే ఎత్తలేదు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ముస్లింలు అనే మాటే కన్పించలేదు. కాంగ్రెస్ మాత్రమే కాదు...దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలు ముస్లిం పౌరుల రాజ్యాంగ హక్కులను పరిరక్షిస్తామని తమ మ్యానిఫెస్టోల్లో ఒక్క హామీ కూడా ఇవ్వలేకపోయా యి. జనాభాకు తగినట్లు లేని ప్రాతినిధ్యం జనాభాలో తమ వాటాకు తగినట్లు ముస్లింలు లోక్‌సభలో ఎన్నడూ ప్రాతినిధ్యంపొందలేకపోయారు. దేశంలో తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగిన 1952వ సంవత్సరం నుండి సగటున 6 శాతం మంది ముస్లింలు మాత్రమే చట్టసభ సభ్యులయ్యారు. గతంలో బీజేపీ యేతర ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు ముస్లింలను కొంతమేర రాజ్యసభకు పంపేవి. దీంతో ఎగువ సభలో సగటున 10.5 శాతం మంది ముస్లిం సభ్యులు ఉండే వారు. పార్లమెంట్ ఉభయ సభలు, వివిధ రాష్ట్రాల శాసనసభల్లో కలిపి ముస్లింల ప్రాతినిధ్యం 1980వ దశకం మధ్య నుండి తగ్గుతూ వస్తోంది. 1980వ దశకం మధ్యలో దేశ జనాభాలో 11 శాతం మంది ముస్లింలు ఉంటే పార్లమెంటులో 9 శాతం ఉండే వారు. అయితే ఆ తర్వాత ఉభయ సభల్లో ముస్లింల సంఖ్య వారి జనాభాకు ఏనాడూ తగినట్లు లేదు. 2019 ఎన్నికల తర్వాత దేశ జనాభాలో ముస్లింలు కనీసం 14 శాతం మంది ఉన్నారని అంచనా. కానీ లోక్‌సభలో వీరి ప్రాతినిధ్యం కేవలం 5 శాతం మాత్రమే.

నాణ్యతకు పాతర

బీహార్‌లో వరుసగా కుప్పకూలుతున్న వంతెనలు..

ఆందోళనలో ప్రజలు



పాట్నా : బీహార్‌లో వరుసగా వంతెనలు కుప్పకూలుతున్నాయి. ఇప్పటికే రెండు బ్రిడ్జిలు పేకమేడలా కూలిపోగా తాజాగా తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న మరో వంతెన కూలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. వారం రోజుల వ్యవధిలో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మోతీహరి ప్రాంతంలో రూ.1.5 కోట్ల వ్యయంతో 16 మీటర్ల వంతెనను నిర్మిస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న ఈ వంతెన కూలిపోవడానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన అధికారులు శాఖా పరమైన దర్యాప్తునకు ఆదేశించారు. కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపక్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి గతంలో స్థానికులు అడ్డుపడ్డారు. దీంతో వారే కూల్చేసి ఉంటారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన రాజధానులకు నిధులివ్వండి

- కేంద్రాన్ని కోరిన ఏపీ, ఛత్తీస్‌గఢ్
- ప్రత్యేక గ్రాంట్ అడిగిన కేరళ



న్యూఢిల్లీ : నూతన రాజధానుల అభివృద్ధి కోసం నిధులు అందించాలని ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రాజెక్టులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలని తమిళనాడు, హర్యానా, ఒడిషాలు అభ్యర్థించాయి. ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రూ.24,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ అందజేయాలని కేరళ కోరింది. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్‌ను నెరవేర్చాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ కోరుతుందని అందరూ భావించారు. అయితే అమరావతిలో నూతన రాజధాని, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాలు సహా అనేక ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రాజధాని ఢిల్లీలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బడ్జెట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. వివిధ రంగాలలో తమ రాష్ట్రం దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తోందని, ప్రస్తుత ద్రవ్య ఒత్తిడిని అధిగమించేందుకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేరళ ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ ఈ సందర్భంగా కోరారు. మార్కెట్ రుణాలపై విధించిన పరిమితిని సమీక్షించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. బియ్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలను సడలించాలని ఛత్తీస్‌గఢ్ కోరింది. చెన్నయ్ మెట్రో రైలు రెండో దశకు బడ్జెట్‌లో రూ.63 వేల కోట్లు కేటయించాలని తమిళనాడు విజ్ఞప్తి చేసింది. కేంద్ర పన్నుల పంపిణీ అంశాన్ని పలు రాష్ట్రాలు ప్రస్తావించాయని నిర్మలా సీతారామన్ చెప్పారు.

డా.ఎన్.గోపి కవిత్వంలో 'కవిత్వ కవిత'



కవిత్వమనగానే కవులు రకరకాల వస్తువులను ఆశ్రయిస్తారు. కొన్ని సందర్భాల్లో వస్తువు వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టుగా మన చుట్టే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో లోపల దమనంలో ఉన్న భావాలను కాగితంపై కుప్పపోయాల్సి వస్తుంది. కొంతమంది కవులు కవితను గొప్పగా రాయాలని అలంకారాలను, భాషను ఒక పథకం ప్రకారం పేరుస్తారు. ఎన్ని చేసినా కవిత పండేది సహజాతి సహజ స్థితిలోనే. కవి నేర్పును బట్టి వస్తునిర్వహణ ఉంటుంది. ఇవన్నీ రకరకాల వస్తువులను తీసుకొని రాసే సందర్భాలు. మరి మనం ఈ వ్యాసంలో మాట్లాడుకునేది కేవలం కవిత్వం వస్తువుగా తీసుకొని రాసిన కవితలు మాత్రమే. అలాంటి కవితలనే మనం 'కవిత్వకవిత' అని అంటాం. కవి దృష్టిలో కవిత్వం ఎలా ఉండాలో తెలియజేస్తూ రాసే కవితే కవిత్వకవిత. డా॥ఎన్.గోపి గారి కవితాసంకలనంలో చాలావరకు వీటిని చూస్తాం. అది వారికి కవిత్వం పట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమ.

గోపి గారి కవిత్వంలో వస్తువిస్తృతి ఎక్కువ. రాసిన కవిత్వమంతా ఒక ఆర్డర్‌లో ఉంటుంది. ఇంతవరకే రాయాలన్న పరిమితులు లేవు. సార్వజనీనత, సమకాలీనత వారి కవిత్వంలో కనబడుతుంది.

మొదటి పుస్తకం 'తంగేడుపూలు' నుండి నిన్న మొన్న వచ్చిన 'క్రియ-ఒక జీవనలయ' వరకు వున్న సాహిత్యాన్ని పరిశీలిస్తే కవిత్వ నిర్మాణపరంగా వారి క్రమశిక్షణ ఆశ్చర్యపరుస్తుంది. కాలమాన పరిస్థితులను బట్టి మొదట్లో కవితలో అలంకారాలు, పదబంధాలు విరివిగా వేసి బిగుతు చేసి రాసేవారు. తర్వాతికాలంలో సరళ వచనంతోనే గాఢతను సాధిస్తూ కవితా దిశను, స్వరూపాన్ని మార్చి వచనకవులకు కొత్తబాట వేశారు. వారు ఎలా రాసినా కవితావాక్యం సరికొత్త పుంతలు తొక్కి కవిత్వానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది తప్ప ఫలానా కవితలో చేసిన ప్రయోగం విఫలమయింది అన్న మాటే లేదు.


కవిత్వం రాయటం గొప్ప కళ. ఏదో మాయ చేసి నాలుగు వాక్యాలను పేర్చటం కవిత కాదు. కవితలో నుంచి సూర్యుడు ఉదయించాలి. లౌక్యంతో రాయటం కవిత కాదు. మదిలో పది కాలాలు నిలవగలగాలి. అలాంటి కవిత్వం రాయలేనప్పుడు పేజీలను హింసించి ఉరి తీయడం భావ్యం కాదు కదా!

గోపిగారు అందుకోసమే కవిత్వాన్ని చంపకు రా నాయనా, ఆత్మహత్య చేయించకు అని చెబుతూ 'నిత్యారుణ గీతం' అనే కవితలో కవిత్వం ఎంత గొప్పదో తెలియజేశారు.

"లోకంలో మునిగిన సూదంటురాయివై అనుభవాలను రాల్చి/ కవిత్వంగా పేరుస్తున్నావు/ సంవేదనకు సంతృప్తి ఉండదు/ మరణ సదృశ్యమది/ నది సముద్రంలో ఆత్మహత్య చేసుకున్నట్టు" (ఎండపొడ, పేజీ 22) కవి నిద్రలేని రాత్రులు గడుపుతాడు. కవిత రాయటం కోసం ఆరోగ్యం చెడిపోయే సందర్భాలెన్నో. కవిత్వం అంటే పిచ్చి కవికి. లక్షలు కావాలనడు. జీవించడానికి కనీస అవసరాలు ఉంటే చాలు అనే నిజాయితీతో జీవిస్తాడు. ప్రాణం పెట్టి కవిత్వం రాస్తాడు. ఇంత చేస్తే చివరికి అతనికి మిగిలేది 'రాసిన నాలుగు అక్షరాలే'. గోపిగారు రాసిన 'కవి కన్నా కవిత గొప్పది' కవిత చదివితే కవికి, కవిత్వానికి మధ్య ఉండే సన్నని చీలిక తెలుస్తుంది.

"కవి కన్నా కవిత గొప్పది/ కవి మరణిస్తాడు/ కవిత బతుకుతుంది/ కవి మనిషి/ కవిత మానవత" (ఎండపొడ, పేజీ 35). కవిగా ఎంత లీనమైతే ఇంత తాత్వికతను వారు ఈ కవితలో అందించారు. దాదాపు ప్రతి కవితలో ఎత్తుగడలోనైనా, వస్తు నిర్వహణలోనైనా, ఆఖరికి ముగింపులోనైనా కవిత్వానికి సంబంధించిన వాక్యం రాకపోతే వారికి ఆ పద్యం అసంపూర్ణంగా అనిపిస్తుంది కావచ్చు.

గోపి గారి కవిత్వ కవితలు చదువుతుంటే కవిత్వానికి సంబంధించిన గాఢమైన భావాలు అల్లుకొని విడిచిపెట్టవు. కవిత్వమంటే ఇంతలా కవి ఆవేదన చెందాల్సి ఉంటదా? ప్రయత్నం చేయాల్సి ఉంటదా? అని అనుకునే వ్యక్తుల సందేహాలను పటాపంచలు చేసేట్టుగా సులువుగా అర్థం చేయిస్తారు. "కవిత్వాన్ని నిర్మించే క్రమాన్ని మార్మికంగా చెబుతూ దానికి జీవితాన్ని ముడిపెట్టి వచనకవితకో కొత్త నిర్వచనాన్ని సృష్టించటంలో గోపి గారిది అందెవేసిన చేయి.



గోపి గారి కవిత్వ కవితలు చదువుతుంటే కవిత్వానికి సంబంధించిన గాఢమైన భావాలు అల్లుకొని విడిచిపెట్టవు. కవిత్వమంటే ఇంతలా కవి ఆవేదన చెందాల్సి ఉంటదా? ప్రయత్నం చేయాల్సి ఉంటదా? అని అనుకునే వ్యక్తుల సందేహాలను పటాపంచలు చేసేట్టుగా సులువుగా అర్థం చేయిస్తారు. "కవిత్వాన్ని నిర్మించే క్రమాన్ని మార్మికంగా చెబుతూ దానికి జీవితాన్ని ముడిపెట్టి వచనకవితకో కొత్త నిర్వచనాన్ని సృష్టించటంలో గోపి గారిది అందెవేసిన చేయి.

'గుడ్డు' అనే కవితలో వారు కవిత్వానికిచ్చిన నిర్వచనాన్ని ఆస్వాదిద్దాం.

"గుడ్డు పెట్టడం కాదు/ పొదగడం ముఖ్యం/ చుట్టూ గోడలుడిగి/ పుట్టకముందే/ ఖైదీలుగా ఉన్న భావాలకు/ ముక్తిని ప్రసాదించడమే 'కవిత్వం'/ కవిత్వానికి ప్రాణమే ప్రాతిపదిక/ జీవితం దాని వేదిక" (మళ్ళీ వితనంలోకి, పేజీ 65). కోడి గుడ్డు పెట్టినప్పటి నుండి పిల్లగా మారేంత వరకు జరిగే ప్రక్రియలలాగే కవిత్వముంటదని ఆ పిల్ల ప్రాణం పోసుకున్నట్టే కవిత్వానికి ప్రాణమే మూలమని చెబుతూ వీటన్నింటికి తోడ్పాటునందించే వేదిక జీవితమని తాత్వికతా దోరణిలోంచి నిజనిర్ధారణ గావించారు.

కవిత్వ కవితలు కాని వాటిలో కూడా మనం కొన్ని కవిత్వానికి సంబంధించిన వాక్యాలను గమనిస్తాం. ఉదాహరణకు 'బల్లి' అనే పేరుతో రాసిన కవితలో మధ్యలోకి వెళ్ళాక **"నా కవిత్వంలో/ ఏదో వాసన దొరికినట్టు/ కొద్దిదూరంలో ఆగి/ నా వైపు చూస్తుంది"** (జీవన భాష, పేజీ 83) అనే వాక్యాలతో ఆ వస్తువును నడిపించుకుంటూ జోడించారు. వీటన్నింటినీ పరిశీలించినప్పుడు కవిత్వం గోపి గారి ప్రతి అడుగులో 'ముందయి' నడుస్తుందని అవగాహన చేసుకోవచ్చు.

చాలా కవితల్లో వారు కవిత్వాన్ని కలవరిస్తుంటారు. కవిత ప్రారంభం నుంచి చివరిదాకా చదివినప్పుడు ఏవో రెండు వాక్యాల్లో కవిత్వ సంబంధిత వాక్యాలు తళుక్కున మెరుస్తాయి.అవి మచ్చుకు ఇంకొన్ని చూద్దాం.

1. **ఎండలో కవిత్వం/ సలసల కాగిపోతుంది** (ఆర్తి అనే కవితలో పేదబతుకుల జీవనం ఎండలో ఎలా మగ్గిపోతుందో చెప్పడానికి ఈ వాక్యాలు రాశారు)
2. **కొంచెం మట్టి తెచ్చి కాగితంపై చల్లాను/ అవే ఈ అక్షరాలు** ('ఆకాశం మట్టి' కవితలో మట్టి యొక్క గొప్పతనం చెబుతూ కవిత్వాన్ని ఆపాదించి చెప్పిన మాటలు)

వారు రాసిన కవితా సంపుటాల నుంచి తీస్తే ఇలాంటి కవితా సంబంధిత వాక్యాలు కోకొల్లలు దొరుకుతాయి. రేఖా మాత్రం స్పర్శలోనే కవిత్వానికి సంబంధించిన ఎన్నో విషయాలను ఈ వ్యాసం ద్వారా మనం గ్రహించాం.

గోపి గారు కవితా సంపుటాల్లో రాసిన ప్రతీ 'కవిత్వ కవిత' ఒక ఆణిముత్యం. కావాలని పనికొట్టుకొని రాసిన కవిత్వం కాదు. సహజాతి సహజమైన ధోరణుల తీరు కవిత్వంలోకి ప్రవేశించింది తప్ప ఎక్కడా కృతకంగా లేదు. వారు కవిత్వ కవితలన్నింటిని కవితా సంపుటిగా వేస్తే కవిత్వం ప్రాశస్త్యం ఇంకా ఎక్కువ మందికి చేరే అవకాశం ఉంటుందని నా భావన.

పెన్నా శివరామకృష్ణ 'ఎన్.గోపి కవిత్వ కవిత' అనే వ్యాసంలో గోపిగారు రాసిన కవిత్వ కవితల్లో కూడా కొంతలోకొంత అతిశయోక్తి కనిపిస్తుందన్న భావన వెలిబుచ్చాడు. ఇన్ని పరిశీలనలు చేసి ఈ వ్యాసం రాసిన తర్వాత ఆ వాక్యాలతో నేను ఏకీభవించడానికి సంసిద్ధంగా లేను. కవిత్వం గూర్చి గొప్పగా చెప్పాలని ఆకాంక్ష తప్ప అతిశయోక్తి గోపిగారు రాసిన ఏ కవితా పాదంలోనూ కనిపించదు.


"నిత్యం/ అక్షరాల్లో దగ్ధమవుతూ/ అజరామర గీతమై బతుకుతాను" అని గోపి గారు రాసిన వాక్యాలు చదివితే 'కవిత్వం' అంటే వారికి ఎంత ప్రాణసమానమో అర్థమవుతుంది. వారు చెప్పుకున్నట్టుగా కవిత్వమున్నంత కాలం 'అజరామర గీతమై' అందరి గుండెల్లో పదిలంగా ఉంటారు. వారు సృష్టించిన ప్రక్రియ పరంగా నానీల గోపి అంటున్నారు. కవిత్వకవితలను (metaportry) అన్నింటిని చదివినంక వారిని కవిత్వ 'గోపి' అని పిలవాలనిపించింది.

(జూన్ 25న డా.ఎన్.గోపి 75 వ జన్మదినోత్సవం సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయంలో 'రేపటి మైదానం' కవితాసంపుటి ఆవిష్కరణ సభ సాయంత్రం ఆరు గంటలకు)



- డా॥ తండ హరీష్ గౌడ్
8978439551

గిరి పుత్రుడికి తొలి యువపురస్కారం




పుట్టి పెరిగిన చెట్టూచేమే అతడి అక్షరానికి ఆయువు. తనవాళ్ల కలిమిలేములే అతని కవితలకు, కథలకు వస్తువులు. ఆ అనుభవ పాఠాలతో అల్లిన భావాలు ఉభయ రాష్ట్రాల్లో డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశాలయ్యాయి. అతడి సాహితీ సౌరభాలు ఎల్లలు దాటి పరిమళిస్తున్నాయి. ఈ ఇరవై ఆరేండ్ల యువ రచయితను నేడు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం వరించింది. తెలుగులో ఆ పురస్కారం అందుకుంటున్న అత్యంత పిన్న వయస్కుడు, తొలి బంజారా యువకుడు రమేష్ కార్తీక్ నాయక్.

"ఒకప్పుడు అడవి బిడ్డలం. ఇప్పుడు అడవి వదిలేసిన బిడ్డలం. అడవి మీద హక్కులు పోయాయి. నిలబడ్డ నేల మీద కూడా హక్కులు లేకుండా పోయాయి. అందరి జీవితాల గురించి తెలీదు కానీ నా జీవితానికి, నా నేలకి, నా అనుభవాలకు నేను అతిథిని. ఇప్పుడు నా స్థితి ఖలీల్ జిబ్రాన్ 'మాడ్ మ్యాన్' కవితలా ఉంటుండేది. కలలో నాకో ప్రపంచం ఉంది. వాటి నుండి చాలా నేర్చుకుంటున్నాను. నా కవితలకు కథలకు వస్తువులు ఎక్కువ అక్కడే దొరుకుతుండేవి" ఓ ఇరవై ఆరేండ్ల పిల్లోడి నుండి ఇంతటి వేధనా భరితమైన, బాధ్యతా యుతమైన మాటలు వినడం ఓ విధంగా ఆశ్చర్యమే. సమాజం కోసం, తన జాతి కోసం తపిస్తూ అక్షరాలనే ఆయుధాలుగా మలుచుకుని సమాజంతో యుద్ధం చేస్తున్నాడు రమేశ్ కార్తీక్ నాయక్.

రమేశ్‌ది సన్నకారు రైతు కుటుంబం. తమలా మట్టి పిసుక్కోకూడదని పిల్లల్ని మంచి స్కూళ్లలో చేర్పించారు తల్లిదండ్రులు సేవంతాబాయి, సునావత్ మోజీరాంలు. ఆంగ్ల మాధ్యమంలో చేరినా.. గురువుల ప్రోత్సాహంతో తెలుగులో కవితలు, కథలు రాయటం ప్రారంభించాడు. సాహిత్యంపై మక్కువతో తరగతి పుస్తకాలకు బదులు కథలు, కవితల పుస్తకాలనే నేస్తాలుగా మలచుకునేవాడు. తర్వాత తను పాలిటెక్నిక్‌లో చేరడంతో మళ్లీ సాహిత్య సేద్యం మొదలైంది. డీఎడ్ చదివి ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ నుంచి స్పానిష్ భాషలో డిప్లొమాలో చేరాడు. రెండో ఏడాదికి ఉత్తీర్ణత సాధించినా ఆర్థిక ఇబ్బందుల వల్ల కొనసాగించలేదు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్‌లో ఎంఏ పూర్తి చేసిన అతడు, ప్రస్తుతం ఓయూలోనే ఎంఏ తెలుగు చదువుతున్నాడు. 2023లో ప్రయివేట్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పని చేశాడు. ప్రస్తుతం దూరదర్శన్‌లో 'అక్షరం' అనే సాహిత్య కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు.

అతడి అక్షర ప్రయాణం 'బల్దేర్ బండి' ఎక్కి 'ఢావ్లో' తో ఢిల్లీ చేరింది. అతడి తొలి కవితా సంపుటిలో గిరిజనులు బతుకుదెరువు కోసం వలస వెళ్లే క్రమంలో వినియోగించే ఎడ్ల బండి నేపథ్యంగా ఈ కవితలు ఉంటాయి. ఈ మట్టి పరిమళాలు పాఠకులకు ఎంతగా నచ్చాయంటే.. ఇందులోని 'జారేర్ బాటి' కవిత కాకతీయ విశ్వవిద్యాలయ డిగ్రీ కోర్సు ఐదో సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా చేర్చారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఎం.ఏ తెలుగు నాలుగో సెమిస్టర్‌లో పుస్తకం మొత్తాన్ని యూనిట్ పాఠ్యాంశంగా పెట్టారు. నూనూగు మీసాల వయసులో ఓ కుర్రాడు రాసిన కవితలు విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులకు పాఠ్యాంశంగా మారడం గొప్పే కదా! 2022లో ఆచార్య సూర్యధనుంజయతో కలిసి సహ సంపాదకీయంలో 'కేసులా' పేరుతో తొలి గోర్ బంజారా కథలు తీసుకువచ్చాడు. 2023లో 'చక్మక్' అనే ఆంగ్ల కవితా సంపుటి రచించాడు. నేడు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం, రావిశాస్త్రీ పురస్కారం అందుకున్న 'ఢావ్లో - గోర్ బంజారా కతలు' 2021లో వెలువడింది.



"మా బంజారాల జీవితంలో తెలుగుకు ప్రత్యేక అనుబంధం ఉంది. మేము తెలుగు భాషను వాడినంతగా బంజారా భాష వాడటం తక్కువే. నాకు తెలిసిన చిన్నచిన్న విషయాలను సజీవపరచడానికి ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నాను. లంబాడీలనగానే, వారు వేసుకునే బట్టలు, బొక్క గాజులు, పత్రికల్లో వచ్చే ఆడపిల్లల్ని అమ్ముకునే వార్తలు తప్పించి ఏమీ తెలియని ప్రపంచంలో మావాళ్లు బతుకుతున్నారు. లంబాడీలు తెలుగు మాట్లాడడానికి ఎప్పుడూ సిగ్గుపడలేదు. కానీ వారి చుట్టూ ఉన్న సమాజం, తమ సొంత భాష గోర్ బోలి మాట్లాడితే, అది తప్పు అన్న స్పృహను తీసుకువచ్చింది. ఇలాంటి సమయాల్లోనే కదా ఏదో ఒక అద్భుతం జరగాలి.

మా వాళ్ల జీవితాల్లో చావు, బతుకు, పెళ్లి, పేరంటం ఇలా అన్నీ కూడా నెమ్మదిగా సాగుతూ ఉంటాయి. గోర్ బంజారాలది హడావిడి తెలియని జీవితం. అందుకేనేమో నా కథల్లో నరేషన్ నెమ్మదిగా ఉంది. నా కథకి ఎంత వైశాల్యం కావాలో అంతా ఇచ్చే స్వేచ్ఛను నా హక్కు అనుకున్నాను, అదే నమ్ముతున్నాను. తెలుగులో గిరిజన ఆదివాసీ సాహిత్యం విస్తతంగా రావాల్సిన అవసరం ఉంది. కనీసం ఇలా లిఖిత పూర్వకం అయితే, పాఠకులు బంజారా భాషతో పాటు, వారికి తెలియని తండావాసులనూ పరిచయం చేసుకుంటారు. వారి మీద సానుభూతి చూపించకుండా, ఇవ్వాల్సిన గౌరవం ఇస్తారు. లేదంటే వారిమీద ఉన్న అపోహలు నిజమైపోయి, అవే ప్రచారమౌతాయి. అందుకే మాకులాగే ఉన్న గిరిజన ఆదివాసీ జీవితాలను రికార్డు చేసే పనిలో ఉన్నాను. దానికోసం ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ గారితో కలిసి కథలు సేకరిస్తున్నాను. త్వరలో ఆ కథా సంపుటి కూడా రానుంది" అని స్వయంగా వివరించాడు.

"గిరిజనులతో ఏమవుతుందిలే అనుకున్న వారికి ఈ అవార్డుతో సమాధానం దొరుకుతుంది. నేను పుట్టి పెరిగిన వాతావరణం, మా గిరిజనుల శ్రమైక జీవనం ఆధారంగా నేను రచించన కవితలు, కథలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. చిన్నప్పటి నుంచి కండ్లెదుట కనిపించిన వాస్తవిక ఘటనలను నా రచనల్లో పొందుపర్చాను. సమాజంలో అందరికీ ఉపయోగపడే సాహిత్యాన్ని అందించి మనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడమే నా లక్ష్యం" అని అంటున్నాడు.



మోహన్‌కృష్ణ,
8897765417

నన్ను రచయితను చేసింది ప్రకృతి, ప్రజలు

ప్రముఖ రచయిత పి.చంద్రశేఖర ఆజాద్‌గారికి కేంద్రసాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఆయనతో జరిపిన ముఖాముఖి..

మాయాలోకం నవలలో వస్తు వైవిధ్యం గురించి చెప్పండి?

మాయాలోకం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోని ఒక మారుమూల గ్రామీణ నేపథ్యంతో రాసిన పిల్లల నవల. ఇందులో ప్రధాన పాత్రలు పిల్లలు. ఈ గ్రామానికి మూడు నాలుగు కిలోమీటర్ల అవతల ఓ రైల్వే స్టేషన్ వుంటుంది. అది కూడా రోజుకి ఒకసారి ఓ రెండు నిమిషాలు ఆగుతుంది. తల్లిదండ్రులు విదేశాలకు వెళ్లడంతో తాత దగ్గర వుండి చదువుకునేందుకు బెంగళూరు నుండి వచ్చిన అశోక్, అదే గ్రామానికి చెందిన బుల్లిబాబు, చిన్ని, గీతలు ఒకే బడిలో చదువుకుంటారు. వీరిలో బుల్లిబాబు చాలా మొరటు. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా చలించడు. అశోక్ ఆ బడిలో చేరటంతో పిల్లల మధ్య పోటీ మొదలవుతుంది. అవన్నీ సహజ సిద్ధమైన సన్నివేశాలతో నడుస్తుంటాయి. బుల్లికి బడిలో వచ్చిన అనుభవం వల్ల తమ కుటుంబమంతా కలిసి వుండటం మంత్రాలతో సాధ్యం అనుకుంటాడు. ఆ గ్రామానికి అడుక్కోవటానికి వచ్చే ఓ సాధువును మంత్రాలు నేర్పించమని వెంటపడతాడు. చివరికి వచ్చీరాని భాషలో ఉత్తరం రాసి బోల్డన్ని డబ్బుల్తో వస్తానని వెళ్తాడు. అతన్ని మిగతా ముగ్గురు పిల్లలు ఎలా కాపాడుకున్నారు. అశోక్ కుటుంబం ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది ఇందులో కీలకం. హాస్యం, జీవితం, గ్రామంలోని... పరిస్థితులు ఇవన్నీ రేఖామాత్రంగా ఈ నవలలో చిత్రించే ప్రయత్నం చేశాను.

ఇప్పటి దాకా మీరు చేసిన సాహిత్య కృషి, మీ సృజన ఎక్కువగా దేనిపై కేంద్రీకరించారు?

1971లో మా కాలేజ్ సావనీర్‌లో తొలికథ అచ్చయింది. ఇప్పటి వరకు 85 నవలలు, 18 నవలికలు, 850 వరకు కథలు, 15 కాలమ్స్, వ్యాసాలు, కవిత్వం, రేడియో, టీవీ సీరియల్స్ 5000, సినిమా సంస్థల నిర్వహణ... ఇలా ఇన్ని దశాబ్దాలుగా అన్ని రకాల ప్రక్రియల్లో రచనలు చేశాను. చేస్తున్నాను. సమాజంలో సమస్యలు ముందుకొచ్చిన ప్రతి సందర్భానికీ కథ, నవల, కాలమ్, వ్యాసాలు రాశాను. వివిధ పత్రికలు వాటిని ప్రచురించాయి.

ఆయా సందర్భాన్ని బట్టి అన్ని రూపాల్లో కృషి చేశాను. ముఖ్యంగా పిల్లలు నా జీవితంలో భాగం అయ్యారు. ఫిలాసఫీ, తాత్వికత నాకు సోవియట్ రచనల నుండి అబ్బాయి. సరళంగా చెప్పే ప్రయత్నం, ఎక్కువ టోన్‌తో మాట్లాడని రచనలు నన్ను ప్రభావితం చేశాయి. అవి నాకు సరళత్వాన్ని నేర్పినా నా రచనలు అంత త్వరగా కొరుకుడు పడవు అంటారు. మనం దేనిమీద కేంద్రీకరించాలన్నది పరిస్థితులే నిర్ణయిస్తాయి. ఏది రాస్తే అచ్చవుతుందనేది నా కొలబద్ద కాదు. ఏ పత్రికకు రాసినా నా దృష్టితో, నా పరిమిత అవగాహనతో రాశాను. ప్రచురించారు. ఆదరించారు.


మీ నేపథ్యం, రచనా రంగంలోకి రావటానికి ప్రేరణ?

మాది కమ్యూనిస్టు నేపథ్యం. మా తండ్రి లక్ష్మణరావు తెలంగాణ పోరాట సమయంలో కడలూరు జైలులో ఆరేండ్లు వుండి 1962లో మా చిన్నతనంలో చనిపోయారు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీ చీలలేదు.

నన్ను రచయితను చేసింది ప్రకృతి. మా మైదానం, మా చింతచెట్లు, అప్పటి పిల్లలు, ఆటలు, పాటలు, అన్ని రంగాల్లో పైకి రమ్మని చిన్నప్పటినుండి పెనుగులాట. అంతులేని దారిద్ర్యం. చదివింది తక్కువ. అయినా రచయితగా నిలబడడానికి కారణం అది మాత్రమే నన్ను ముందుకు నడిపిస్తుందనే నమ్మకం. ఇవన్నీ చెప్పాలంటే ఇక్కడ కుదరదు. నా రచనల్లో నా జీవితం కూడా వుంది. నేను కమర్షియల్ రచయితను కాకపోయినా అవసరాల కోసం రాసుకోవలసిన స్థితి. వారు ఇచ్చే 50, 100 రూపాయలు నాకు వేలతో సమానం.

నాకు ప్రజలే ప్రేరణ : నా బాల్యం, నా ప్రయాణం తెలిసిన వారు ఇప్పుడు ఆశ్చర్యపోతారు. అన్ని కష్టాల నుండి, అవమానాల నుండి ఎదిగాను. నాకు తెలిసిన వాడుక భాషలో ఇన్ని దశాబ్దాలు కొనసాగటం వేలాది పేజీలు రాయటంలోని వేదన, ప్రేరణ నా తల్లికి, భార్యకు, కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుసు. కొందరు మిత్రులకు తెలుసు.





అవార్డు ప్రకటనపై మీ స్పందన?

"మీ రచనలు చదివి కవులు, రచయితలు అయినవారున్నారు. అలాగే ఉద్యోగరీత్యా మంచి స్థితుల్లో వున్నవారున్నారు. అది మీకు అసలయిన అవార్డు" అని మిత్రుడి మాట. 'అందమైన పూలతోట', 'మా హృదయం' అవి బాల సాహిత్యంలో ప్రయోగాత్మక రచనలు నిజానికి పిల్లల పుస్తకం, ఆట.. ఈ రెండు నవలు కూడా ఇంతకుముందు పరిశీలనలోకి వెళ్లాయి. ఇవే కాదు, జమిందారు కోట, దేవత ఓ దేవతా, దారి తప్పిన పిల్లవాడు, రేపు రానున్న అన్వేషణం, ఏంజల్, ఇవన్నీ ఆధునిక పిల్లల నవలలు. వారికోణం నుండి చెప్పినవి. అందుకు వారిని దగ్గరగా చూశాను. మాట్లాడాను. కాబట్టే అవి పుట్టాయి. ఈ ప్రకటనను నేను ఊహించలేదు. ఇంకాస్త ఆలస్యం కావచ్చు అనుకున్నాను. రెండు రాష్ట్రాలవారు పోటీలో వుంటారు. అనేక రిజర్వేషన్స్, లెక్కలుంటాయి.

కాగా 70 సంవత్సరాల వయసులో ఈ అవార్డు ప్రకటించారు. ఇప్పుడు నాకు అరవై సంవత్సరాలు తగ్గిపోయాయి. అందుకు కారణం నాలుగు దశాబ్దాల నుండి పిల్లల కోసం కథ, నవల, కాలమ్, రేడియో, టెలీఫిల్మ్, సినిమా... ఇన్ని విభాగాల్లో పనిచేశాను. పిల్లల ప్రపంచం శీర్షిక ద్వారా కొంతమందిని పరిచయం చేశాను. మేం రాస్తున్నప్పుడు ఈ అవార్డు లేదు. పెద్ద పోటీలు లేవు. ఏ నవల రాసినా అందులో సామాజిక సమస్య వుంటుంది. అందుకే ఇది తాతగా కాదు, ఓ బాలుడిగా స్వీకరిస్తాను. ఆకాశంలో హరివిల్లు విరిస్తే పిల్లలు తొలకరి జల్లుల్లో ఎంత పులకరిస్తారో అంత అనుభూతిగా వుంది. ఇప్పుడు పిల్లలు కూడా రచనలు చేస్తున్నారు. అలాంటి వారికి ఒక్కసారన్నా ఈ అవార్డు ప్రకటిస్తే అప్పుడు ఈ పిల్లవాడు అంకుల్, తాత గర్వపడతాడు. ఇది నా ఆశ.

బాల సాహిత్యంలో రాసవలసిన మార్పులు?

నిన్నటి పిల్లలు వేరు, ఈ నాటి పిల్లలు వేరు. వారి హృదయం ఒక్కటే .అయితే తెలుగు చదువుతున్నావారు తక్కువ. ఈ సాహిత్యంలో మార్పులు రావాలంటే తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు, పత్రికలు, మీడియా వారితో పాటు యాక్టివిస్టులు పూనుకోవాలి. అప్పుడే మార్పు వస్తుంది.

ఫ్యాంటసీ, సాహసం, హాస్యం, సైన్స్, ఇలా అనేక రకాల జోనర్స్‌లో రాయాలి. పదేండ్లు దాటిన పిల్లల కేంద్రంగా నా రచనలుంటాయి. ఇప్పుడు కావలసింది ఆధునిక బాల సాహిత్యం. ఇది అంత ఈజీ కాదు. అది పిల్లల కోసం హృదయాలను అకింతం చేసుకున్నవారు, నిశిత పరిశీలన చేసేవారు మాత్రమే రాయగలరు.

సంవత్సరం పిల్లల చేతుల్లో సెల్‌ఫోన్లు వుంటున్నాయి. అందుకు తగ్గ రచనలు చేయాలి. వివిధ భాషల్లో రకరకాల ఆధునిక పాత్రలు, సిరీస్‌లు వస్తున్నాయి. గ్రామ సీమల్లో పిల్లలు ఎంతగా స్పందిస్తున్నారో. ఇన్ని చదువుల ఒత్తిళ్ల నుండి ఓ పిల్లల ప్రపంచాన్ని, స్వప్నలోకాలను సృష్టించుకోవటానికి చేయగలిగింది చేయాలి. అన్ని దేశాల్లో భాషల్లో మహారచయితలుగా పేరు పొందినవారు పిల్లల కోసం అనేక రూపాల్లో రచనలు చేశారు. మన తెలుగులో ఏ కారణాల చేతనైనా వారు పిల్లల కేసి దృష్టి సారించలేరు. అదో విషాదం.

వర్తమాన రచయితలకు మీ సూచనలు?

ఒకటి రెండు రచనలు చేసి అవార్డులు ఆశించవద్దు. పాతతరం నుండి ఆధునిక తరం వారి రచనలు చదవండి. అసలు విషయం మనకు ప్రయాణం జీవితం. గదుల్లో కూర్చుంటే మంచి రచనలు రావు. ప్రయాణాలు చేయాలి. ప్రజల్లోకి వెళ్లాలి. వారి దగ్గర అనంతమైన సంపద వుంది. తరగని గనులున్నాయి. విమర్శను ఆహ్వానించండి. చిరు ప్రశంస చాలు. వాటిని తలకు ఎక్కించుకోవద్దు. ఎవరు ఎందుకు ప్రశంసలు కురిపిస్తారో, ఎందుకు అతిగా విమర్శిస్తారో గుర్తెరగాలి. సాహితీ ప్రపంచం అనేక రకాలుగా చీలిపోయింది. మనకు కొలబద్ద మానవీయ కోణం. ఇది. ఏ వాదానికయినా జోడించగలగాలి. బాధలు పడుతున న వారందరూ ఒక్కటే అని గ్రహించనంత కాలం అవి ఏకపక్షంగా వుంటాయి. మీ అనుభవాల నుండే మీకు పాఠాలు దొరుకుతాయి. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

తప్పి పోదామా తప్పు తెలిసే వరకు...

ట్రాఫిక్ లోనే సగం దినం అర్పితం
బాస్ ఇగోకు ఆఫీసులో బలిపశువు
జీతం చుట్టే తిరుగుతుంది జీవితం ఒక రోజు తప్పి పోదామా
లైబ్రరి పుస్తకాల నీడ కూర్చుని వచ్చేద్దాం...
ఇంటికి చేరితే కోరికలు స్వాగతం
వాయిదా కోరినా కనుకరించని బందాలు
బిల్లుల మిల్లు సంసారం ఒక సాయంకాలం తప్పి పోదామా
బిర్లామందిర్ చలువరాతి సన్నిధిలో రాత్రంతా
నలుగురికి దగ్గర అవ్వడానికి
నటన ఎంతో నేర్చుకుని వుండాలి
పొగడ్తనో పార్టీనో ఎప్పుడూ విసరాలి
దోస్తుల నుండి దూరంగా తప్పిపోదామా
అడవిలోకి గుట్టలోకి ఒంటరిగా వారం పాటు
మూడు పూటల మెనూ
నెల నెలా ఇ.ఎం.ఐ అప్పు గింతలు
చచ్చే ముందు టర్మ్ పాలసీ షరతు
ఎక్కడ పొరబాటు చేశామో
తప్పిపోయి తప్పు తెలుసుకుని వద్దామా...



- దాసరి మోహన్, 9985309080

వర్తన అయిదవ సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 5వ సమావేశం ఈ నెల 25న సా॥ 6 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతుంది. 'తెలంగాణ నాటకం తీరుతెన్నులు' అంశంపై తాటికొండాల నరసింహారావు ప్రసంగిస్తారు. డా. రూప్ కుమార్ డబ్బీకార్ పాల్గొంటారు.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

పెందోట పురస్కారాలు, పుస్తకావిష్కరణలు, కవిసమ్మేళనం

శ్రీవాణి సాహిత్య పరిషత్ పదో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు సిద్ధిపేట శివానుభవ మండపంలో పెందోట సాహిత్య, బాలసాహిత్య పురస్కారాలు అందజేస్తారు. అదే వేదికపై కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. 'బాలకథల సెలిమె, ఉడుతా ఓ బుడుతా..., సాహిత్య పరిమళాలు' పుస్తకాల ఆవిష్కరణ వుంటుంది.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

- ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ - కరీంనగర్

సమాజంలో సగభాగమైన మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన ఐద్వా జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆరు హామీలిచ్చిందని, అందులో మూడు అమలు చేయడం అభినందనీయమన్నారు. మహిళలకు నెలకు రూ.2500, అర్హులైన మహిళలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న పేద మహిళలకు నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళల పట్ల చులకనభావంతో ఉందని, మహిళా రెజ్లర్లను బీజేపీ నాయకులు వేధించడం, మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినా నరేంద్ర మోడీ పెదవి విప్పకపోవడం విచారకరమన్నారు. ఉన్నావ్, ఖతువా, బిల్కిస్‌భానో లాంటి అనేక ఘటనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళల్ని వంటింటి కుందేళ్లుగా అభివర్ణిస్తూ, కేంద్ర బీజేపీ మంత్రి మాట్లాడడం విచారకరమని, బీజేపీ ప్రభుత్వం మహిళల పట్ల చెప్పేది ఒకటి, చేసేది మరొకటని విమర్శించారు. నిత్యం మహిళలు, గృహిణులు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా పోరాటం చేస్తోందని తెలిపారు. కరీంనగర్‌లో జులై 25, 26, 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో మూడేండ్ల ఐద్వా ఉద్యమ కర్తవ్యాలను సమీక్షించుకొని, భవిష్యత్‌లో మహిళా సమస్యల పట్ల మరిన్ని ఉధృత పోరాటాలు రూపొందించుకోనున్నట్టు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, వివక్షత లేని సమానత్వం కోసం మరిన్ని రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శిక్షణా తరగతులను జయప్రదం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు, దాతలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు గుడికందుల సంధ్య, ఎడ్ల రజిత, స్వరూప, పి.దేవేంద్ర, మాదాసు యమున, రజిత, రోజా రమణి, పద్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

సుడా నుంచి బతుకమ్మ చీరల తరలింపు

- రాత్రికి రాత్రే ఆటోలో తీసుకెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు
- నలుగురిపై కేసు నమోదు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని సుడా కార్యాలయం నుంచి శనివారం అర్ధరాత్రి ఆటోలో బతుకమ్మ చీరలను తరలిస్తుండటంతో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలపాటు కార్యాలయం వద్ద హల్‌చల్ జరిగింది. సుడా కార్యాలయానికి సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్‌ను తరలిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆటోను అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్యాలయంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఈ విషయంపై త్రీ టౌన్ సీఐని వివరణ కోరగా.. సుడా ఆఫీసులో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చరణ్ కార్యాలయంలో ఉన్న 1500 బతుకమ్మ చీరలను పాత బట్టల వారికి 20 రూపాయల చొప్పున రూ.30 వేలకు మాట్లాడుకుని తరలిస్తున్నారని తెలిపారు. కార్యాలయ టౌన్ ప్లానింగ్ అధికారి ఫిర్యాదు మేరకు చరణ్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సుడా మాజీ ప్రజా ప్రతినిధులు.. ప్రభుత్వ భూములు, ఇతర భూములకు సంబంధించిన ఫైళ్లను మూడు రోజులుగా తరలిస్తున్నారని తెలిపారు. చీరల మధ్యలో ఫైళ్లను పెట్టుకొని, వారు చేసిన తప్పులకు ఆధారాలు దొరకకుండా తీసుకుపోతున్నారని ఆరోపించారు. ఈ పనులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

బాలికపై వృద్ధుని లైంగిక దాడి

నవతెలంగాణ- రాయికల్

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన సింగు గంగ నర్సయ్య (62) బాలికకు మాయమాటలు చెప్పి అతని టైలర్ షాప్‌లోకి తీసుకెళ్లి దాడి చేశాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పగా, వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ దేవేందర్ తెలిపారు.

మియాపూర్ భూముల ఆక్రమణలో 22 మందిపై కేసు

- ప్రజలు చెప్పుడు మాటలు విని మోసపోకండి
- మాదాపూర్ డీసీపీ వినీత్
- 29 వరకు 144సెక్షన్ అమలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ, అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా మియాపూర్ పరిసర ప్రాంతాల్లో 100, 101 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిపై మూడు రోజులుగా కొంతమంది గుడిసెలు వేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో 22 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మియాపూర్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ వినీత్ వెల్లడించారు. మూడు రోజులుగా కొంత మంది ప్రోద్బలంతో పలువురు ప్రభుత్వ భూమిలోకి వచ్చి అక్కడే మకాం వేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించినట్టు తెలిపారు. దాంతో మొత్తం 22 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. మిగతా 50 మందిని కూడా గుర్తించామని, వారిపై 307, 333, 447, 147, 148, 120(బీ) ఐపీసీ 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. పలువురు పోలీసులు, రెవెన్యూ సిబ్బందిపై తిరగబడటంతో రెవెన్యూ సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రజలు ఇతరుల చెప్పుడు మాటలు విని మోసపోవద్దని సూచించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ

సర్వే నెంబర్ 100, 101లోని భూమిలో జనం ఆక్రమించి గుడిసెలు వేసేందుకు యత్నించిన స్థలాన్ని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదివారం ఉదయం పరిశీలించారు. అక్కడి పరిస్థితులను పోలీసులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎవరూ కూడా సర్వే నెంబర్ 100, 101లోకి రావొద్దని తెలిపారు. మియాపూర్, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 29వ తేదీ వరకు 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామని, ఎవరైనా ఇక్కడికి వచ్చి గుమికూడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు.. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 100, 101 భూమి కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉందని, స్టేటస్ కో ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు.

కూలి పెంచాలి.. భూమి పంచాలి..

- అప్పుడే పేదల బతుకులు బాగుపడతాయి
- సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలి : వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యవసాయ కూలీలకు కనీస కూలి రూ.600గా నిర్ణయించాలని, ప్రభుత్వం మిగులు భూములను పేదలకు పంచాలని, అప్పుడే పేదలు, వ్యవసాయ కూలీల బతుకులు బాగుపడతాయని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజులపాటు నిజామాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణాలను మాఫీ చేయటానికి, రైతు భరోసాను అమలు చేయడానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 ఇస్తామన్న హామీనీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద మహిళలందరికీ నెలకు రూ.2500 భృతితో పాటు ఆసరా పింఛన్‌ను రూ.4000 పెంచుతామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వ్యవసాయ చట్టాలను మార్చి రైతులు, పేదలకు నష్టం కలిగించే చర్యలు చేపట్టిందని,ఫలితంగా గత ఎన్నికల్లో బీజేపీ నిర్దేశించుకున్న లక్ష్యానికన్నా తక్కువ సీట్లను ప్రజలు కట్టబెట్టారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా పేదల సమస్యలను పట్టించుకోవాలని, అర్హులైన పేదలందరికీ స్థలాలను ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.నాగయ్య, వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, అధ్యక్షులు వై.గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు ఎం.గంగాధరప్ప, పల్లపు వెంకటేష్, సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిలు, డీవైఎఫ్ఐ కార్యదర్శి సూరి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, విగ్నేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు,వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీకృత పరీక్షలు రద్దు చేయాలి

- రాష్ట్రాలకే అప్పగించాలి
- 'ఒకే దేశం -ఒకే పరీక్ష'పై సీఎం వైఖరి ఏంటి? : తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రీకృత పరీక్షలను రద్దు చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ఇంతకు ముందు మాదిరిగా ఆయా పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని కోరింది. ఆర్ఎస్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న 'ఒకే దేశం - ఒకే పరీక్ష' అనే ప్రగతి నిరోధక భావజాలంపై సీఎం రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ సమితి కార్యానిర్వహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్, ఉపాధ్యక్షులు కె.నారాయణ, టీపీటీఎఫ్ అధ్యక్షులు వై.అశోక్ కుమార్, సమితి నాయకులు కె.రవిచందర్, ప్రొఫెసర్ పద్మజాషా, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, పీవైఎల్ , పీడీఎస్‌యూ నాయకులు కె.ఎస్.ప్రదీప్, పి.అజీద్, పి.మహేష్, ఎ.విజయ్, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కె.లక్ష్మినారాయణ మాట్లాడుతూ రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యావిధానంపై సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరిని తెలపాలని కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రాంతీయ, ఆర్థిక,సామాజిక అసమానతలున్న దేశంలో కేంద్రీకృత పరీక్షల విధానం సరికాదని హితవు పలికారు. గతంలోనూ ఇదే భయాన్ని, ఆందోళనను వ్యక్తం చేశామనీ, నీట్, నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీల విషయంలో అది నిజమైందన్నారు. కేంద్రం మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించినా పేపర్ లీక్ కాదని గ్యారంటీ ఏంటని ప్రశ్నిం చారు.బీహార్‌లో పేపర్ లీకైతే తెలుగు విద్యార్థులు ఎందుకు బాధితులు కావాలని నిలదీశారు.పరీక్షలను వికేంద్రీకరించాలని కోరారు. వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ సంపన్నులకు లాభం చేకూర్చేందుకే కేంద్రీకృత పరీక్షల విధానాన్ని బీజేపీ తెచ్చిందని విమర్శించారు. పరీక్షలను తామే నిర్వ హించుకుంటామని కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రొఫెసర్ పద్మజాషామాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవకతవకల కు, నేరపూరిత చర్యలకు పాల్పడేందుకే బీజేపీ కేంద్రీకృత పరీక్షల విధానాన్ని కోరుకుంటున్న దని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇదో పెద్ద స్కాం అని ఆమె తెలిపారు.మధ్యప్రదేశ్‌లో వ్యాపం మొదలు దేశంలో కేంద్రీకృత పరీక్షల పేరుతో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

చిరంజీవిని కలిసిన కేంద్ర మంత్రి బండి

- సంజయ్‌ను సాదరంగా ఆహ్వానించిన చిరు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పద్మభూషణ్, మెగాస్టార్ చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోగల చిరంజీవి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా బండిని శాలువాతో చిరంజీవి సత్కరించారు. ఇరువురూ అరగంటకుపైగా దేశ, తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై ముచ్చటించుకున్నారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. "సంజయ్ గారు... మీరు ఎంతో కష్టపడి పైకొచ్చారు. మంత్రి కావడం చాలా ఆనందంగా ఉంది. మీ అగ్రెసివ్ మెంటాలిటికి తగిన పోస్ట్ లభించింది" అని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రధానమంత్రి మోడీ పవన్‌నూ, తనను దగ్గరకు తీసుకుని పలకరించడం మర్చిపోలేని అనుభూతి అని తెలిపారు. బండి మాట్లాడుతూ.. 'నేను విద్యార్థి దశలో మీ సినిమాలకు అభిమానిని"అని చెప్పారు. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శించిన బండి

కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ హైదరాబాద్ అల్వాల్‌లోని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. పిల్లల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సత్యం భార్య రూపాదేవి చనిపోవడం అత్యంత బాధాకరమని సంజయ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని ప్రార్థించారు.

ఈనాడు ఎమ్‌డీ కిరణ్ దంపతులకు, ప్రతాపరామకృష్ణకు పరామర్శ

ఆదివారం హైదరాబాద్‌లో రామోజీరావు కుమారుడు, ఈనాడు ఎమ్‌డీ కిరణ్‌ను, కుటుంబ సభ్యులను కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. రామోజీరావు తో తనకున్న అనుభవాలను గుర్తుచేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు మీడియా ద్వారా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈనాడు, మార్గదర్శి, ఫిలింసిటీ, తదితర సంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న రాజన్న సిరిసిల్ల బీజేపీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణను కూడా బండి పరామర్శించారు. ఆయన వెంట వారణాశిలోని కాశీవిశ్వనాథ ఆలయ ప్రధాన పూజారి శ్రీకాంత్ మిశ్రా గురూజీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, జె.సంగప్ప తదితరులున్నారు.

ఒట్టేద్దాం రా...

- మంత్రి పొన్నంకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫ్లయ్ యాష్ స్కాంలో మంత్రి పొన్నం ప్రభాకర్ డబ్బులు తీసుకోలేదని అపోలో వెంకటేశ్వరస్వామి మీద ఒట్టేసి చెప్తే, తాను బహిరంగ క్షమాపణకు సిద్ధంగా ఉన్నానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం 11 గంటలకు అపోలో వెంకటేశ్వరస్వామి దేవాలయానికి తాను వస్తాననీ, మంత్రి పొన్నం కూడా అక్కడికి వచ్చి, ఫ్లయ్ యాష్ స్కాంలో డబ్బులు తీసుకోలేదని దేవుడి సాక్షిగా ప్రమాణం చేయాలని అన్నారు. ఆరోజు మంత్రి గుడికి రాకుంటే, అదే సమయంలో అక్కడే మరికొన్ని నిజాలు బయటపెడతానని చెప్పారు. ప్రజలకు ఇవ్వాల్సిన చెక్కుల గడువు ఈనెల 27తో తీరిపోతున్నా, మంత్రి వాటి పంపిణీకి అనుమతి ఇవ్వట్లేదని ఆరోపించారు.

కలెక్టర్ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు పద్ధతి ప్రకారం నడుచుకోవాలనీ, లేకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వారికోసం బ్లాక్‌బుక్ ప్రిపేర్ చేశామనీ, ఇప్పుడు తప్పించుకున్నా, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తిప్పలు తప్పవని హెచ్చరించారు.

బండి సంజయ్‌కు కేంద్రమంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదు

- విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్త నాయకులు
- కరీంనగర్‌లో క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. అరెస్ట్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలింపు



నవతెలంగాణ - కరీంనగర్

నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంపై నోరు మెదపని బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కి కేంద్రమంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ యూజీసీ పరీక్షా అంశంపై స్పందించాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు నుంచి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ వరకూ ర్యాలీగా వెళ్లి, కార్యాలయ ముట్టడికి తరలివెళ్లారు. మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజినీకాంత్‌తో పాటు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బండి సంజయ్‌కు మత రాజకీయాలపై ఉన్న శ్రద్ధ లక్షలాదిమంది విద్యార్థుల భవితవ్యంపై లేకపోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు, అవకతవకలు జరిగాయని, విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డెక్కి ఉద్యమం చేస్తుంటే ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ నీట్ పేపర్ లీకేజీ అంశంపై 'చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహించేలా బండి సంజయ్ అడగాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వానికి దేశాన్ని పరిపాలించే హక్కు లేదన్నారు. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మునిగంటి అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారావు వెంకటేష్, మచ్చ రమేష్, అరవింద్, గజ్జల శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రాణా ప్రతాప్, అంగడి కుమార్ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు రేణికుంట్ల ప్రీతం, మల్లారపు ప్రశాంత్, గంతులు మహేష్, రోహిత్, సనత్ రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సస్పెండ్

(మొదటిపేజీ తరువాయి)

రూ.10వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు కృప జార్జ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలపై ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన తమపై సస్పెన్షన్ వేటు వేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు. గతంలోనూ ఇలాంటివే జరిగినట్టు గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు విద్యార్థుల సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

నిరసన తెలపడం నేరమా? ప్రశ్నిస్తే వెలివేస్తారా?

- రోహిత్ వేముల రోజుల్లోకి హెచ్‌సీయూ
- మళ్లీ వెలివేతల పర్వానికి తెరలేపిన వర్సిటీ యాజమాన్యం : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యార్థుల హక్కుల కోసం నిరసన తెలిపితే నేరమా? ప్రశ్నిస్తే వెలివేస్తారా? ఇదెక్కడి న్యాయం? రోహిత వేముల రోజుల్లోకి మళ్లీ తీసుకెళ్లదలిచారా? అంటూ హెచ్‌సీయూ యాజమాన్యాన్ని ఎస్ఎఫ్ఐ ప్రశ్నించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ గెస్ట్ హౌస్ ముందు నిరసన తెలిపిన విద్యార్థులు ఎన్నుకోబడిన స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌తో పాటు నలుగురు విద్యార్థి సంఘం నాయకులను సస్పెండ్ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ఆదివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులపైన పోలీసు కేసులు పెట్టడమే కాకుండా విద్యార్థులను యూనివర్సిటీ నుంచి వెలివేస్తు సస్పెన్షన్ నిర్ణయం తీసుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఆ ఐదుగురు కూడా నిరుపేద, అట్టడుగు వర్గాల కుటుంబాల నుంచి వచ్చినవారేనని తెలిపారు. దీంతో వారి చదువులు, ఉపకార వేతనాలన్నీ ప్రశ్నార్థకంలో పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విశ్వవిద్యాలయంలో ఎనిమిదేండ్ల కిందట ఏ విధంగా రోహిత్ వేములను వెలివేసి, అతని హత్యకు వర్సిటీ యాజమాన్యం కారణమైందని విమర్శించారు. యూనివర్శిటీలో ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ దీన్ని తీవ్రంగా ఖండించాలనీ, సోమవారం నుంచి జరిగే పోరాటానికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం..



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉపరితల అవర్తనం ప్రభావంతో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని పలుచోట్ల సాయంత్రం 5.30 గంటల తర్వాత ఒక గంట పాటు కురిసిన భారీ వర్షానికి ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రధాన రహదారులు మొదలుకొని అంతర్గత రోడ్లపై నీరు చేరింది.దీంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కొన్నిచోట్ల నాలాలు, డ్రయినేజీ లు పొంగి పొర్లాయి.లోతట్టు ప్రాంతాల్లోని పలు బస్తీలు, కాలనీల్లోకి వర్షం నీరు చేరడంతో స్థానికులు పరేషాన్ అయ్యారు. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది.అత్యధికంగా మలక్‌పేట్‌లో 7.1 వర్షపాతం నమోదు కాగా, చార్మినార్, కార్వాన్‌లో 6.9 సెం.మీ., గోషామహల్, నాంపల్లి ప్రాంతాల్లో 6.9 సెం.మీ.వర్షపాతం నమోదైంది. అలాగే నగరంలోని పంజాగుట్ట, ఖైరతాబాద్,బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, షేక్‌పేట్, బషీర్‌బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, నారాయణగూడ, హిమాయత్ నగర్, ఫీవర్ ఆస్పత్రి, నల్లకుంట, విద్యానగర్,ఆర్టీసీ క్రాస్ రోడ్స్,చిక్కడపల్లి, సికింద్రాబాద్, బౌద్ధనగర్, పద్మారావు నగర్, బోయిగూడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది.ఎల్బీనగర్, హయత్ నగర్, వనస్థలిపురం, బండ్లగూడ జాగీర్, కిస్మత్ పూర్, హిమాయత్ సాగర్, రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్ పల్లి తదితర ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

జీహెచ్ఎంసీకి 24 ఫిర్యాదులు

నగరంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో కురవడంతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు అలర్ట్ అయి.. వెంటనే డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు. రోడ్లపై నిలిచిపోయిన నీటిని విరిగిపడ్డ చెట్ల కొమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టారు. ఇక నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్‌కు 24 ఫిర్యాదులు అందగా.. ఇందులో చెట్లు విరిగాయని 02 ఫిర్యాదులు, రోడ్లపై నీరు నిలిచిందని 13, డ్రయినేజీ మ్యాన్‌హెూల్స్ పొంగిపొర్లడంపై 9 ఫిర్యాదులు అందాయి. సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు అందించాయి.

రాష్ట్రంలో విస్తారంగా వాన

- 331 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం
- వచ్చే మూడ్రోజులు వానలు పడే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో రాష్ట్రంలో విస్తారంగా వానలు పడుతున్నాయి. ఆదివారం ఉదయం 8 :30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 331 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం పడింది. జీహెచ్ఎంసీ పరిధిలోని డబీల్‌పురలో అత్యధికంగా 7.18 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు కూడా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, యాద్రాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు.

నేటి నుంచి జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె

- అత్యవసర సేవలకు మినహాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీస్‌ను అందజేసినా..ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో జూనియర్ డాక్టర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. రాష్ట్రంలోని దాదాపు 17 ప్రభుత్వ బోధనాస్పత్రులు, ఇతర ఆరోగ్య సేవల్లో 6 వేల నుంచి 7 వేల మంది వరకు జూనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారు. నిర్దేశిత సమయంలో ఉపకార వేతనాల విడుదల, పెండింగ్ స్టయిఫండ్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న మేరకు స్టయిఫండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్, ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సరిపడేలా కొత్త హాస్టళ్ల నిర్మాణం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం తదితర డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎన్నికలకు ముందే సమ్మె నోటీస్ అందజేసినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారుల సూచన మేరకు తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశారు. సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం మరోసారి రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణిని కలిసి ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఆశించిన మేరకు సానుకూల నిర్ణయం రాకపోవడంతో నల్లరిబ్బన్లు ధరించడం, నల్ల దుస్తులు ధరించడం, కండ్లకు గంతలు కట్టుకుని ప్రదర్శన తదితర రూపాల్లో గత కొన్ని రోజులుగా నిరసనలు తెలిపారు. అయినా సర్కారు స్పందించకపోవడంతో తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె ఒక్కటే పరిష్కారమని భావిస్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సీహెచ్.జి.సాయి శ్రీహర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.ఐజాక్ న్యూటన్ తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే పేద రోగులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర సేవలను మాత్రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అభినందనలు



నవతెలంగాణ - సంతోష్‌నగర్

దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్‌ను దేవరకొండ ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సపావత్ రాము చౌహాన్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎల్ఐసీ ఆధ్వర్యంలో ముద్రించిన మిషన్ విజన్ సంచికను అందజేశారు. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ప్రజలకు, పాలసీదారులకు అందజేస్తున్న ఉత్పత్తులను, సేవలను రాము చౌహాన్ ఎమ్మెల్యేకు వివరించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

6

ఎల్బీనగర్ -మహేశ్వరం

సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com



భారీ వర్షం కురిసిన నేపథ్యంలో హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్ రోడ్ సమీపంలో ఉన్న జాతీయ రహదారులు మొదలుకొని కాలనీ రోడ్లు సైతం జలమయమయ్యాయి. హస్తినాపురం సెంట్రల్ నుండి ఓంకార్ నగర్ వరకు వరద నీటి ప్రవాహానికి గంటల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ వరద నీటికి డ్రైనేజీ నీరు తోడవ్వడంతో దుర్వాసన వెదజల్లుతూ రోడ్ల పై మురుగు ప్రవాహం దర్శనమిచ్చింది. ప్రయాణీకులతో పాటు స్థానిక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి



- ఎమ్మెల్యే డాక్టర్. వంశీకృష్ణ

నవతెలంగాణ - బడంగ్‌పేట్

ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రుల వైద్యులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో రికవరీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని అచ్చంపేట్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 250మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రఘుపతి రెడ్డి, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి, నాయకులు జేనిగే శ్రీనివాస్ యాదవ్, బాలాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, బాలాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, డాక్టర్లు దినేష్ రెడ్డి, తాజీద్దీన్, రామకృష్ణ, లత, సతీష్, కార్తీక్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, వైద్య సిబ్బంది, నాయకులు ప్రవీణ్, సామ వరుణ్ రెడ్డి, దీక్షిత్, రంజిత్, డాక్టర్ దినేష్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ- సంతోష్‌నగర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని రక్షకపురం పరిధిలో ఉన్న డీఎంఆర్ఎల్ ప్రధాన రహదారిలో పోలీస్ పెట్రోలింగ్ చేస్తుండగా..ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండడాన్ని గమనించారు. వెంటనే దగ్గరకు వెళ్లి చూడగా..అతను మృతి చెందినట్టు గుర్తించారు. అతని వయసు సుమారు 45 సంవత్సరాలు ఉండ వచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భవన నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో నూతనంగా చేపట్టిన అయ్యప్ప సేవా సమితి భవన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో అయ్యప్ప సేవా సమితి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ భూమి పూజలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరి జైహింద్, బండారు మనోహర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, కళ్లెం నిరంజన్ రెడ్డి, మల్లా రెడ్డి, శ్రీశైలం, కొప్పుల రాజు, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీపై తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం'



నవాతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ సర్కార్ రైతు రుణమాఫీపై తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని టే స్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏక కాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన దానిని హర్షిస్తూ ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివ కుమార్ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ భీమిరెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, జుల్ ఖాదర్ అలీ, నారని శేఖర్ గౌడ్, జొన్నాడ జంగారెడ్డి, గుండ నరసింహ, డంగు రమేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - పెద్ద అంబర్‌పేట్

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి అధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినేట్ సమావేశంలో ఒకే దఫా రైతు రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెరువులోకి
డ్రయినేజీ నీరు చేరకుండా చూడాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - హయత్‌నగర్

చెరువులోకి డ్రయినేజీ నీరు చేరకుండా చూస్తే వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు, సరస్వతి నగర్ కాలనీ, కాస్మోపాలిటీన్ కాలనీ నందు పలువురు నాయకులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద చెరువులోకి డ్రయినేజీ నీరు కలవడం వలన దుర్వాసన వస్తుందన్నారు. వాకింగ్‌కు వచ్చే ప్రజలు ఈ దుర్వాసన వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే డ్రయినేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శ్రీ సరస్వతి నగర్ కాలనీ నందు, కాస్మోపాలిటీన్ కాలనీ నందు నూతన డ్రైన్స్ పనులు చేపట్టాలని కోరారు. శ్రీ సరస్వతి నగర్ కాలనీ నందు ఉన్న కమ్యూనిటీ హాల్ మీద అదనపు అంతస్థు నిర్మాణం చేపట్టాలన్నారు. కాస్మోపాలిటీన్ కాలనీ నందు ఉన్న పార్క్ గోడ ఎత్తు పెంచాలన్నారు. మాన్సూరాబాద్ పెద్ద చెరువును అన్ని రంగాల్లో సుందరీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీ సరస్వతి నగర్ కాలనీ, కాస్మోపాలిటీన్ కాలనీలలో డ్రైన్స్ నందు పేరుకుపోయిన సిల్ట్ తీయిస్తామని తెలిపారు. అవసరం ఉన్న చోట నూతన డ్రైన్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, జగదీష్ యాదవ్, విజయ్ భాస్కర్ రెడ్డి, జగదీష్ గౌడ్, కాలనీవాసులు వేమన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రుద్ర నర్సింహ, శ్రీనివాస్ రావు, సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



నవతెలంగాణ - బడంగ్‌పేట్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. ఓ యువకుడు అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మల్లాపూర్ గ్రామానికి చెందిన పొరెడ్డి అరుణకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పొరెడ్డి ప్రశాంత్ రెడ్డి ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజూ ఇంటి నుండి బయటకు వెళ్లి పని ముగించుకొని సాయంత్రం వరకు ఇంటికి వచ్చేవాడు. కానీ ఈ నెల 11న ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం బంధువులను. స్నేహితులను సంప్రదించారు. ఎలాంటి ఫలితం లేకపోవడంతో తల్లి అరుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఒక సారి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి 2 నెలల తరువాత వచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్



వృద్ధుడు అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిలాల్ మజీద్ సమీపంలో ఉన్న బిలాల్ కాలనీలో ఉంటున్న శాన్ వాజ్ షరీఫ్ ఆర్‌సిఐలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శాన్ వాజ్ షరీఫ్ తల్లీ దండ్రులు తమ్ముడు అక్రం షరీఫ్‌తో కలిసి జీవనం సాగిస్తున్నారు. తండ్రి ఖాజా శారీ ప్రతి రోజూ ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి వచ్చేవాడు. అయితే ఈ నెల 20న ఉదయం తనను బైకు మీద ఓమ్మర్ హెూటల్ వద్ద దింపి రావాలని కోరడంతో తమ్ముడు అక్రం బైక్ మీద తన తండ్రిని దింపి వచ్చా డు. కానీ సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం బంధువులను, స్నేహితులను సంప్రదించగా సమాచారం అందక పోవటంతో పెద్ద కుమారుడు శాన్ వాజ్ షరీఫ్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్



యువకుడు అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్‌లోని విజయదుర్గ కాలనీలో విఠల్ రెడ్డి తన భార్య, ఇద్దరు పిల్లలు కుమారుడు, ఒక కుమార్తె తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు శ్రీకాంత్ బీటెక్ చదివాడు. ఈ నెల 21న కుటుంబ సభ్యులందరు కలిసి రాత్రి భోజనం చేసి పడుకున్నారు. దాదాపు 10గంటల సమయంలో శ్రీకాంత్ ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా తన బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. అతని ఆచూకీ కోసం బంధువులను, స్నేహితులను సంప్రదించగా సమాచారం అందకపోవటంతో తండ్రి విఠల్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ - చైతన్యపురి

డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తి చైతన్యపురి, ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో మెట్రో స్టేషన్ సమీపంలో హెరాయిన్, ఎండిఎంఎ డ్రగ్స్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాలో రాజస్థాన్‌కు చెందిన వర్మ రామ్‌ను పట్టుకున్నారు. నిందితుడి దగ్గర నుండి నాలుగు లక్షల విలువైన 30 గ్రాముల హెరాయిన్, ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దినేష్ కళ్యాణ్, హీరా రామ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా
పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ - చైతన్యపురి

సరూర్ నగర్‌లోని 1992 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయ సమ్మేళనాన్ని అట్టహాసంగా ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తర్వాత పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాలు, వివిధ రంగాలలో ఉన్న పూర్వ విద్యార్థులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ యాదవ్, లింగం, శివకుమార్, రాజు, శ్యాంసుందర్, సురేందర్, ప్రేమ్ గౌడ్, ఎస్ కే మహమ్మద్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నిధులు మంజూరు చేయాలని వినతి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబును ఆదివారం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపట్టిన పనులు, హెచ్ఎండీఏ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీటి సరఫరా చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు త్వరలోనే బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటిస్తానని అన్నారు. తాగునీటి సమస్యను పరిశీలించాలని హెచ్ఎండీఏ అధికారులకు సిఫారసు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన ప్రణాళికలతో అభివృద్ధి చేస్తా



- కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నవతెలంగాణ - హయత్‌నగర్

నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్ నగర్ పరిధిలోని శివ గంగ కాలనీ, వీరన్న గుట్ట, శిరిడి సాయి నగర్ కాలనీ, వరద నగర్, ఆర్టీసీ కాలనీ, సీఎస్ఆర్ కాలనీలల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సభ్యులను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వేగంగా జరుగుతున్న ట్రంక్ లైన్ పనులను కాలనీవాసులు తమ సొంత పనుల్లాగా భావిస్తూ ప్రతిక్షణం పర్యవేక్షిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. లెవెల్ సరైన విధంగా నిర్మించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సంబంధిత అధికారులకు సూచించారు. వరద నగర్, శివ గంగ కాలనీలలోని పార్క్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని కాలనీ వాసులు తెలియజేసిన వెంటనే అక్కడకు వెళ్లి పర్యవేక్షించినట్టు తెలిపారు. పార్కు స్థలాల హద్దులను ఏర్పాటు చేసి ప్రహరీ గోడలు నిర్మిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారన్నారు. పార్క్ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు శ్రీశైలం, నరేష్, బాబు రావు, శ్రీధర్ రెడ్డి, నర్సింహా యాదవ్, కోటయ్య, సత్యం, నరేంద్ర కుమార్, చిన్న యాదవ్, బాలాజీ, బీజేపీ నాయకులు శ్రీధర్ గౌడ్, కడారి యాదగిరి, రమేష్ చారి, సాయి రామ్ గౌడ్, జయ తేజ, మాధవి, యాదగిరి గౌడ్, రవి తేజ, నాగేంద్ర చారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'డ్రంకెన్ డ్రైవ్‌లో 15 కేసులు నమోదు'



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ భారత్ గార్డెన్ వద్ద సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాస్ చార్యులు, ఏసీపీ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు సీఐ నరసింహా నాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా.. సుమారు 15 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐ తెలిపారు. 13మంది ద్విచక్ర వాహనదారులు, 2 కార్లపై కేసులను నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్ప, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలి



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలో హనుమాన్ టెంపుల్ సమీపంలోని చౌరస్తా వద్ద ఉన్న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కూడా ఇందిరా గాంధీ విగ్రహానికి ఉన్న ముసుగు అధికారులకు కనిపించడం లేదా అని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ముసుగును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ చేపట్టారు. బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్.ఏ రహీమ్, జి.నర్సింహ్మాచారి తోడ్పాటు అందించారు. పుస్తకాల దాతలు అభినందన్‌రెడ్డి, వంశరాజు మల్లేష్, సతీష్ బాబు, కే.పున్నం, స్వామి, కే శ్రీనివాస్, రవి రజక, అనిల్ కుమార్, మెకానిక్ కొండల్, డి.శ్రీశైలం, లింగం, శ్రీనివాస్, కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, కాంతారావులను పలువురు అభినందించారు. ప్రతి నెలలో ఒక ఆదివారం ఈ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని జ్ఞానమాల టీం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసం మైపాల్ రెడ్డి, నరేందర్ రావు, రవి నాయక్, దయానంద్ అరుణ్ కుమార్, కుమారస్వామి, చిన్నారావు, గిరి, నాగేష్, వేణు సాయికుమార్, సుధీర్, శేఖర్, ఉప్పలయ్య, సాయిలు, శ్రీశైలం యాదవ్, లక్ష్మీనారాయణ, రవి, సద్గురు చారి, జగన్మోహన్ రావు, వెంకటయ్య, భాష , ప్రభు మహిళలుపాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోలకే అందించాలి

- చెత్త సేకరణపై ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అవగాహన



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌ను స్వచ్ఛమైన ఉప్పల్‌గా తీర్చిదిద్దడంలో ప్రజలందరూ భాగస్వామ్యులై సహకరించాలని ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఉప్పల్ డివిజన్ ఓల్డ్ భరత్ నగర్ కాలనీలో ఇంటి నెంబర్ 2-7-4 32 ఫ్యామిలీల వారికి ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు గత నెల రోజులుగా ఇంటింటి సర్వే నిర్వహించి ఆ ఇంటిలో ఉన్న కిరాయిదారులు (32 ఫ్యామిలీలు) చెత్తను స్వచ్ఛ ఆటో వారికి ఇవ్వడం లేదని వారికి అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా ప్రతీ ఇంటికి వారు చెత్తను స్వచ్ఛ ఆటోకు ఇస్తున్నందుకు స్వచ్ఛ ఆటో వారికి నెలవారి డబ్బులు చెల్లించుటకు కార్డు సిస్టంను ప్రవేశపెట్టారు. పలు జీవీపీల వద్ద ప్రజలు చెత్త వేయకుండా నూతన టెక్నాలజీ సీసీ కెమెరా విత్ మైక్ సిస్టంతో ఏర్పాటు చేసి ఆశించిన ఫలితాలను రాబడుతున్నారు. కానీ కొంత మంది భరత్ నగర్ బస్తీలో ఇంటి యజమానులు బాధ్యతా రహితంగా ఇప్పటికీ కూడా చెత్తను స్వచ్ఛ ఆటో వారికి ఇంటి చెత్తను ఇవ్వకుండా ఆరు బయట ప్రదేశాల్లో పడేస్తున్నారు. అందువలన ఉప్పల్ సర్కిల్ పారిశుధ్య అధికారులు, సిబ్బంది ఎక్కువ మంది ఉండే ఇంట్లో వెలువడే చెత్తను స్వచ్ఛ ఆటో వారికి ఇవ్వాలని పలువురి ఇంటి ముందు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈ చందన, సానిటరీ సూపర్వైజర్ రాజేశ్వర్ రెడ్డి, రామ్‌కి సూపర్వైజర్లు నవీన,నరసింహ రెడ్డి, పారిశుధ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భరత్ నగర్ కాలనీ వివిధ వీధుల్లో చెత్తను ఆటో వారికి ఇవ్వాలని, చెత్త ఆటో వారికి వారి సేవలకుగాను నెలవారీ డబ్బులు తప్పనిసరిగా చెల్లించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ చెత్తను బయట పడేసిన వారికి రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రజలందరూ తమ ఇంటి చెత్తను స్వచ్ఛ ఆటో వారికి ఇవ్వాలని సూచించారు. ఉప్పల్ సర్కిల్ సిబ్బందికి, ఆటో వారికి సహకరించాలన్నారు. ఉప్పల్ సర్కిల్‌ను చెత్తరహిత సర్కిల్‌గా తీర్చిదిద్దుటకు ప్రజల సహకారం చాలా అవసరమని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చిల్కానగర్ డివిజన్‌లోని ఇందిరా నగర్‌లో రూ.10.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణా పనులకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. అందులోనే భాగంగానే ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ ఇందిరానగర్‌లోని అన్ని వీధుల్లో పాత మంచినీటి పైప్ లైన్ తొలగించి కొత్త మంచినీటి పైపులైన్ వేశామని చెప్పారు. ఇంకా సివరేజ్ లైన్లు, సీసీ రోడ్లు వేసుకోవాల్సిన వీధులు ఉన్నాయని, వాటిని సైతం త్వరలో వేస్తామని పేర్కొన్నారు. చిల్కానగర్ డివిజన్‌లో రూ.70 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో చిల్కానగర్ డివిజన్‌ను ఉప్పల్ నియోజకవర్గంలోనే నంబర్ వన్ డివిజన్‌గా తీర్చి దిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమ నాయకులు, మహిళ నాయకురాలు, ఇంద్రానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



- నాగారం మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ హరిబాబు

నవతెలంగాణ-కీసర

అంబేద్కర్ ఆశయాలను అందరూ కలిసి ముందుకు తీసుకెళ్లాలని నాగారం మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ పంగ హరి బాబు అన్నారు. కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే జ్ఞానమాల కార్యక్రమం ఈ ఆదివారంతో 125వ వారానికి చేరింది. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా నాగారం మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ పంగ హరి బాబు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తానే ఈ రోజు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నానని అన్నారు. అంబేద్కర్ రాసిన ఆర్టికల్ ప్రకారం దేశంలో సంస్కరణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప శక్తిమంతుడు అని కొనియాడారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలని ఆనాడే ఆకాంక్షించారని చెప్పారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ నాయకులు ఎర్ర కుమార్, కిష్టిగారి రవి, కొప్పుల నర్సింగ్, కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు బక్కని కుమార్, కోశాధికారి శ్యామ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు మొరుగు నవీన్, కట్ట శంకరయ్య, గంగి సుధాకర్, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డ్ మెంబర్ శీలం శ్రీనివాస్, జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చినింగని బాల్ ,శీలం మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ మంచాల రాజలింగం,మాజీ ఉపాధ్యక్షులు బంటు శ్రీనివాస్, గంగి ఆంజనేయులు ,ఎర్ర సాయిలు , రామరం రమేశ్, గోక కృష్ణ, తుడుం బాలకృష్ణ పాల్గొన్నారు.

పలు చోట్ల డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



నవతెలంగాణ-కీసర

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా చీర్యాల గ్రామంలో బీజేపీ గ్రామ అధ్యక్షులు కోల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు చిందం నాగేష్, బోడ శ్రీనివాస్ రావు, కోల బాలరాజ్ యాదవ్, ఏలూరు సత్యనారాయణ మాదిరాజు, బర్లపాటి ఆంజనేయులు, పొట్ట ఆంజనేయులు, కంచెమీది సుదర్శన్, కోల మహేందర్ యాదవ్, కె.కృష్ణారెడ్డి జి.నవీన్‌రెడ్డి, కుమార్, ఆంజనేయులు, బాల్‌రాజ్, నాగార్జున, వంశి, నర్సింగ్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..



జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్, రజిత వెంకటేష్,నాయకులు కిషన్,మలిగే అశోక్,మధుసూదన్ రెడ్డి,చెంచాల సురేష్,కృష్ణ, ఆంజనేయులు, నాగరాజు, ప్రదీప్ రెడి, అరుణ్, రాంబాబు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..



అల్వాల్ పరిధిలోని మచ్చ బొల్లా రంలో జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సంద ర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు వెంకటేష్, మల్లికార్జున్ గౌడ్, మోయె సుజాత, పద్మిని, అజిత్ సాయి, ప్రదీప్, శ్రీకాంత్, నవీన్ ఆర్మీ, జస్వంత్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్‌లో మొక్కలు నాటారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు



- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, ఆనంద్ కుమార్

నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బీపీ, షుగర్ రోగుల కోసం నిర్వహించిన 106వ మెడికల్ క్యాంపు విజయవంతమైందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, ఆనంద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీలు నిరంతరంగా 106 నెలలుగా బీపీ, షుగర్ బాధితులకు మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదికకు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ రాష్ట్ర కమిటీ తరపున అందజేస్తామని తెలిపారు. జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్ష కోశాధికారులు టి.శ్రీనివాస్, జెన్నీషా పైక్ మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక తన సామాజిక బాధ్యతగా జిల్లా పరిధిలో మూడు చోట్ల ఎనిమిది ఏండ్లుగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక మండల కమిటీల నాయకులు, కార్యకర్తలను అభినందించారు. అనంతరం ఈ క్యాంపునకు వచ్చిన 175 మంది పేషెంట్స్‌కు డాక్టర్లు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయరాజ్, డాక్టర్ లక్ష్మీ నరసింహ, డాక్టర్ మాధవి, మెడికల్ క్యాంపు కన్వీనర్ జి కరుణాకర్ రెడ్డి, కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, పటేల్ నర్సింహులు, శివప్రసాద్ కీసర మండల ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.చౌదరి, నాయకులు సోమయ్యచారి, నాగేశ్వరరావు, కరుణాకర్ రెడ్డి, శ్రవణ్, ఉదయశ్రీ, మల్లిక, హనన్య, తాహిర్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన కుమ్మరి సంఘం సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని కుషాయిగూడ కుమ్మర సంఘం సభ్యులు మల్కాజిగిరి ఎంపీ రాజేందర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి టి. నాథం, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, శ్రీనివాస్, రమేష్, ఎస్. ప్రసాద్, శివప్రసాద్, లక్ష్మీప్రసాద్, సాయి కిరణ్, సాయికుమార్, కార్తీక్ , సురేందర్, మధు, జైవర్ధన్ ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డులో పేర్లను నమోదు చేసుకోవాలి



- కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు వెంటనే ఇవ్వాలి
- కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్‌బీ

నవతెలంగాణ-జవహర్‌నగర్

భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు తమ పేరును కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవాలని కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్‌బీ అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో భర్త చనిపోయిన, దున్న పోతుల లక్ష్మి, మేకల పద్మ అనే కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు నుంచి ఒక్కొక్కరికి రూ.లక్షా ముప్పై వేల రూపాయలు, రమాదేవి అనే కార్మికురాలికి డెలివరీ ఖర్చుల నిమిత్తం రూ.30 వేల చెక్కులను ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంఘ నాయకులు ఎస్‌కే. మీరా, యాదగిరి, తదితరులు, పాల్గొన్నారు.

పశు వైద్యులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సన్మానం



నవతెలంగాణ-ఘట్కేసర్

పురిటినొప్పులు భరించలేక చనిపోతుందనుకున్న గేదెకు చికిత్స చేసి ప్రాణాలతో బయట పడేసిన పశు వైద్యులను ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. వివరాల్లోకి వెళ్లితే.. ఘట్కేసర్ మండల పరిధిలోని అవుషాపూర్ గ్రామంలో ఓ రైతు గేదే పురిటినొప్పులతో ఐదు గంటలు తల్లడిల్లింది. గేదే బాధను చూసిన రైతు స్థానిక జూనియర్ పశువుల డాక్టర్ పద్మినికి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన డాక్టర్ పద్మిని గేదే పరిస్థితిని తనపై స్థాయి డాక్టర్ డీవీహెచ్‌ఓ శంబూ లింగంకు సమాచారం ఇచ్చింది. దీంతో శంబూ లింగం రాత్రి 10 గంటలకు సుమారు గంటన్నర పాటు శ్రమించి గేదేకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. అప్పటికే గేదే కడుపులో ప్రాణాలు కోల్పోయిన దూడను బయటకు తీశారు. ప్రస్తుతం గేదే క్షేమంగా ఉంది. వాళ్ల డ్యూటీ వాళ్లు చేశారని చాలా మంది అనుకోవచ్చు. కానీ అర్ధరాత్రి పురిటి నొప్పులతో ప్రభుత్వ దవాఖానకు వచ్చే మహిళలను ఇక్కడ కాన్పు చేయలేం. మరేదైనా పెద్దాసుపత్రికి వెళ్లండి అంటూ నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టే వైద్యులు మనకు చాలా సందర్భాలలో తారాస పడుతారు. ఈ ఇద్దరు పశువుల డాక్టర్లు మాత్రం అర్ధరాత్రి అని చూడలేదు. పశువే కదా అని వదిలి వేయలేదు. ఓ మహిళ డాక్టర్ రాత్రి వచ్చి చనిపోతుందనుకున్న రూ.80 వేల ఖరీదైన గేదేను కాపాడి పేద రైతుకు అండగా నిలించింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి వైద్యులను శాలువాతో సన్మానించారు.

ఉప్పల్ భగాయత్ ప్రేమ జంట కేసులో సీఐపై బదిలీ వేటు

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ భగాయత్‌లో ప్రేమజంటను వేధించిన కేసులో నిందితులపై పిట్టీ కేసు నమోదు చేసి డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణలో ఎస్ఐ శంకర్‌ను డీసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి పై కూడా బదిలీ వేటు పడింది. ఆయనను సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

చివరి దశకు చేరిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని సెయింట్ ఫీటర్ స్కూల్, శాంతి గార్డెన్, ఇంద్రానగర్, రైతు బజార్లకు వెళ్లే దారిలో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్ మక్తాల శేఖర్ గౌడ్, యాదగిరి, చంద్రశేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, శ్రీనివాస్‌లు సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్స్ ప్రారంభించే నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న నాచారం డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏఈ లింగారావును అభినందించారు.

సమాజంలో వితంతువులను గౌరవించాలి



- కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్,
- జవహర్ నగర్‌లో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం

నవతెలంగాణ - జవహర్ నగర్

సమాజంలో వితంతువులను గౌరవించాలని, మూఢనమ్మకాలను వదిలేయాలని కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిస్సా వికలాంగుల కాలనీలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వితంతువుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు పారదోలాలని, వితంతువులను సమాజంలో అన్ని విధాలుగా గౌరవిస్తూ వారికి మనోధైర్యాన్ని అందించాలన్నారు. పెన్షన్, జీరో కరెంటు బిల్లు, చిన్న పిల్లల చదువుల కోసం గవర్నమెంట్ పథకాలు అందేలా సహకరిస్తామని తెలిపారు. అనంతరం పలు కాలనీలలో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు వారికి స్నాక్స్, ఫ్రూట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో బాల వికాస హైదరాబాద్ సిటీ కోఆర్డినేటర్ వినోద్ రెడ్డి, హైదరాబాద్ సిటీ డివిజన్ డైరెక్టర్ బూడిద వెంకటేష్, బాషపల్లి రమేష్ చారి, బాల వికాస సెల్వి, రూతు, రాణి, మంజుల, రవి, తదితరులున్నారు.



బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మహేందర్ యాదవ్



నవతెలంగాణ-జవహర్‌నగర్

మేడ్చల్ జిల్లా బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జవహర్ నగర్‌కు చెందిన మహేందర్ యాదవ్‌ను నియమిస్తూ ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు పటోళ్ల విక్రం రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు విలువనిస్తూ, కార్యకర్తల అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ పార్టీ అధ్యక్షుడు కమల్, రామ్ నాయక్, మెరుగు భిక్షపతి, మల్లేష్ గౌడ్, డాక్టర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం



- బీసీల కుల గణన వెంటనే చేపట్టాలి
- 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి
- బీసీ నాయకులు కామల్ల ఐలన్న, ప్రొఫెసర్ చంద్రయ్య

నవతెలంగాణ-జవహర్ నగర్

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టి వాటి ఫలితాల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కామల్ల ఐలన్న ప్రొఫెసర్ చంద్రయ్యలు అన్నారు. బీసీ కులాల ఐక్య వేదిక సర్వ సభ్య సమావేశం కామల్ల ఐలన్న అధ్యక్షతన జీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్ సంతోషిమా నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా ప్రొఫెసర్ చంద్రయ్య కురుమ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం నిర్మాణం బలోపేతం చేసినప్పుడే ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. స్థానికంగా ఉండే తక్షణ సమస్యల పరిష్కారం కోసం బీసీ నాయకులను, స్థానికులను, ప్రజలను జాగృతం చేసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో లక్షలాది మంది బీసీ కులాల ప్రజానీకం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబడి ఉన్నారని వారి అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కోసం, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టి వాటి ఫలితాల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి అసెంబ్లీలో బిల్లు తీర్మానం చేయాలని కోరారు. ఆర్థికంగా వెనకబడిన బీసీ కులాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

ఈనెల 29వ తేదీన సాయంత్రం మరోసారి సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. బీసీ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, కోశాధికారి అప్పాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జినుకుంట్ల రమేష్ గౌడ్, వగ్గు చంద్ర శేఖర్ రావు కురుమ, కొండలు గౌడ్, రామ కృష్ణ ముదిరాజ్, టి.ఆర్.ఎస్ నాయకులు శ్రీనివాస్, బీసీ నాయకులు సీతారాం వర్మ మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షులు కాసర్ల నాగరాజు, చేగురి రామ్ మోహన్ కురుమ, వంశీ ముదిరాజ్, బీసీ కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

చార్మినార్ నుంచి ఎల్బీ స్టేడియం వరకు ఒలంపిక్ రన్



నవతెలంగాణ చాంద్రాయణగుట్ట

ఒలంపిక్ డే సందర్భంగా చార్మినార్ నుంచి ఎల్బీ స్టేడియం వరకు ఒలంపిక్ రన్ ప్రారంభమైంది. వివిధ గ్రస్ట్రుల చెందిన కోచ్‌ల ఆధ్వర్యంలో ఈ రన్ ప్రారంభించారు. మిత్ర క్లబ్‌కు చెందిన బాక్సింగ్ కోచ్ సత్యనారాయణ, సురేందర్, యాదగిరి, ఈరన్ ప్రారంభించారు. ఈ రన్ చార్మినార్ నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమై ఎల్బీ స్టేడియం వరకు చేరుకుంది. ఈ ఒలంపిక్ రన్‌లో శారదా మహా విద్యాలయ స్కూల్ విద్యార్థులతో పాటు సరస్వతి అకాడమీ స్కూల్, రోజరీ కాన్వెంట్ స్కూల్, బాయ్స్ టౌన్ స్కూల్, అకాడమీ స్కూల్ మొదలగు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో శారద మహా విద్యాలయ విద్యార్థులు కాగడాని వెలిగించి రన్ ప్రారంభిం చారు. ఈ ప్రారంభ కార్యక్రమం శారద మహావిద్యాలయ పీఈటీ అరుణ్ కుమార్, రాజేందర్, ఆసిఫ్, దీపిక, మాధవి, సంధ్య సింగ్, తదితరులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 255వ అన్నదానం

- హాజరైన ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు



నవతెలంగాణ - ముషీరాబాద్

రోడ్ల పైన నివసిస్తున్న నిరాశ్రయులకు అనాథలకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 255వ అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు హాజరై స్కై ఫౌండేషన్ వారు చేస్తున్న సేవను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు నేహ చిన్నారి, రోషిని, అఖిల్, ఇఫ్తాన్, జతిన్, శుభం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ముదిరాజులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు శివ ముదిరాజ్ అన్నారు. ఆదివారం హనుమాన్ టేకిడిలోని బీసీ సాధికారత భవన్‌లో ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ముదిరాజుల సామాజిక న్యాయం కోసం- హక్కుల కోసం దిశ - దశ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ముదిరాజులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం ముదిరాజులను బీసీ - డి నుండి బీసీ -ఏలోకి మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ముదిరాజులకు కోకాపేటలో కేటాయించిన ముదిరాజ్ కుల భవనానికి సంబంధించిన సమీక్ష చేసి, ఆ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ముదిరాజులకు 8 నామినేటెడ్ చైర్మెన్ పదవులను కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాబిన్ హుడ్, పండుగ సాయన్న జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు మొర రవికాంత్ ముదిరాజ్, అనిల్ కుమార్ ముదిరాజ్, శ్రీహరి ముదిరాజ్, నరసింహులు ముదిరాజ్, శివ ముదిరాజ్, ఉదయ్ ముదిరాజ్, బ్రహ్మ ముదిరాజ్, సాయి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'కులం పేరుతో దూషించిన ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలి'



- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర సచివాలయంలో దళిత మహిళా అధికారిణిపై కులం పేరుతో దూషించిన అగ్రకుల ఉన్నతాధికారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ హైదరాబాద్ జిల్లా సభ్యులు బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేష్ హెచ్చరించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సచివాలయంలో ఆర్థిక శాఖ విభాగంలో జాయింట్ సెక్రటరీ హోదాలో పని చేస్తున్న దళిత మహిళా అధికారిణిని అదే శాఖలో పని చేస్తున్న డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్న ఎం.పద్మావతి ఆమెను గత మార్చి నెలలో అకారణంగా కులం పేరుతో దూషిస్తూ ఆ శాఖ వాట్సప్ గ్రూప్ లో పోస్ట్ పెట్టారని ఆరోపించారు. ఈ విషయం తెలిసిన ఫైనాన్స్ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.అతన్ని వెంటనే తన పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధిత దళిత మహిళ అధికారిణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దూషించిన అధికారిణిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసుకుని చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వహించి కాంప్రమైజ్ చేస్తామంటూ బాధితురాలికి చెప్పి తీవ్ర మనోవేదనకు గురి చేశారని వారు తెలిపారు.ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, త్వరితగతిన సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎన్.దాస్, శివ, అనిల్, బలరామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను మెరుగుపరచాలి

- తెలంగాణా ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయు అనుబంధం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను మెరుగు పరచాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హనుమేష్, ఐఎఫ్‌టీయు హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల కార్యదర్శి ప్రవీణ్‌లు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నల్లన్న జిల్లా నాయకులు వెంకటేష్, రామకృష్ణలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు 15 రోజుల పని దొరకడం కష్టంగా మారిందన్నారు. 10 ఏండ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులను ఏమాత్రం లెక్క చేయలేదని, కార్మికులను పట్టించుకోలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయు నగర కార్యదర్శి వి.ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాయని, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. యజమానులకు, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మార్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. మోడీ ప్రభుత్వం అయితే ఏకంగా 29 చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి కార్మిక వ్యతిరేకతను ప్రదర్శించారని అన్నారు. కొత్తగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్నటువంటి జీవోలను అన్నిటిని కూడా వెంటనే అమలు చేసి తన యొక్క ప్రజా 'ప్రజా పాలన' ను కనబరిచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ నాయకులు మల్లేష్, నరసింహ, మహదేవ్, నగేష్, అనీఫ్, బాలు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఏకో టూరిజం పేరుతో అడవులను నాశనం చేయొద్దు'



- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఏకో టూరిజం పేరుతో అడవులను నాశనం చేయొద్దని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వం అడవుల్లో ప్రకృతి పర్యాటకం అభివృద్ధి ఆలోచనను వెంటనే మానుకోవాలని కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య, గౌరవ అధ్యక్షులు లక్ష్మీ నారా యణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రకృతి, వన్య ప్రాణులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తామని పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. దశాబ్దాలుగా జరిగిన అడవుల విధ్వంసంతో ప్రకృతి సమతుల్యత కోల్పోయి, జీవవైవిధ్యం దెబ్బ తిని అనేక వాతావరణ సమస్యలు ఎదురవుతున్న పట్టించుకోకుండా మరింత నష్టం చేసేలా ఏకో టూరిజానికి పూనుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ఏకో టూరిజం తో పర్యావరణ విధ్వంసానికి కారణం కావద్దని వారు హెచ్చరించారు. టూరిజం పేరుతో అడవుల్లోకి ద్వారాలు తెరిస్తే ఆపడం ప్రభుత్వ తరం కాదన్నారు. అనేక ప్రభుత్వ వ్యవస్థలు ఉన్న మైదాన ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టి క్ లాంటి వాటి కట్టడి మాటలకే పరిమితం అయిందని, అలాంటిది ఏకో టూరిజం పేరుతో అడవుల్లో జరిగే నష్టాన్ని ఎలా ఆపుతారని వారు ప్రశ్నించారు. ప్రకృతి టూరిజంలో వ్యాపార దృక్పధం మాత్రమే కనిపిస్తుందని, భావితరాలను కాపాడాల్సిన ప్రభుత్వ బాధ్యత కనిపించడం లేదని విమర్శించారు. అడవుల రక్షణ పర్యావరణ పరిరక్షణ అనేది భావితరాల మనుగడకు సంబంధించిన విషయమన్న వాస్తవం ప్రభుత్వం మరువరాదని గుర్తు చేశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకున్నారని, కానీ పర్యావరణ రక్షణ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం ఏకో టూరిజం ఆలో చనను మానుకుని, పర్యావరణ పరిరక్షణకు మరిన్ని పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సినీ రంగానికి టాలెంట్ ఉన్న కళాకారులు ఎంతో అవసరం

- ఎస్‌హెచ్ వాయిస్ ట్రైనింగ్ అకాడమీ అవగాహన సదస్సులో కళాకారులు



నవతెలంగాణ-ముషీరాబాద్

సినీ రంగానికి టాలెంట్ ఉన్న కళాకారులు ఎంతో అవసరం అని ఎస్‌హెచ్ వాయిస్ ట్రెనింగ్ అకాడమీ అవగాహన సదస్సులో కళాకారులు అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌హెచ్ వాయిస్ ట్రెనింగ్ అకాడమీ ఫౌండర్ చైర్మెన్ మిమిక్రీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్ వాయిస్ ట్రెనింగ్ అకాడమీ వాయిస్‌పై అవగాహన, మిమిక్రీ, వెంట్రు లాక్రిజం యాంకరింగ్ వాయిస్ మచులేషన్ , తదితర అంశాలపై అవగాహన ట్రెనింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మిమిక్రీలో దిగ్గజాలైనటువంటి వాయిస్ రంగంలో శిఖరాగ్రస్థాయిని చేరుకున్నటువంటి అతిథులు జీవీఎన్ రాజు, ఇంటర్నేషనల్ మిమిక్రీ కళాకారులు, ఆర్సిఎం రాజు, డబ్బింగ్ ఆర్టిస్ట్ చంద్రముఖి చంద్రశేఖర్, సీనియర్ మిమిక్రీ కళాకారులు సినీ నటులు శివప్రసాద్, దిల్ రమేష్, సీనియర్ చలనచిత్ర నటులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నటువంటి ఈ వాయిస్ రంగంలో సామాజిక మాధ్యమాలకు సినిమాలకు, ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలకి ఎంతో మంది కళాకారుల లోటు ఉందని పేర్కొన్నారు. ఈ ఎస్‌హెచ్‌పి వాయిస్ ట్రెనింగ్ అకాడమీ ద్వారా ఎంతో మంది కళాకారులని వాయిస్ ట్రెనింగ్ ద్వారా డబ్బింగ్ ఆర్టిస్టులోని ,మిమిక్రీ ఆర్టిస్ట్‌లని వెంట్రులకు యాంకర్స్ ఇలా ఎంతో మందిని తయారు చేయొచ్చని తెలిపారు.

ఉపాధి కల్పిస్తే.. నిరుద్యోగ సమస్య తీరుతుంది

☞ చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి





నవతెలంగాణ-హిమాయత్ నగర్

పెద్ద పెద్ద కంపెనీలు నెలకొల్పుతున్న నేపథ్యంలో గ్రామాల వరకు విస్తరించిన వెయ్యి మందికి ఉపాధి సృష్టించడం లేదని, కేవలం ఆర్థిక ప్రగతి సరిపోదని, అంచలంచెలుగా ఉపాధి కల్పిస్తూ ఉంటే నిరుద్యోగ సమస్య తీరుతుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు.తెలంగాణ స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో స్వదేశీ స్వావలంబన రాష్ట్ర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కల్పిస్తూ పోతున్న సాఫ్ట్ వేర్ రంగం సైతం ఇదే విధానంలో కొనసాగుతుందని, అలా కాకుండా చిన్న తరహా, సూక్ష్మ తరహా పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి సృష్టించాలని, వాటి కోసం యువత ముందుకు రావాలని కోరారు. స్వయం ఉపాధి అందుకు మార్గమని ఆయన సూచించారు. అనంతరం సినీ రచయిత, దర్శకులు, రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదని, దేశమంటే మనుషులు అని గురజాడ ఏ విధంగా చెప్పారో మన దేశ వృద్ధి చిన్న పిల్లల ద్వారానే ప్రారంభం కావాలని, చిన్న పిల్లలుగా ఉన్నప్పటి నుండే పనులు చేయడం, నేర్పడం ద్వారా 'చదువుతూ సంపాదించు' అనే నినాదంతో స్వయం ఉపాధి వరకు ఆలోచన సరళీ మారాలని దానికి అనుగుణంగా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సభల కన్వీనర్ బొల్లంపల్లి ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ క్షేత సహ సంయోజక్ సత్తు లింగమూర్తి, అఖిల భారత స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ ఆర్.సుందరం, తెలంగాణ, ఆంధ్ర ప్రాంత స్వదేశీ జాగరణ మంచ్ ప్రచార ప్రముఖ్ శ్రీనాథ్, తెలంగాణ ఆర్ఎస్ఎస్ కార్యకారిణి సభ్యులు అన్నదానం సుబ్రహ్మణ్యం, ఆసు యంత్రం సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి నగరానికి వచ్చిన సందర్భంగా కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ నాయకులు దినేష్ అంబారి ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

'సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం చారిత్రాత్మకం'

- ప్రభుత్వ నిర్ణయంతో రంగారెడ్డి జిల్లాలో 46 వేల మంది రైతులకు లబ్ధి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తూ రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని "టెస్కాబ్" వైస్-చైర్మెన్, రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, సాహసోపేతమని చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా సీఎం ఎ.రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సహకార బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన సుమారు 46 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ తీవ్ర ఆర్థిక భారం పడుతున్నప్పటికీ వీటినేమి లెక్క చేయకుండా ఒకేసారి రూ.31 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు పూనుకోవడం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన పరిణామమని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయం లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆయన కొనియాడారు.

ప్రభుత్వాసుపత్రుల కార్మికుల సమస్యలపై జూలై 3న ధర్నా

'కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులను దోచుకుంటున్నారు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రభుత్వాసుపత్రుల కార్మికుల సమస్యలపై జూలై 3న డీఎంఈ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలంగాణ మెడికల్ కాం ట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్య దర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు అందాల్సిన వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులను దోచుకుంటున్నారన్నారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల కార్మికులకు జీవో నెంబర్60 ప్రకారం రూ.15,600లు కాగా పీఎఫ్, ఈఎస్ఐ కట్ అవ్వగా రూ.13,600 రావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.11,000 జీతం మాత్రమే ఇస్తున్నారని, ఇంకొన్ని ఆస్పత్రుల్లో పది వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. అధికారులు జీవో ప్రకారం టెండర్ పిలిచి కార్మికుల జీతాలు సక్రమంగా అందుకున్న పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకే జూలై 3న డీఎంఈ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్ల అవినీతిని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకే ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.గత ప్రభుత్వంలో విడుదల చేసి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిన జీవో నెంబర్.21ని అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, కింది స్థాయి కార్మికుల అక్రమ తొలగింపులను అరికట్టాలని, కార్మికులపై కాంట్రాక్టర్లు, అధికారుల వేధింపులను మానివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం.లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శులు పి.సురేష్, సిరా దేవేందర్, సుధాకర్, ఎస్.కిష్టమ్మ, ఇమ్రాన్, వెంకటరాజ్యం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే వాగును తలపిస్తున్న ఛత్రినాక చౌరస్తా





నవతెలంగాణ చాంద్రాయణగుట్ట

పాతబస్తీలోని ఛత్రినాక చౌరస్తా చార్మినార్ నుంచి చాంద్రాయణగుట్ట వెళ్లాలన్న అటు నుంచి ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌కు, గౌలిపురకు ఇది ప్రధాన రహదారి.. కొద్దిపాటి చినుకు పడితే పొంగిపోతుంది. శివగంగా నగర్, శివాజీ నగర్, ఉప్పుగూడ ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. చిన్నపాటి వర్షానికి ఛత్రినాక చౌరస్తా రోడ్లు చిన్నపాటి వాగులో తలపించాయి. ఎక్కడ మాన్యువల్ ఓపెన్ ఉన్నాయో వాహనదారులు ఎక్కడ ప్రమాదాన్ని గురైతారన్న భయంతో ఛత్రినాక ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా భారీ గేట్లు ఏర్పాటు చేశారు. వాహనాలు ఎక్కడికక్కడ ఆపేశారు. ప్రతిసారి వర్షం పడినప్పుడు జరుగుతున్న తంతు ఇదే.. కానీ మున్సిపల్ అధికారులు ఈ సమస్యకు పరిష్కార మార్గాన్ని చేయలేకపోతున్నారు. శివగంగా నగర్ నుండి ఇంజన్ బావి గాంధీ నగర్ పై నుండి వచ్చే వరద నీరు ఒక్కసారిగా ధాటిగా వచ్చి ఛత్రినాక కూడలిలోని షాపులలోకి వెళ్లడమే కాక రోడ్డు అంతా ఉధృతమైన వరదగా మారి ప్రవహిస్తూ తీవ్ర ఇబ్బంది కలుగజేస్తుంది. వర్షం వచ్చిందంటే ఈ ప్రాంతానికి వెళ్లాలంటే అటు వెళ్లే ప్రయాణికులు వేరే దారి చూసుకోవాల్సిస్తుంది. ఈ వరద ఉధృతి తగ్గాలంటే కనీసం ఒక గంట సేపు అక్కడ ట్రాఫిక్‌ను నిలిపివేయాల్సి వస్తుందని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు.

చనిపోయాడని అంత్యక్రియలకు ఏర్పాట్లు..

- అంతలోపే వ్యక్తి ప్రత్యక్షం
- బషీరాబాద్ మండలంలో ఆసక్తికర ఘటన



నవతెలంగాణ-బషీరాబాద్

బషీరాబాద్ మండలంలోని నవాంగి గ్రామంలో ఓ వింత సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ రైల్వే పోలీస్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ రైల్వే స్టేషన్లో ఓ వ్యక్తిని ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడం వలన అక్కడికక్కడే మృతి చెందాడు. మర ణించిన వ్యక్తి దగ్గర సెల్ ఫోన్ దొరి కింది. సెల్ ఫోన్‌లో లభించిన నెంబర్లకు ఫోన్ చేయగా బషీరాబాద్ మండలం నవంగి గ్రామానికి చెందిన సుతెల్లి ఎల్లప్పగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు రైల్వే పోలీస్ సిబ్బంది సుతెల్లి ఎల్లప్ప చనిపోయాడని సమాచారం అందించారు. దీంతో సుతెల్లి ఎల్లప్ప కుటుంబీకులు, పొరుగువారు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, తాండూర్ బస్ స్టేషన్లో సుతెల్లి ఎల్లప్ప సజీవంగా ప్రత్యక్షమయ్యాడు. ఈ సమాచారం కుటుంబీకులకు, గ్రామస్తులకు తెలిసింది. అయితే చనిపోయిన వ్యక్తి ఎవరో అని ఆశ్చర్యపోయారు. చనిపోయాడని తిరిగి వచ్చిన సుతెల్లి ఎల్లప్పను వివరాలు అడగగా తాండూర్ రైల్వే స్టేషన్‌లో తన సెల్ ఫోన్‌ను శనివారం రాత్రి ఎవరో దొంగలించారని తెలిపారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఢీకొని చనిపోయిన వ్యక్తి ఆ దొంగే అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అంత్య క్రియలకు తీసుకొచ్చిన శవంను తిరిగి రైల్వే సిబ్బందికి అప్పగించారు.

గిరిజన సంఘం నూతన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ కంచనబాగ్ డివిజన్ మీదాని బస్తీ గిరిజన సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు కిషన్ నాయక్, కృష్ణ నాయక్, కోటయ్యలు పాల్గొని ప్రసంగించారు. సమాజంలో గిరిజనులు వెనుకబడినటువంటి పరిస్థితి ఉందన్నారు. దీన్ని ఎక్కడికక్కడ స్థానికంగా కమిటీలు ఏర్పాటు చేసుకొని కమిటీలతో అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గిరిజన సంఘం కంచనబాగ్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఎస్. వెంకట్ రామ్, ప్రెసిడెంట్ గా ఎం.బాలు నాయక్, కమిటీ సభ్యులుగా రవి నాయక్, గోపి శంకర్నాయక్, గోపి లక్ష్మణ్ తదితరులను ఎన్నుకున్నారు.

'నీట్' వెంటనే రద్దు చేయాలి

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

నీట్ రద్దు చేయాలని పేపర్ లీకేజీకి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జ్ చేత విచారణ జరిపించాలని అందుకు బాధ్యుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడ డివిజన్ పరిధిలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ హాజరై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యను కేంద్ర ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే మన వైద్య విద్యకు ఒక గొప్ప గుర్తింపు ఉందని కొందరు రాజకీయ నాయకులు డబ్బుకు కక్కుర్తి పడి కోట్ల రూపాయలకు కొమ్ముక్కై జాతిని అమ్ముకున్నారని విమర్శించారు. దేశ వ్యాప్త ఆందోళనలతో ఎన్‌టీఏ గ్రేస్ మార్క్స్ ను తొలగిస్తున్నామని తెలిపిందని విద్యార్థులకు న్యాయం జరిగే వరకు అండగా ఉండి వారి పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో, గుజ్జ సత్యం, నీల వెంకటేష్, సి. రాజేందర్, అనంతయ్య, చక్రవర్తి, ప్రీతం, పవన్ భాస్కర్, కమల్, శివ, అనిల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబీ క్రిష్ణ యాదవ్ జన్మదిన సందర్భంగా శాలువా తో సత్కరించి పూల బొకే అందజేసిన ఉద్యోగ సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. జ్యోతి రాణి అధికారులు, మల్లేష్, స్వప్న, శ్రీనివాసరావు, శ్రీనివాస్, అజయ్,జాకీర్. సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, అడ్మిటెడ్ ఆఫీసర్ చంద్రశేఖర్, గని, భాష, సందీప్ ఐటీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

మాజీమంత్రి తలసానికి పరామర్శ



నవతెలంగాణ-బేగంపేట్

మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరామర్శించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ఈనెల 10న మరణించారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని రాధికా కాలనీలోని శంకర్ యాదవ్ నివాసానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేరుకొని ఆయన శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ తో పాటు వారి మాతృమూర్తి లలితా బాయి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

అన్ననగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ ఆదివారం అన్ననగర్‌లో పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్రీ ఫేస్ కరెంట్, పాత కరెంట్ పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్ సామల హేమని కోరగా వెంటనే ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కరించాలని ఆదేశించారు. చిలకలగూడ పార్క్ వద్ద డ్రైనేజీ ఓవర్ ఫ్లో ఉందని స్థానికులు ఫిర్యాదు చేయగా స్థలానికి చేరుకుని అక్కడికక్కడే సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో తొలి అన్నక్యాంటీన్ ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలుగు రాష్ట్రాల్లో తేదేపా బలోపేతానికి కృషి చేస్తామని చంద్రబాబు స్ఫూర్తిగా సీబీ ఎన్ ఫోరమ్ కొనసాగుతుందని జెనెక్స్ అమర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రిక అయిన అన్న క్యాంటీన్ తెలంగాణలోని హైదరాబాద్ లో ఏర్పాటైంది. సీబీఎస్ ఫోరం ఫౌండర్, ప్రధాన కార్యదర్శి జెనెక్స్ సంస్థ అధినేత జెనెక్స్ అమర్ మాదాపూర్‌లోని 100 ఫీట్ ఎక్స్ రోడ్స్‌లో ఈ క్యాంటీన్ ఏర్పాటు చేశారు. అన్న క్యాంటీన్‌ను జెనెక్స్ అమర్ పలువురు ప్రముఖులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు నిరుపేదల ఆకలి తీర్చి రాష్ట్ర ప్రజల ఆదరణ పొందాయన్నారు. జూలై మొదటి వారం నుండి క్యాంటిన్ కార్యకలాపాలు అందుబాటులోకి వస్తాయన్నారు. గత సంవత్సరం నవంబరులో ఊపిరిపోసుకున్న సీబీఎస్ ఫోరం ఇక ముందు కూడా పలు సేవా కార్యక్రమాలతో ముందుంటుందని ఫోరమ్ వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ జెనెక్స్ అమర్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్, చంద్రబాబుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఫోరమ్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. అనంతరం అమర్ తోపాటు పలువురు అతిథులు కలిసి కేక్ చేశారు.

పద్మశాలీలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

పద్మశాలి సంఘానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శివంరోడ్డులోని న్యూఆజాం కాంప్లెక్స్ లో సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి బి.అశోక్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గం పద్మశాలి సంఘం కార్యాలయాన్ని గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, గౌరవాధ్యక్షుడు ఎనుగంటి నరేందర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పద్మశాలి సంఘం చాలా పటిష్టంగా ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు తెలిపి అత్యధిక మెజార్టీతో గెలవడానికి సంఘం ప్రతినిధులు కృషి చేశారని చెప్పారు. తనకు మద్దతు తెలిపిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. సంఘానికి సొంత స్థలం సంపాదించుకుంటే దాని భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందజేస్తానని పేరొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు డా.పుట్టపాండురంగయ్య, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. మార్తా రమేష్, సలహాదారులు ప్రొ. తాటకొండ వెంకటరాజయ్య, నక్క రమేష్, ఉపాధ్యక్షులు ఎ.అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులు గంజి వెంకట రమణ, తీగల నరేందర్, పి.మధుసూధన్, సంయుక్త కార్యదర్శులు గంధమల్ల శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేష్, కార్యవర్గసభ్యులు ఆవుల రాములు, నాగుల రాజేందర్, పులిపాటి శ్రీని వాస్, డివిజన్ అధ్యక్షులు పి.దామోదర్, కడిగె శ్రీనివాస్, సంఘం నాయకులు కోట వెంకటేశ్, శ్రీధర్, వనమాల రాజేందర్, రచ్చ శ్రీనివాస్, కిషోర్, రవికాంత్, సాయిని మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల పోరాటమే సమాజానికి స్ఫూర్తిదాయకం



తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ

నవతెలంగాణ-ఓయూ

మహనీయుల పోరాటమే సమాజానికి స్ఫూర్తిదాయకమని ఉస్మానియా విశ్వవిద్యాలయ లా కళాశాల ఆవరణలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కి పూలమాల వేసి తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. సమాజంలో మహనీయుల పోరాటమే సమాజానికి స్ఫూర్తిదాయకమని ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం పౌరుల ప్రాథమిక హక్కులు సమాజంలో ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించాలంటే జ్ఞానమే శరణ్యం కాబట్టి, జ్ఞానమాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరి పాత్ర చాలా ముఖ్యమైనది. సామాజిక బాధ్యతతో విద్య ప్రాముఖ్యతను ప్రజలను చైతన్య పరిచే విధంగా సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాన ప్రచారంలో సమ సమాజ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పందిరి రవికుమార్ , వేదాంత మౌర్య ఎస్ఎస్ఎఫ్ స్టేట్ సెక్రటరీ ,జంతుక శంకర్, ఓయూ విద్యార్థి నాయకులు పార్థు, కళ్యాణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కేవీబీఆర్ స్టేడియంలో ఒలంపిక్ డే రన్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఒలింపిక్ డే రన్‌ను 2024 జూన్ 23న కేవీబీఆర్ స్టేడియం కమిటీ సభ్యులు, చైర్మెన్ వి. నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో 38వ ఎడిషన్ రన్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ రన్ వలన కలుగుతున్న అనేక ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం అడ్మినిస్ట్రేటర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, నరసింహ ఫార్మర్ ఇంటర్నేషనల్ హ్యాండ్ బాల్, క్రైసర్ ఫార్మర్ నేషనల్ ఫుట్బాల్ ప్లేయర్, జగన్మోహన్ గౌడ్ కన్వీనర్, హిమ్రోజ్ ,కామేశ్వరరావు, అన్ని ఆటల కేవీబీ ఆర్ స్టేడియం యొక్క కోచ్‌లు, ఆటగాళ్లు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పు బీసీలకు నష్టం



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

బీహార్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక రిజర్వేషన్లు 50శాతం దాటడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని కాబట్టి బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సామాజిక రిజర్వేషన్లు రద్దు చేస్తున్నట్లు పాట్నా హై కోర్ట్ తీర్పు ఇవ్వడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ తీర్పు బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకమన్నారు. ఎలాంటి గణాంకాలు లేకుండా కమిషన్ సిఫార్సులు లేకుండా రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లు అనుకూలమైన తీర్పును ఇస్తున్న కోర్టులు బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన తీర్పులో మాత్రం వ్యతిరేకంగా ఉండడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, మనిమంజరి, ఇంద్రమ్, తార, గుంటి మహేష్ పాల్గొన్నారు.

హాస్టల్ అసోసియేషన్‌తో పోలీసుల సమావేశం



నవతెలంగాణ-బంజారాహిల్స్

వెస్ట్‌జోన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో హాస్టల్ నిర్వహిస్తున్న నిర్వాహకులతో అసోసియేషన్ సభ్యులతో పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హాస్టల్‌ల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు, ఎవరు వచ్చినా వారి డీటెయిల్స్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గత కొన్ని రోజుల క్రితం బుర్కాలు వేసుకుని ఎస్ఆర్ నగర్‌లో హాస్టల్‌లో దొంగలు హల్చల్ చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా హాస్టల్‌లో సరైన సెక్యూరిటీ లేకపోవడం వలన ఇటువంటి ఘటనలు అత్యధికంగా చోటుచేసుకునే పరిణామం ఉన్నందున అసంఘటిత కార్యకలాపాలకు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులను సైతం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ విషయమైనా పోలీసులకు సమాచారం అందించడం వలన అప్రమత్తంగా ఉండి నేరస్తులను పట్టుకోవడానికి వీలుగా ఉంటుందని సమావేశంలో ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ కుమార్, మధురనగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డిలు, పంజాగుట్ట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంతులు ఎస్సైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా, చేయూత పింఛన్ పెంపు ఇంకెప్పుడు?

- 6 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంపు ఊసేత్తని రాష్ట్ర ప్రభుత్వం
- పెంపు సాధన కోసం ఉద్యమానికి లబ్దిదారులు సిద్ధం కావాలి
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి యం.అడివయ్య

నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

ఆసరా పింఛన్, చేయూత పింఛన్ పెంపు ఇంకెప్పుడని, ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ పెంపు ఊసేత్తడం లేదని, పింఛన్ పెంపు అమలు కోసం ఉద్యమానికి ఆసరా, చేయూత లబ్దిదారులు సిద్ధం కావాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి యం.అడివయ్య పిలుపునిచ్చారు ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కమిటీ సమావేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు జె.దశరథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా, చేయూత పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఆ అంశంపై స్పందించడం లేదన్నారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ అఫ్ రూరల్ పావర్టీ, డిపార్ట్మెంట్ అఫ్ రూరల్ డెవలప్మెంట్ తెలంగాణ ప్రభుత్వం లెక్కల ప్రకారం జూన్ నాటికి వృద్ధులు 16,36,604 మంది, వితంతువులు 15,73,050 మంది, వికలాంగులు 5,14,422 మంది, నేత కార్మికులు 37,296 మంది, గీత కార్మికులు 65,668 మంది, హెచ్ఐవీ 36396 మంది, ఫైలేరియా 18041 మంది, బీడీ కార్మికులు 4,24,834మంది, ఒంటరి మహిళలు 1,43,456 మందికి మొత్తం రాష్ట్రంలో 9రకాల పింఛన్లు 44,49,767 మందికి వస్తున్నవని వివరించారు.

విద్యాశాఖ మంత్రి జాడ ఎక్కడ..?

- ఆరునెలలు గడిసిన ప్రజాప్రభుత్వంలో విద్యపై పూర్తి నిర్లక్ష్యం
- తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారీ అశోక్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కాంగ్రెస్ ప్రతిపక్షంలో తీవ్రంగా విమర్శించింది. నేడు విద్యార్థి, నిరుద్యోగులు కోరుకోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటే ఆరునెలలు గడిచిన విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం ప్రభుత్వా నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్ కుమార్ అన్నారు. పదేండ్లుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యా పూర్తిగా ధ్వంసమైందని ఆరువేలకు పైగ పాఠశాలలు మూతపడాయని స్వయంగా నేడు రాష్ట ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి నాడు ప్రతిపక్షంగా విమర్శించినప్పటికి అధికారంలోకి వచ్చినాక వాటిపై ఏనాడు దృష్టి పెట్టలేదన్నారు. బీఆర్ఎస్ అడ్డగోలుగా ప్రయివేట్ యూనివర్సిటీలను అనుమతించి ప్రభుత్వ యూనివర్సిటీలను గాలికోదిలేసిందని విమర్శిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిసిన చక్కదిద్దె ప్రయత్నం చేయక పోగా శాఖ మంత్రిని కూడా నియమించక పోవడం అనేది విద్యా వ్యవస్థ పట్ల ఉన్న డొల్లనీతిని స్పష్టం చేస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రి లేక ప్రయివేట్, కార్పొరేట్, విద్యా సంస్థల శక్తులు ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి ఆర్థిక దోపిడి చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పేద, బలహీన వర్గాలు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరుచి తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు.

నీట్‌లో జరిగిన అవకతవకలపై విద్యార్థులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఓయూ

నీట్ లో జరిగిన అవకతవకలపై విద్యార్థులకు న్యాయం చేయాలని ధర్మ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ మహారాజ్ అన్నారు. ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైద్యవిద్య కోసం నిర్వహించినటువంటి నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విద్యార్థులకు న్యాయం చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.4లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని నీట్ ఎగ్జామ్‌ని బాధ్యతగా నిర్వహించడం లో కేంద్ర ప్రభుత్వం ,ఎన్‌టీఏ విఫలమైయ్యాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ జరిగిన్నట్లు స్పష్టంగా తెలుస్తుందన్నారు. బీహార్, గుజరాత్, హర్యానాలో పేపర్ లీకేజీ జరిగిందని ఆధారాలతో సహా బయటికి వచ్చాయని ఎక్కడైనా ఎగ్జామ్ 1 లేదా 2 లేదా 5 నిమిషాలు లేట్ అవుతుంది కానీ సుమారు 30 నిమిషాలు లేట్ అయిందని గ్రేస్ మార్క్స్ పేరుతో 60, 70, 100 మార్కులు ఇచ్చారని నిన్న కూడా అరెస్ట్ చేసిన వారిలో కొందరు స్పష్టంగా తెలిపారు. రూ.40 లక్షలకు అమేసిన్నట్లు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్ యూనియన్ కో-కన్వీనర్ లింగయ్య , ప్రసాద్, సాయి, ఆంజనేయులు పాల్గొన్నారు.

యాదగిరి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

వెంగళరావు నగర్ డివిజన్ యాదగిరి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఏకగ్రీవంగా చైర్మెన్- ఫౌండర్ వి. చిన్న శ్రీశైలం యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అడ్వైజర్ గా వి. నవీన్ యాదవ్, ప్రెసిడెంట్ టి.గోపాల్ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ జీవి వి.రమణారావు, జనరల్ సెక్రటరీగా కే. మహేందర్, వి.శ్రీనివాస్(మోటు) జాయింట్ సెక్రెటరీ యుహెచ్ కె వర్మ, టి.చిరంజీవి, లీగల్ అడ్వైజర్ వి . సత్యనారాయణ ,ట్రెజరర్ జి.గిరిధర్, కే.మధు, పి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.సత్యనారాయణ (రిటైర్డ్ పోలీస్) 9మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. ఈ సందర్భంగా చైర్మెన్ చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. యాదగిరి నగర్ అభివృద్ధి కొరకు అసోసియేషన్ సభ్యులందరూ బాధ్యతగా వ్యవహరించి ముందుకు నడిపించుకోవాలని కోరారు.

ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



నవతెలంగాణ-ఓయూ

జాతీయ వాదాన్ని, జాతీయ సమైక్యతను ఎలుగెత్తి చాటిన మహనీయుడు, భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం తార్నాక డివిజన్ పరిధిలోని లాలపేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు రాముమర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేపీ నాయకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

గాంధీ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం ఏడో వార్డులోని గాంధీ నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పర్యటించారు. న్యూ గాంధీనగర్ గాంధీ నగర్‌లో పర్యటించి అక్కడ ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మురుగునీటి సమస్య, మంచినీటి సమస్యతో పాటు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాగా దీంతో స్పందించిన ఎమ్మెల్యే గణేష్ వెంటనే మురుగునీటి సమస్య పరిష్కారం కోసం శానిటరీ అధికారులతో మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానికుల ప్రజాప్రతినిధులతో పాటు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటే చేసుకుంది. మరణించిన వ్యక్తి వనపర్తికి చెందిన రవిశంకర్‌గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీ సులు సమాచారం ఇచ్చారు. మృత దేహన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ద్వారా వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
10
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

కె.యం. ప్రతాప్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,పెద్దలు, కె.యం. ప్రతాప్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్ళ, కార్యకర్తలు, కార్మికులు, దళిత సంఘం నాయకు లు, అభిమానులు ప్రతాప్‌కి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లా బక్ష, మహమ్మద్ ఖాజా మియా, షేక్ బాబు మియా, బిజిలి కృష్ణ, మొహమ్మద్ జలీల్, వెంకట రమణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-దుండిగల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తూ ముందుకు వెళుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయనను కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా.. వారు సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారుల తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ఒకే గదిలో ఐదు తరగతులు



- ఆల్విన్ కాలని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అవస్థలు
- 70 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు
- అరకొర వసతులతో సర్కారు బడి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం పేరుతో, ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పేరుతో చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను బడి బాట పట్టించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టడం గొప్ప విషయం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఉచితంగా అన్ని వసతులు, అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదుల్లో విద్యా అందిస్తుంది. అధునాతనమైన సాంకేతికతో కూడుకున్న ఐఎఫ్‌బి బోర్డులతో విద్యార్థులకు డిజిటల్ విద్యా సదుపాయం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం.. కానీ విద్యాశాఖ అనుకున్నట్టుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ వసతులు కల్పించకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. కూకట్‌పల్లి మండలం ఆల్విన్ కాలని ఫేస్ వన్‌లో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఉన్నటువంటి ఎంపీపీ పాఠశాలలో70 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ ఒకే హాలు, మరో ఇరుకైన చిన్న గది అందులో 70 మంది విద్యార్థులు ఉంటారు. ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు, కేవలం ముగ్గు రు ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఒకే హాలులో నాలుగు తరగతుల విద్యార్థులు, అందులో కొంతమంది విద్యార్థులకు బెంచ్‌లు ఉండగా.. మిగతా వారికి నేల చదువులు అయ్యాయి. నీటి శుద్ధి పరికరాలతో ఉన్న ఇరుకైన గదిలో మరో తరగతి విద్యార్థులకు విద్యా బోధన చేస్తే, ఆ చిన్నారులకు చదువు అర్థమవుతుందా..వారు గొప్పగా చదువుకుని పైచదువులు చదవగలరా.. అని ఒక్కసారి విద్యా శాఖ అధికారులు ఆలోచించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులు కోరారు. పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే తరగతి గదులు నిర్మించి, విద్యార్థులకు అన్ని వసతులతో విద్యా బోధన జరిపితే.. ఆ విద్యార్థులు దేశ సేవ చేయగల భావి భారత పౌరులుగా తీర్చిదిద్ద బడతారని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థులు చదువుకునేదేట్ల..



చదువు 'కొ' లేని స్థితిలో ఉన్న పేదవారు వారి పిల్లల్ని చదువుకోవాలని సర్కా రు బడికి పంపిస్తే, ఒకే ఇరుకు గదిలో ఐదు తరగతులను నిర్వహిస్తూ... అరకొర సౌకర్యాలతో విద్య నందిస్తే వాళ్ళు చదువుకు నేదెట్ల, విద్యావంతులై ఉన్నత స్థానాలకు ఎదిగేదెట్ల.. అంటూ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లంగటి నరేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ఎంపీగా ఉన్నటువంటి బండారు దత్తాత్రేయ సహకారంతో యువజన సంఘానికి కేటాయించిన చిన్న భవనాన్ని స్థానిక యువకులు కమ్యూనిటీ హాల్‌గా ఉపయోగిం చే వాళ్ళమని తెలిపారు. తర్వాత అంగన్వాడీ కొరకు కావాలంటే ఇవ్వడం జరిగింది. అందులో ఇప్పుడు ప్రాథమిక పాఠశాల కొనసాగిస్తూండటం మంచిదే అయినప్పటికీ.. అంత చిన్న గదిలో ఐదు తరగతులు నిర్వహించడం చాల బాధాకరమైన విషయం. కాబట్టి ఇకనైనా విద్యార్థులకు సరిపడే సౌకర్యాలతో పాఠశాల కొనసాగించాలని అన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లంగటి నరేందర్ రెడ్డి ..

9 నెలలు ఎలా ఊరుకున్నారు..?

- ప్రతి నెలా అద్దె చెల్లిస్తేనే కదా..?
- బాధ్యత అంగన్‌వాడీలది.. పెత్తనం సంక్షేమశాఖదా..?
- అద్దె చెల్లించేది టీచర్లు, డబ్బులు జమ చేసేది ఇంటి యజమానుల ఖాతాల్లోనా..?
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమశాఖ తెలివైన వివరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమ శాఖ చాలా తెలివిగా వ్యవహరిస్తోంది. వారి లోపాలను కప్పి పుచ్చుకునేందుకు అంగన్‌వాడీ టీచర్లను బూచీలుగా చూపించి అందరికీ బురిడీ కొట్టించే ప్రయత్నానికి తెర లేపింది. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ బాధ్యత అంగన్‌వాడీ టీచర్లు వారి భుజానేసుకుని నెల నెలా అద్దె చెల్లిస్తుంటే.. జిల్లా సంక్షేమశాఖ వారిపై పెత్తనం చెలాయి స్తోంది. దీనికితోడు అధికారుల వేధింపులు కూడా ఉండటంతో అంగన్‌వాడీ టీచర్లు లబో దిబోమంటున్నారు. 9 నెలలుగా అద్దెలు పెండిం గ్‌లో ఉండటంతో, రెండు, మూడు నెలలకోసారి వచ్చే వేతనంతో అంగన్‌వాడీ సెంటర్లను నడి పించాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి సందర్భంలో అండగా నిలవాల్సిన సంక్షేమశాఖ చేతులు దులుపుకునే పరిస్థితికి వచ్చింది. ఇటీవల 'నవతెలంగాణ' దిన పత్రికలో 'సగం అద్దెకు.. సగం ఇంటికి' అనే శీర్షికతో వెలువడిన కథనానికి జిల్లా సంక్షేమశాఖ ఇచ్చిన వివరణతో అంగన్ వాడీ టీచర్లు ఒక్కసారిగా అవాక్కయ్యారు. సంక్షేమశాఖ వ్యవహారం 'సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది' అనేలా ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది.

అంగన్‌వాడీ టీచర్లు చెల్లించిన డబ్బుల పరిస్థితి ఏంటి..?

జిల్లా సంక్షేమశాఖ ఉద్దేశం ఏంటో తెలియదు కానీ.. అద్దె అంగన్‌వాడీ టీచర్లు అద్దె చెల్లిస్తుంటే.. 9 నెలల పెండింగ్ అద్దెను ఇంటి యజమానుల ఖాతాల్లో జమ చేస్తామని వివరణ ఇవ్వడంతో అంగన్‌వాడీ టీచర్లు విస్మయానికి గురవుతున్నారు. జిల్లాలో 414 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయనీ, 9 నెలలుగా అద్దె చెల్లించడం లేదని సంబంధిత శాఖ ఒప్పుకుంది. 9 నెలలుగా అద్దె ఇవ్వకుంటే ఏ ఇంటి యజమానీ ఊరుకోరు..? వెంటనే ఖాళీ చేయమని చెబుతారు. ఇలాంటి సందర్భంలో అంగన్‌వాడీల ఆ అద్దెను ప్రతి నెలా చెల్లిస్తూ వస్తున్నారు. ఇలా ఒక్కో సెంటర్‌కు సగటున రూ.4వేలు అనుకున్నా.. ఒక్కో సెంటర్ పేరు మీద ఒక్కో అంగన్‌వాడీ టీచర్ 9 నెలలకుగాను రూ.36వేల వరకు ఖర్చు చేశారు. ఈ లెక్కన 414 సెంటర్లకుగాను 9 నెలల కాలానికి రూ.14 కోట్ల 90 లక్షల వరకు అంగన్‌వాడీ టీచర్లు భరించారు. ఈ విషయం సంబంధిత శాఖకు సైతం తెలుసు. మరి సర్కార్ నుంచి వచ్చే నిధులను నేరుగా ఇంటి ఓనరు ఖాతాలో జమ చేస్తే.. ఇన్ని రోజులు సొంతంగా అద్దెలు చెల్లించిన వారి పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నేరుగా ఇంటి యజమానులకే ఇచ్చేస్తే.. గతంలో టీచర్లు చెల్లించిన డబ్బులను ఇంటి యజమానులు తిరిగి ఇస్తే సరి.. ఇవ్వకపోతే పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి వాస్తవాలను విస్మరిస్తూ, ఇటీవల వివరణ వెలువడంతో సంబంధిత శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్‌వాడీలు చెల్లించిన అద్దె డబ్బులను ఇంటి యజమానుల నుంచి దిరిగి ఇప్పించే బాధ్యత సంబంధిత శాఖ బాధ్యత తీసుకుంటుందా..? లేక.. తమకేమీ సంబంధం లేదని తప్పించుకుంటుదో..? వేచి చూడాలి.

బాధ్యత మొత్తం టీచర్లదే..

జీహెచ్ఎంసీతోపాటు, చుట్టూ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల్లో కలిపి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న అద్దె అంగన్‌వాడీ సెంటర్లతోపాటు సొంత భవనాలు ఉన్న సెంటర్ల నిర్వహణ బాధ్యత సైతం అంగన్‌వాడీలే తీసుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు కేవలం పైపైన మాత్రమే పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా సమస్య ఏర్పడి ఒక ఇంటి నుంచి సెంటర్‌ను ఖాళీ చేసి మరో ఇల్లు వెతకాలంటే ఈ సిటీలో మామూలు విషయం కాదు. ఇక ఇక ప్రతి నెలా అద్దె చెల్లించకపోతే యజమానుల నుంచి ఒత్తిడి, ఇబ్బందులు అంతా ఇంతా.. ఉండవు. ఇవన్నీ భరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లను సంబంధిత శాఖ గుర్తించకపోగా.. వారిని నష్టం చేకూరేలా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

వాస్తవాలను విస్మరిస్తున్న అధికారులు..



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమశాఖ అధికారులు వాస్తవాలను విస్మరిస్తున్నారు. తమకొచ్చే రూ. 13,600తో అంగన్‌వాడీ సెంటర్లు, వారి ఇంటిని నెట్టుకొస్తున్న వారిని అభినందించాల్సింది పోయి.. వారిపై పని భారం పెంచి, వేధించడం సరికాదు. ఇంకా కొంత మందికి బిల్లులు రాలేదు. వెంటనే అధికారుల వేధింపులు ఆపి, పెండింగ్ బిల్లుల ను చెల్లించాలి. ప్రాజెక్టు మీటింగ్స్‌లో కూర్చో వడానికి కుర్చీలు, తాగడానికి నీళ్ల లేక ఇబ్బం దులు పడుతున్నారు. వెంటనే సౌకర్యాలు కల్పించాలి.

-సీఐటీయూ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణన్

బీజేపీది మతోన్మాద రాజకీయ సిద్ధాంతం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్
- నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధా భాస్కర్



నవతెలంగాణ-దుండిగల్

బీజేపీది మతోన్మాదం మతాధారిత బూటకపు రాజకీయ సిద్ధాంతం అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ అన్నారు. కత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి మండలం ప్రగతి నగర్ సుందరయ్య భవన్‌లో ఆదివారం కుత్బుల్లా పూర్ నియోజకవర్గ సీపీఐ(ఎం) సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు విధానాలను తెలియ పరుస్తూ.. నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధా భాస్కర్ మతోన్మాద్ధం పెను ప్రమాదమని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళలు అనగదొక్కబడుతున్నారని పురుషుల నుంచి మహిళలకు రక్షణ కావాలన్నారు. తక్కువ సంఖ్యకులైన మతస్థులకు మెజారిటీగా ఉన్న మతస్థులు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. అన్ని మతాలని సమానంగా గౌరవించాలన్నారు.

అమెరికా ఇంగ్లాండ్ దేశంలో విఫలమైన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలను ప్రస్తుత మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నదని ఎద్దేవా చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ప్రజల జీవన ప్రమాణాలు సన్నగిళ్ళాయని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు తగ్గటం వల్ల ఉత్పత్తి సరుకుల డిమాండ్ తగ్గిందన్నారు. విద్యా, వైద్యం ఖర్చులు బాగా పెరిగాయని.. ప్రజల ఆదాయాలు పెరగటం లేదని.. చాలామంది ప్రజలు ఆత్మహత్యల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తిరగబడే అవకాశం లేకుండా ప్రజలకు వెసులుబాటు కల్పించకుండా కార్మిక చట్టాలను మార్చారు. ఓ ప్రక్కన పని గంటలు పెంచి, పని భారం పెంచి, పని భద్రత లేకుండా శ్రమ దోపిడీని చేసుకునే విధంగా పెట్టుబడిదారులకు సహకరిస్తున్నారన్నారు. బీజేపీని, ఆర్ఎస్ఎస్ విమర్శించడం అంత నాటకమని ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ లక్ష్యాలు 370 ఆర్టికల్ రద్దు రామాలయ నిర్మాణం పూర్తి చేసి, కామన్ సివిల్ కోడ్‌ను అమల్లోకి తీసుకువచ్చిన మోడీ వాళ్ల అసలైన ఆర్ఎస్ఎస్ ప్రచారక్ కార్యకర్త అన్నారు. బీహార్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న నితీష్ కుమార్ ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తానన్నాడు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు 5 శాతం ముస్లిం రిజర్వేషన్ అమలు చేస్తానన్నాడు. వారిద్దరూ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో మోడీ చంకలో చేతి కర్రలుగా ఉన్నారని ఆ రెండు కర్రలు ఎప్పుడు పడతాయో అప్పుడు మోడీ ప్రభుత్వం కూలిపోతుం దన్నారు. రాబోయే రోజుల్లో ఆర్థిక సరళీకరణ పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల్లోకి ప్రజలని సమాయత్తం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. భౌతిక రంగంలోనూ ఆలోచన రంగంలో కూడా వర్గ పోరాటం తీసుకురావాల్సిన బాధ్యత కమ్యూనిస్టులు చేయాలని ఉద్బోధించారు. రాజకీయ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా కామ్రేడ్ బి.వెంకట రామయ్య, బాచుపల్లి మండల కార్యదర్శి వ్యవహరించారు. కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, దుండిగల్ నాయకులు బి.లింగస్వామి, బాచుపల్లి మండల నాయకులు ఎం.చంద్రశేఖర్, బాలపీరు వెంకటరాజ సత్యం, బాలమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంక్షేమ సంఘాల ఐక్యతతోనే కాలనీల అభివృద్ధి చెందుతాయని హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 129 సూరారం డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలోని షాపూర్ ఎలైట్ కౌంటీ అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికై న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేను నివాస కార్యల యంలో కలిశారు. ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియ చేసి, వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యులందరు ఐకమత్యంగా ఉంటూ ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. అనంతరం సంక్షేమ సంఘం సభ్యులు తమకు సీసీ రోడ్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయవలసిందిగా ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే సీసీ రోడ్డుకు కావలిసిన వ్యయ ప్రణాళికలు రూపొందించి, వాటి పరిష్కారానికి కావలసిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మొహమ్మద్ సిద్దిక్, వైస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాస్ రావు, జనరల్ సెక్రటరీ పిల్లి శంకర్, జాయింట్ సెక్రటరీ గిరీష్ కుమార్, ట్రెజర్ కొబ్బరి గోవిందయ్య, సభ్యులు వెంకటేష్, నాగ రాజు, వీరనాల నందనార్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన తూము



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్‌లో శక్తి నగర్ నుంచి ఈడబ్ల్యూఎస్ వరకు, వేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఈడబ్ల్యూఎస్‌లో వేసిన రోడ్డు వల్ల, వర్షాలు పడితే నీళ్ళు ఇండ్లలోకి చేరే అవకాశం ఉందని స్థానికులు శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళడంతో.. ఆ ప్రాంతంలో పర్యటించిన ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, శంకుస్థాపన చేసిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన 6 నెలలకు కూడా పూర్తి చేయలేకపోతున్నారని అన్నారు. పేద ప్రజలు నివసించే ఈడబ్ల్యూఎస్‌లో రోడ్డును కాంట్రాక్టర్ ఓ ప్రణాళికతో లెవెల్ సరి చూసి వేయకపోవడం వల్ల, వర్షాలు పడినప్పుడు ఇండ్లలోకి నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారు సానుకూలంగా స్పందించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రసాద్ రెడ్డి, తుకారాం, విష్ణు, చిరంజీవి, పాండురంగ రెడ్డి, శేషగిరి, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలూన్ షాపులో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

విద్యుత్ హెచ్చుతగ్గులతో ఏసీలో షాక్ సర్క్యూట్ ఏర్పడి ఒక సెలూన్ షాప్ కాలి బూడిదైనా ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సుచిత్ర సర్వీస్ రోడ్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో 'ఉప్పలాస్ ఫ్యామిలీ సెలూన్ ఉంది. సెలూన్‌లోని ఓ ఏసిని ఆన్ చేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతోనే మంటలు వచ్చాయని సెలూన్ నిర్వాహకులు తెలిపారు. పెద్ద ఎత్తున మంటలు చేరడంతో షాపులోని ఓ గది పూర్తిగా దగ్ధమైంది. మిగిలిన నాలుగు గదులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న జీడి మెట్ల అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగనప్పటికీ... అగ్ని ప్రమాదం వల్ల వెలువడిన దట్టమైన పొగ సెల్యూట్ పై అంతస్తులు ఉన్న శ్రీరామ్ ఇన్సూరెన్స్‌లో పనిచేస్తున్న వారిని ఉక్కిరిబిక్కిరి చేసింది. దాంతో ముగ్గురు మహిళలు ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఆక్సిజన్ పెట్టి సమీప హాస్పిటల్‌కి తరలించారు. ఆస్తి నష్టం సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడుగా దొడ్ల రామిరెడ్డి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో పాపిరెడ్డి నగర్ రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో, డివిజన్ పరిధిలోని స్థానిక రెడ్డి సోదరులు ఏకగ్రీవంగా అదే ప్రాంతానికి చెందిన దొడ్ల రామ్ రెడ్డిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం సోదరులు దొడ్ల రామిరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు డివిజన్ పరిధిలో ఎవరికి ఏ సమస్య తలెత్తినా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా సంక్షేమ సంఘంలో సభ్యులందరికీ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో, అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని హామీ ఇచ్చారు. సంక్షేమ సంఘం ఎన్నికలలో రామిరెడ్డి గెలుపొందడం అభినందనీయమని అన్నారు. పాపి రెడ్డి నగర్ కన్టెస్టెండ్ అధ్యక్షుడు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతి కాలనీకి, అన్ని సంఘాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఆర్‌యూపీపీ నాయకులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసం వద్ద, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో కలిసి, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న 8630 మంది భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించినందుకు ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం అడెక్వెసి బ్యాక్ లాగ్ కారణంగా పదోన్నతులు రానున్నటువంటి భాషాపండితులకు భవిష్యత్‌లో గ్రేడ్ 2 భాషా పండితులుగా నియామకమయ్యేవారు ఎవరూ లేనందున.. బ్యాక్ లాగ్ పోస్టులను సాధారణ పోస్టులుగా మార్చి పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు తెలిపారు. అదేవిధంగా అప్ గ్రేడ్ కాకుండా మిగిలిపోయిన 1000 గ్రేడ్ 2 భాష పండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్ భాషలుగా అప్ గ్రేడ్ చేసి పండిత వ్యవస్థను పూర్తిస్థాయిలో రద్దు చేయాలనీ సంఘాలు కోరారు. రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులను కూడా పదోన్నతులు బదిలీలకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రిని రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, కోశాధికారి వి.ఎస్.ఎస్.సి.శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్ బృందం కలిశారు.

ఇన్నోవేషన్ డిజైన్ రోబటిక్స్ పై ఎంఎల్ఆర్ఐటీఎంలో శిక్షణ



నవతెలంగాణ-దుండిగల్

కత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎల్ఆర్ఐటిఎంలోని రోబోటిక్స్ ఆటోమేషన్ ల్యాబ్, ఇన్నొవేషన్ ఇన్క్యుబేషన్ కౌన్సిల్ సహకారంతో జూన్ 20, 21 తేదీల్లో "ఆటోమేట్ ఎక్స్‌పీరియెన్స్: ఇన్నొవేషన్ డిజైన్ ఇన్ రోబోటిక్స్" అనే రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఉన్నత పాఠశాల విద్యార్థులకు శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహించింది. శనివారం జెడ్పిహెచ్ఎస్-గుండ్లపోచంపల్లి పాఠశాల విద్యార్థుల కోసం రూపొందించిన ఈ ప్రత్యేక అవుట్‌రిచ్ ప్రోగ్రామ్, ఆధునిక రోబోటిక్స్ టెక్నాలజీపై ప్రాక్టికల్ అనుభవం, ఇన్నొవేషన్ డిజైన్ పై ఇంటరాక్టివ్ సెషన్స్, సృజనాత్మకత, ఆసక్తిని ప్రేరేపించే వినోదాత్మక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలను కల్పించింది. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా. ఆర్. మురళి ప్రసాద్, డైరెక్టర్ డా. పి. శ్రీధర్ కన్వీనర్ డా. జి. అమర్నాథ్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది.

బహుమతి అందించిన శిరీష సత్తూర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీష్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా, ఆల్విన్ కాలని డివిజన్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు శిరీష సత్తూర్ నిరుపేద ఆడపిల్ల అయిన బేబీ నిషితకు సైకిల్ బహుమతిగా ఇచ్చారు. తమ ఇంటి నుంచి దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకోడానికి ఇబ్బంది పడుతున్న నిషితకు ఈ విధంగా సహాయ పడడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

పురుషులు పనుల కోసం నగరాలకు వలస వెళుతున్నారు. గ్రామాల్లో మహిళలే వ్యవసాయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కానీ వారికి అనువైన వనరులు అందుబాటులో లేవు. ముఖ్యంగా అధునాతన యంత్రాలు చాలా వరకు పురుషులు వాడేందుకే అనుకూలంగా ఉంటున్నాయి. దీని వల్ల వ్యవసాయంలో స్త్రీలు ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. అందుకే మహిళా రైతులకు అనుకూలమైన యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నారు. వాటిని ఉపయోగించి మహిళా రైతులు తమ శ్రమను తగ్గించుకుంటున్నారు. ఆ వివరాలేంటో మనమూ చూద్దాం...

వ్యవసాయంలో 'స్త్రీ'లీకరణ



మహిళలు ఎన్నో ఏండ్ల నుండి తృణధాన్యాలను పండిస్తున్నారు. ఇది ఎంతో శ్రమతో కూడుకున్న పని. గడ్డి నుండి ధాన్యాం తీయడం, పొట్టు తొలగించడం, శుభ్రపరచడం, గ్రేడింగ్, పాలిష్, పిండి కొట్టడం ఇలా తృణధాన్యాలు మన దగ్గరకు వచ్చే సరికి ఎన్నో రకాల పనులు ఉంటాయి. 'ఒకప్పుడు పొలంలో కలుపు మొక్కలను తొలగించడానికి రోజూ ఐదు నుండి ఆరు గంటలు గడిపేవాళ్ళం. కానీ ఇప్పుడు సైకిల్ వీడర్‌లను ఉపయోగించడం వల్ల మూడు గంటల్లోనే పూర్తి చేయగలుగుతున్నాం' అని భూమ్యా అంటున్నారు. ఈ యంత్రం ద్వారా ఆమె తన



శ్రమను తగ్గించుకోగలిగింది. ఒడిశా మిల్లెట్స్ మిషన్ (OMM) కింద కోరాపుట్‌లోని 10 మంది మహిళా గ్రూపులకు రాగి థ్రెషర్-కమ్-పెర్లర్, క్లీనర్-కమ్-గ్రేడర్, సైకిల్ వీడర్ అందించారు. అయితే వాటిని వాడడం మొదలుపెట్టిన తర్వాత వాళ్ల ముందు అనేక సవాళ్లు వచ్చాయి.

ఇప్పుడు సులభంగా ఉంది

సాధారణంగా మహిళలు కలుపు మొక్కలను ఏరివేయడానికి గంటల తరబడి వంగి ఉంటారు. అయితే ఈ యంత్రం వచ్చిన తర్వాత నేలలోకి చొచ్చుకుపోయి కలుపును తొలగించి వేస్తుంది. అదేవిధంగా నూర్పిడి యంత్రానికి కూడా చక్రాలు ఉన్నాయి. 'మేము దాన్ని ఇప్పుడు సులభంగా వాహనంలో ఎక్కించవచ్చు. పొలంలోకి, మారుమూల గ్రామాలకు కూడా రవాణా చేయవచ్చు' అని బద్నాయక్ ఆనందంగా చెబుతున్నారు. 'జల్లెడలు ఇప్పుడు తీసి మళ్లీ అమర్చుకోవచ్చు. దీనివల్ల మేము తక్కువ సమయంలో యంత్రాన్ని సులభంగా శుభ్రం చేయవచ్చు' అని ఆమె పంచుకున్నారు.

మహిళలకు అనుకూలంగా...

కోరాపుట్ బ్లాక్‌లోని మా తారిణి మహిళా ఎస్‌హెచ్‌జి సభ్యురాలు మాలతీ జాని మాట్లాడుతూ 'జల్లెడలు తొలగించలేక పోవడంవల్ల రాగి థ్రెషర్-కమ్-పెర్లర్‌ను శుభ్రపరచడం చాలా ఇబ్బందిగా ఉండేది' అన్నారు. 'థ్రెషర్‌ను తరలించడం కూడా చాలా కష్టం. యంత్రం చాలా బరువుగా ఉంటుంది. దానిని ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తరలించడానికి ఇతరుల సహాయం అవసరం' అని మరో సభ్యురాలు పరిమా బద్నాయక్ అన్నారు. ఇటువంటి సవాళ్లు తెరపైకి వచ్చినప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ ఎంపవర్‌మెంట్ (DA&FE) 2022లో లింగ నిపుణులను కలుపుకుని లింగ విశ్లేషణ కమిటీ (GAC)ని ఏర్పాటు చేసింది. వ్యవసాయంలో ఉపయోగించే యంత్రాలు కేవలం పురుషులు ఉపయోగించే విధంగానే తయారు చేయబడుతున్నాయని వారు గమనించారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఆ కమిటీ మహిళా సమాఖ్య సభ్యులు, మహిళా రైతులను సంప్రదించింది. అలాగే ఆ యంత్రంలో కొన్ని మార్పులు సూచించింది. దీని ఆధారంగా తయారీదారులు యంత్రాలను మహిళలు కూడా ఉపయోగించే విధంగా మార్పులు చేశారు.

మహిళా అవసరాలు గుర్తించి

OMM కింద పార్టిసిపేటరీ మెషినరీ డెవలప్‌మెంట్ (PMD) అనేది GAC ఇచ్చిన సూచనలలో ఒకటి. DA&FE గజపతి, నువాపడ, కెందుఝర్, కోరాపుట్, సుందర్‌ఘర్ జిల్లాలలో గత ఏడాది నుండి OMM కింద ప్రచారం చేస్తోంది. మొదటి దశలో 15 గ్రామాలలో 75 మంది మహిళా రైతులకు వారి నిర్దిష్ట అవసరాలు, ప్రాధాన్యతలు గుర్తించి వ్యవసాయ పరికరాలను అందించింది. తర్వాతి దశలలో వీరు ఎక్కువ మంది రైతులను చేరుకుంటారు. అలాగే అన్ని జిల్లాలకు విస్తరింపజేస్తారు. సైకిల్ వీడర్‌లో క్షితిజసమాంతర హ్యాండిల్‌బార్‌లను ప్రవేశపెట్టిన తర్వాత మహిళ శ్రమ తగ్గింది. ఇప్పుడు వారు దీనిని ఒక చోటు నుండి మరొక చోటికి సులభంగా తరలించవచ్చు.

మహిళా భాగస్వామ్యం ఎక్కువ



భారత్ ప్రపంచంలోనే మిల్లెట్లను అత్యంత ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం. రెండవ స్థానంలో ఉంది. ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా 2023 ప్రకారం భారతదేశం మాత్రమే ఆసియాలో 80% మిల్లెట్‌లను ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచ ఉత్పత్తిలో 20% వాటాను కలిగి ఉంది. వార్షిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2021-22 ప్రకారం వ్యవసాయంలో అత్యధికంగా 62.9% మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యంగా ఉంది. మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఉషా ధరమ్‌రాజ్ మాట్లాడుతూ 'గ్రామీణ పురుషులు సాధారణంగా ఓరియెంటేషన్, శిక్షణ పొందిన తర్వాత వ్యవసాయ యంత్రాలను ఆపరేట్ చేయడం సులభం. అయితే ఈ విషయంలో మహిళా రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. బరువుగా ఉండటం, స్త్రీలకు అనుకూలం కానందున అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి' అన్నారు.

ప్రైవేట్ భాగస్వామ్యం

మహిళా రైతులకు వ్యవసాయ పరిష్కారాలను అందించడంలో ప్రైవేట్ రంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఉదాహరణకు, వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాస్సాన్) ద్వారా స్థాపించబడిన హైదరాబాద్ ఆధారిత సామాజిక సంస్థ ఫార్మ్ ఈజీ చిన్న, సన్నకారు రైతులకు, ముఖ్యంగా మహిళలకు మాన్యువల్ పనిభారాన్ని తగ్గించడానికి వ్యవసాయ పనిముట్లలో వినూత్న సాంకేతికతను ప్రోత్సహిస్తోంది. 'సరసమైన ధర వద్ద శాస్త్రీయ దృఢత్వంతో రాజీ పడకుండా వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తేవడం మా లక్ష్యం' అని ఫార్మ్ ఈజీ డైరెక్టర్ గెంబాలి గౌతమ్ అంటున్నారు.

శ్రమను తగ్గించింది

ఫార్మ్ ఈజీ మినీ మిల్లెట్ మిక్సర్ ఫాక్స్‌టైల్, సన్నటి తృణధాన్యాల నుండి పొట్టును సమర్థవంతంగా తొలగిస్తుంది. జల్లెడ పట్టి ప్రాసెస్ చేస్తుంది. ఇంట్లోనే మిల్లెట్ ప్రాసెసింగ్‌కు ఇది అనుకూలంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లా అచ్చపువలస గ్రామంలో అరిక ఇస్మెరి (33) మిక్సర్‌తో చాలా సంతోషంగా ఉన్నారు. 'ఇంతకుముందు మేము మిల్లెట్‌లను చెక్క మోర్టార్‌లో కొట్టి తయారు చేసేవాళ్లం. ఇదెంతో కష్టంగా ఉంటుంది. రెండు కిలోల ధాన్యం సిద్ధం చేయడానికి ఒక పూట పట్టేది. కానీ ఇప్పుడు ఈ మిక్సర్ సహాయంతో గంటలో 4 కిలోల చిన్న మిల్లెట్‌ను ప్రాసెస్ చేయగలం' అన్నారు. అలాగే ఫార్మ్ ఈజీ ద్వారా ఎర్గోనామిక్‌గా రూపొందించబడిన కాంబో (స్ప్రేయర్ పనికి సంబంధించిన అలసట, వెన్ను నొప్పిని కూడా తగ్గిస్తుంది. ఇది సౌరశక్తితో పనిచేసేది కాబట్టి విద్యుత్ లేనప్పుడు కూడా దీన్ని ఉపయోగించగలం' అని ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా తురువాడ మహిళా రైతు పల్లాల సరస్వతి అన్నారు. ఫార్మ్ ఈజీ అనేక ఇతర వ్యవసాయ పరికరాలను రూపొందించింది. 'ఇందులో కాఫీ కోసం మోటరైజ్డ్ బేబీ పల్పర్, ఫెర్మెంటర్-కంట్రోలర్ ద్వారా బయో-ఇన్‌పుట్‌లను తయారుచేసే సమగ్ర, ఆటోమేటెడ్ సొల్యూషన్, అసమాన భూభాగాలలో నీటిపారుదలని యాక్సెస్ చేసే సోలార్ ఎనర్జీ మొబైల్ కార్ట్‌లు కూడా ఉన్నాయి' అని హైదరాబాద్‌కు చెందిన వాసన్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గిజివిషా ఖత్రీ చెప్పారు.

కొత్త మార్గాలను అన్వేషించాలి

తెలంగాణలో మహిళా కిసాన్ అధికార్ మంచ్ (MAKAAM) నిర్వహించిన ఇటీవలి అధ్యయనంలో ఎక్కువ మంది మహిళా రైతులు చేతితో వ్యవసాయం చేయడం వల్ల శరీర నొప్పులు, కండరాల కణజాల రుగ్మతలతో బాధపడుతున్నారని వెల్లడైంది. 'పార్టిసిపేటరీ విధానం ద్వారా యంత్రాల రూపకల్పన, అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. మహిళా రైతులు, వృద్ధులను చేర్చుకోవడం, వారి సూచనలను పొందుపరచడం చాలా అవసరం' అని MAKAAM జాతీయ సులభతర బృందం సభ్యుడు డాక్టర్ వి.రుక్మిణి రావు అంటున్నారు.

విధానపరమైన ఆందోళనలు



'మారుతున్న పరిస్థితులతో పురుషులు పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కోసం నగరాలకు వలస వెళుతున్నారు' అని పద్మశ్రీ గ్రహీత, లింగ వివక్ష పునరుత్పత్తి వ్యవసాయంపై ఒడిశాలోని నయాగర్ జిల్లాలో పనిచేస్తున్న స్వచ్ఛంధ సంస్థ సంభవ్ వ్యవస్థాపక సభ్యురాలు సబర్మతీ అన్నారు. 'గ్రామాలలో మహిళలు వ్యవసాయ భారాన్ని చాలా మోస్తున్నారు. పొలాల్లో ఎక్కువ సమయం గడుపుతారు. కానీ మహిళల ఎర్గోనామిక్స్, లింగ అవగాహన ఆధారంగా పరికరాలను రూపొందించడంలో చాలా తక్కువ ప్రయత్నం జరుగుతోంది' అని ఆమె జోడించారు. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం స్త్రీలకు పురుషులతో సమానంగా ఉత్పాదక వనరులు అందుబాటులో ఉంటే వారు తమ పొలాల్లో దిగుబడిని 20 నుండి 30% పెంచగలరు. దీనివల్ల ప్రపంచంలో ఆకలితో ఉన్న వారి సంఖ్య 100 నుండి 150 మిలియన్లకు తగ్గుతుంది. ■

ఆశాలకు పరీక్షలా?



(మొదటిపేజీ తరువాయి)

తలొగ్గి పరీక్షల పేరుతో వారిని భయభ్రాంతులకు గురిచేయటం తగదనీ, దీన్ని విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పరీక్ష నిర్వహించాలని అధికారులు ప్రకటించటంతో రాష్ట్రంలోని 28వేల మంది ఆశా వర్కర్లు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రతకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. ఆశాల నైపుణ్యం పెంచేందుకే తప్ప, తొలగింపుల కోసం కాదని అధికారులు చెపుతున్నా, అది నమ్మశక్యంగా లేదని పేర్కొన్నారు. అధికారులు చెప్పేదే నిజమైతే వారికి శిక్షణ ఇస్తే సరిపోతుందని సూచించారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో శిక్షణ ఇచ్చారనీ, ఇప్పుడు పరీక్ష నిర్వహించి సర్టిఫికేట్ ఇవ్వటమంటే కొంత మందిని తొలగించే ప్రమాదం ఉందని వర్కర్లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. కరోనా కాలంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వీరికి "హెల్త్ గ్లోబల్ లీడర్స్" అని అవార్డ్ కూడా ప్రకటించిందని తెలిపారు. నిత్యం గిరిజన ప్రాంతాల్లో 33 ఏండ్లుగా, మైదాన ప్రాంతాల్లో 19 ఏండ్లుగా మహిళలకు, బాల, బాలికలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. గర్భిణీలకు, బాలింతలకు కూడా ప్రత్యేక సేవలందిస్తున్నారని తెలిపారు. ఇంత కాలం నుంచి పనిచేస్తున్న ఆశాలకు ఇప్పుడు కొత్తగా పరీక్ష నిర్వహించి జ్ఞాపకశక్తిని పరీక్షించాలనుకోవడం అనుమానాలకు తావిస్తున్నదనీ, వారి ఆందోళనలను గమనించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరీక్ష నిర్వహించబోమని ప్రకటించిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడం ఆందోళనకరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ పంపించినప్పటికీ దేశంలో ఎక్కడా ఈ పరీక్ష నిర్వహించటం లేదని గుర్తు చేశారు. కేంద్ర సర్కార్ నిర్ణయాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని ఉన్నతాధికారులు ఎందుకు ఆరాట పడుతున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఈ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆశాలు వారి సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారని తెలిపారు. ఎలాంటి పరీక్షలు పెట్టబోమని ఎన్నికల సందర్భంగానూ, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. వారి వేతనాలు, ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మాఫియా గుప్పెట్లో విద్యావ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

నీట్ -పీజీ, యూజీసీ-నెట్, సీఎస్ఐఆర్-నెట్ పరీక్షలు రద్దయ్యాయని ఆమె మండిపడ్డారు. నేడు దేశంలోని ముఖ్యమైన పోటీ పరీక్షల పరిస్థితి ఇదేనని, బీజేపీ పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశనమైందన్నారు.

దేశంలో విద్య, విద్యార్థులు, యువత భవిష్యత్ అత్యాశపరులు, మతోన్మాద అసమర్థులకు అప్పగించడం వల్లే పేపర్ లీక్‌లు, పరీక్షలు రద్దవుతున్నాయని మండిపడ్డారు. దీంతో క్యాంపస్‌ల నుంచి విద్య అదృశ్యమైందని, రాజకీయ గూండాయిజం విద్యావ్యవస్థ గుర్తింపుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత భవిష్యత్‌కు బీజేపీ ప్రభుత్వం అడ్డంకిగా మారిందని, దేశంలోని సమర్థులైన యువత.. తమ విలువైన సమయాన్ని, శక్తిని బీజేపీ అవినీతిపై పోరాడేందుకు వృథా చేసుకుంటున్నారని అన్నారు. ఇన్ని జరుగుతున్నా ప్రధాని మోడీ కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ధ్వజమెత్తారు.

కోల్ గేమ్..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కుదేలు చేస్తుంటే, కేంద్రంలోని మోడీ సర్కారు కండ్లు మూసుకొని చోద్యం ఎలా చూసిందో అర్థం కాదు. సింగరేణిలో రాష్ట్రానికి 52 శాతం, కేంద్రానికి 48 శాతం వాటాలున్నాయనీ, ఎక్కువ వాటాలున్నందున నిర్వహణ అంతా రాష్ట్ర ప్రభుత్వానిదే అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ తాజా మంత్రి జీ కిషన్‌రెడ్డి చెప్పే మాటలు విచిత్రంగా ఉన్నాయి. సింగరేణి లాభాల పంపిణీలో మాత్రం తమ వాటా సొమ్ము తమకు అందాల్సిందే అని హుకుం జారీచేసే కేంద్రం, నిర్వహణలో వేలెట్టేది లేదనడం విడ్డూరం కాక మరేంటి? సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణాస్త్రాలు సంధించారే తప్ప, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున 10వ విడత బొగ్గు గనుల వేలం జరుగుతుంటే దాన్ని అడ్డుకోవడం లేదా వ్యతిరేకించడం మాత్రం చేయలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏదైతే చేసిందో, అదే పద్ధతిలో సింగరేణికి గనులు కేటాయించాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వేలం వేదికపైనే ఓ వినతిపత్రం సమర్పించి, ఆ కార్యక్రమం నిర్విఘ్నంగా సాగేందుకు సహకరించారు. మూడు పార్టీలు సింగరేణితో మూడు ముక్కలాట ఆడుతూ ప్రజల్ని 'జోకర్లు'గా చేస్తూ, 8 రాష్ట్రాల్లోని 67 బొగ్గు గనుల్ని వేలం వేసేందుకు మార్గాన్ని సుగమం చేశాయి. దొంగే దొంగ దొంగ అన్నట్టు పాలకవర్గాలపై ప్రజావ్యతిరేకతను తక్కువ చేసేందుకు వారిలో వారే తన్నుకు చచ్చినట్టు నటించి, చివరకు తామనుకున్న 'వేలాన్ని' జరిపించేసుకున్నారు.

2014-15 నుంచి 2022-23 వరకు 9 ఏండ్లలో సింగరేణి కాలరీస్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాకు చేరిన సొమ్ము అక్షరాలా రూ.49,087.61 కోట్లు. అంటే సగటున ఏడాదికి రూ.5,454.17 కోట్లు సర్కార్ల ఖజానాల్లో జమ అయ్యాయి. ఇన్ని లాభాల్ని ప్రభుత్వాలకు ఇస్తున్న సంస్థను చిదిమేసే కుట్రలకు పాలకపార్టీలు పాల్పడుతున్నాయి.

ప్రజల సంపదైన బొగ్గు గనుల్ని వాణిజ్య వేలం పేరుతో ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేస్తున్నారు. సర్కారు ఖజానాకు సొమ్ము జమ అయితే ప్రజలకు జవాబుదారీగా ఉండి లెక్కలు చెప్పాలి. వేలం పేరుతో ప్రయివేటుకు గనుల్ని అప్పగిస్తే, సర్కారుకు కట్టాల్సిన పన్నుల్ని కట్టేసి, లాభాలన్నీ జేబుల్లో వేసుకోవచ్చు. ఆ సంపదను చూపి, బ్యాంకుల్లో వేలకోట్లు రుణాలు తీసుకొని, చెల్లింపులు ఎగేసి, జనం సొమ్మును మరోసారి లూటీ చేసి, విదేశాలకు చెక్కేయ్యొచ్చు. ఎన్డీఏ సర్కారు హయాంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో నడుస్తున్న ట్రెండ్ ఇదే!



ఇంకా నిర్ణయం తీసుకోలేదు

బొగ్గుగనుల పదవ విడత వేలంలో పాల్గొనే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రావల్సి ఉంది. సింగరేణి బోర్డు సమావేశంలో దీనిపై చర్చిస్తాం.

- ఎన్ బలరాంనాయక్,
సీఎమ్‌డీ, సింగరేణి కాలరీస్

నేటి నుంచి పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

అర్హుడని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిరిజు చెప్పారు. సురేష్ 1998లో, 2004లో ఓటమి చెందారని, దీంతో ఆయన వరుసగా నాలుగు సార్లు మాత్రమే లోక్‌సభకు ఎన్నికైనట్టు అయిందని వివరణ ఇచ్చారు. సురేష్ గతంలో 1989, 1991, 1996, 1999లో కూడా లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాగా ప్రొటెం స్పీకర్‌గా మెహతాబ్ చేత రాష్ట్రపతి ముర్ము సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత ఆయన పార్లమెంటుకు చేరుకొని ఉదయం 11 గంటలకు లోక్‌సభను సమావేశపరుస్తారు. అనంతరం దిగువసభకు ఎన్నికైన సభ్యుల జాబితాను లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ సభ ముందు ఉంచుతారు. తొలుత సభా నాయకుడు నరేంద్ర మోడీ చేత సభ్యుడిగా మెహతాబ్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత... స్పీకర్ ఎన్నిక జరిగే వరకూ సభా కార్యక్రమాల నిర్వహణలో తనకు సహకరించేందుకు రాష్ట్రపతి నియమించిన ఛైర్‌పర్సన్ల ప్యానల్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తారు. సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించడంలో మెహతాబ్‌కు సహకరించేందుకు కె.సురేష్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే), రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే (బీజేపీ), సుదీప్ బందోపాధ్యాయ (తృణమూల్ కాంగ్రెస్)లను రాష్ట్రపతి నియమించారు.

ఛైర్‌పర్సన్ల ప్యానల్‌తో ప్రమాణస్వీకారం చేయించిన తర్వాత మంత్రులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. ఆ తర్వాత అక్షర క్రమంలో రాష్ట్రాల వారీగా రెండు రోజుల పాటు సభ్యుల ప్రమాణస్వీకారం కొనసాగుతుంది. స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగుతుంది. ఆ వెంటనే ప్రధాని మోడీ తన మంత్రివర్గ సహచరులను సభకు పరిచయం చేస్తారు. పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి 27న ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై 28న చర్చ ప్రారంభం అవుతుంది. చర్చకు ప్రధాని మోడీ జులై 2 లేదా 3వ తేదీన సమాధానం ఇస్తారు. కొద్ది రోజుల విరామం తర్వాత బడ్జెట్ సమర్పణ కోసం జూలై 22న లోక్‌సభ సమావేశమవుతుంది.

చిక్కులు వీడితేనే మాఫీ సాఫీ

(మొదటిపేజీ తరువాయి)

రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని ప్రభుత్వం మాటిచ్చింది. ఇందుకు రూ.31వేల కోట్లు కేటాయించింది. 47 లక్షల మంది రైతులను లబ్దిదారులుగా సూచించింది. అన్నీ బాగానే ఉన్నా మార్గదర్శకాలు ఎలా ఉంటాయనే దానిపైనే రైతుల్లో ఆసక్తి నెలకొంది.

పరిమితులపై రైతుల్లో ఉత్కంఠ..

రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో మార్గదర్శకాలు ఎలా ఉంటాయన్న దానిపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. త్వరలో జీవో విడుదల చేస్తామని సీఎం చెప్పినా ఎలాంటి పరిమితులు ఉంటాయనే చర్చ సాగుతోంది. రైతుల పంట రుణాల మాఫీలో పీఎం కిసాన్ మార్గదర్శకాల్లో కొన్నింటిని అమలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. పీఎం కిసాన్ పథకం నుంచి రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారిని మినహాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆదాయ పన్ను చెల్లించేవారినీ పరిగణలోకి తీసుకోలేదు. రుణమాఫీ విషయంలోనూ వీరిని మినహాయించే అవకాశం ఉంది. ఆదాయ పన్ను చెల్లించే వారందర్నీ కాకుండా అధిక ఆదాయం ఉన్నవారిని, అధిక భూమి ఉన్నవారిని మినహాయిస్తారనే ప్రచారం సాగుతోంది.

కొర్రీలు లేకుండా చూడాలి

గతంలో పలు రకాల కొర్రీలు పెట్టారు. కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే మాత్రం చాలా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఆధార్, రేషన్‌కార్డు, ఒకవేళ రేషన్‌కార్డు లేకపోతే గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను ప్రాతిపదికగా తీసుకుంది. కానీ దీనివల్ల 'ఫ్యామిలీ గ్రూపింగ్' కాక అనేక సాంకేతిక సమస్యలు వచ్చాయి. అలా కాకుండా రైతు ప్రాతిపదికగా రుణమాఫీ చేసినా గతంలో అక్షరం మారినా తిరకాసు పెట్టారు. ఒక రైతుకు రెండు బ్యాంకుల్లో రుణాలుంటే రెండింటిలోనూ ఒకేలా పేరు ఉండాలి. స్పెల్లింగ్‌లో తేడా వస్తే మాత్రం మాఫీకి అనర్హులను చేశారు. ఖమ్మం జిల్లాలోని కారేపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ముదిగొండ మండలాల్లో ఇలాంటివి చోటుచేసుకున్నాయి. ఒక కారేపల్లిలోనే 750 మంది అకౌంట్లు స్పెల్లింగ్ మిస్టేక్స్ కారణంగా నిలిచిపోయాయి. ఇంకా అనేక రకాల కొర్రీలు తలెత్తాయి. వాటన్నింటినీ అధిగమించి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంది.

ఖమ్మం జిల్లాలోనే రూ.4.3 వేల కోట్ల రుణాలు

2023 డిసెంబర్ 31 నాటికి ఖమ్మం జిల్లాలో 3,73,157 మంది రైతులు 28 బ్యాంకుల నుంచి రూ.4,307.58 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి లెక్కిస్తే వీరిలో ఎందరు రుణమాఫీకి అర్హత సాధిస్తారో చూడాలి. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాకు రూ.వెయ్యి కోట్లకు పైనే అవసరం అవుతాయి. ప్రభుత్వం ప్రస్తుతం ఈ పథకానికి కేటాయించిన రూ.31వేల కోట్లలో రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న వారిని సైతం లెక్కించారు. ఇలా గుర్తించిన లబ్దిదారుల సంఖ్య 45 లక్షలకు చేరింది. విధివిధానాలు ఖరారు అయితేనే ఈ పథకం తీరుపై పూర్తిస్థాయి స్పష్టత వస్తుంది.

నీట్ అక్రమాలపై సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)

మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు సీబీఐ అధికారి ఒకరు తెలిపారు. సీబీఐ ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. నీట్ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్టు కేంద్రం శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై నమోదైన ఇతర కేసులను కూడా స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించామని ఆ అధికారి తెలిపారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, అక్రమాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ ప్రవేశపరీక్షను వాయిదా వేసింది. ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాల ఆందోళనలతో కంటితుడుపు చర్యగా నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్‌ను తొలగించి.. ఆయన స్థానంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రదీప్ సింగ్ ఖరోలాను నియమించింది.

ముగిసిన నీట్ రీ-ఎగ్జామ్.. దాదాపు సగం మంది గైర్హాజరు

నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతోన్న వేళ సుప్రీంకోర్టు ఆదేశాలతో గ్రేస్ మార్కులు కలిపిన అభ్యర్థులకు నిర్వహించిన నీట్ రీ-ఎగ్జామ్ ముగిసింది. ఆదివారం (జూన్ 23న) జరిగిన ఈ పరీక్షకు దాదాపు సగం మంది డుమ్మా కొట్టారు! ఏడు సెంటర్లలో మొత్తం 1,563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించగా.. 813మంది మాత్రమే హాజరయ్యారు. 750మంది గైర్హాజరైనట్లు ఎన్‌టీఏ అధికారులు వెల్లడించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ 2024 పరీక్షా ఫలితాల్లో ఏకంగా 67మందికి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం పట్ల అనుమానాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో కొందరు అభ్యర్థులు, పలు సంస్థలు కోర్టును ఆశ్రయించడంతో ఈ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పరీక్ష రోజున కొన్ని కేంద్రాల్లో సమయం కోల్పోయిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు కలిపినట్లు ఎన్‌టీఏ చెప్పింది. దీనిపై స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం గ్రేస్ మార్కులు కలిపిన 1,563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలన్న ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం పరీక్ష నిర్వహించారు.

నాన్న..అన్న..ఇప్పుడు తమ్ముడు

(మొదటిపేజీ తరువాయి)

ఈ కుట్ర పన్నారని ప్రశ్నించగా.. "నాకు తెలియదు. మీకే వదిలేస్తున్నాను. నా కొడుకు సూరజ్ ఇప్పటికే పోలీసులను ఆశ్రయించాడు. గత కొద్ది రోజులుగా ఏం జరిగిందో అందరికీ తెలుసు" అని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలన్నింటినీ సూరజ్ రేవణ్ణ కూడా ఖండించారు.

పార్టీ కార్యకర్తపై స్వలింగ సంపర్కానికి పాల్పడ్డారంటూ...

హాసన్‌లోని హొళెనర్సీపుర పోలీస్ స్టేషన్‌లో జేడీఎస్ పార్టీ కార్యకర్త ఫిర్యాదు చేశారు. జూన్ 16న సూరజ్ రేవణ్ణ నన్ను తన ఫాంహౌస్‌కు పిలిచాడు. అక్కడ అతను తనతో చాలా చక్కగా మాట్లాడాడు, కాని అతను నా భుజంపై చేయి వేసి నా చెవులను తాకడం ప్రారంభించినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. నేను భయపడ్డాను. చింతించకండి, నేను మీతో ఉంటాను అన్నాడు. అప్పుడు అతను నా పెదాలను ముద్దు పెట్టుకోవడం ప్రారంభించాడు. నేను అతనిని దూరంగా నెట్టాను. దీనిపై అరవడం మొదలుపెట్టాడు. ఫామ్‌హౌస్‌లో నువ్వు ఒంటరిగా ఉన్నావు అని చెప్పాడు. నా గురించి నీకు తెలియదు.

ప్రయివేట్ భాగాలను తాకి... బట్టలు విప్పి...బాధితుడు

తనకు సహకరించకుంటే చంపేస్తానని సూరజ్ రేవణ్ణ బెదిరించాడు. తర్వాత తన గదిలోకి తీసుకెళ్లి కౌగిలించుకున్నాడు. చెంపలు కొరికేయడం మొదలుపెట్టాడు. అసభ్యకరంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. తన ప్రయివేట్ పార్ట్స్ కూడా తాకడం ప్రారంభించాయి. నా దుస్తులు కూడా తీసేసాడు. ఆ తర్వాత బలవంతంగా అసహజ సంభోగానికి పాల్పడ్డాడు. గతంలో సూరజ్ రేవణ్ణ కూడా బ్లాక్ మెయిలింగ్ ఆరోపణలపై ఫిర్యాదుదారుడితో సహా ఇద్దరిపై కేసు పెట్టారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్నారు.. సూరజ్ రేవణ్ణ

తనపై తప్పుడు లైంగిక దోపిడీ ఆరోపణలతో కేసులో ఇరికించేందుకు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని సూరజ్ రేవణ్ణ ఆరోపించారు. తప్పుడు ఆరోపణల్లో ఇరికించినందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారని చెప్పారు.

అఫ్గాన్ జిలేబి!

ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్


- ఆస్ట్రేలియాపై 21 రన్స్‌తో అద్భుత విజయం
- ఏడు వికెట్లతో నిప్పులు చెరిగిన నయిబ్, నవీన్
- సూపర్‌8లో అఫ్ఘనిస్థాన్ సూపర్ విక్టరీ



అఫ్ఘనిస్థాన్ అదరగొట్టింది. అగ్రజట్టు, మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. బ్యాట్‌తో, బంతితో, ఫీల్డింగ్‌లోనూ కంగారూలపై తిరుగులేని పైచేయి సాధించింది. అఫ్గాన్ పేసర్లు గుల్బాదిన్ నయిబ్ (4/20), నవీన్ ఉల్ హాక్ (3/20) నిప్పులు చెరగటంతో 149 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. 19.2 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. 21 పరుగుల తేడాతో అఫ్గనిస్థాన్ సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఈ విజయంతో సెమీఫైనల్ ఆశలను అఫ్గాన్ సజీవంగా నిలుపుకోగా.. ఆస్ట్రేలియా అవకాశాలను దారుణంగా దెబ్బతీసింది.

నవతెలంగాణ-కింగ్‌స్టౌన్

అగ్రజట్టు ఆస్ట్రేలియాపై అఫ్గనిస్థాన్ అద్భుత సాధించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ సూపర్8 దశ గ్రూప్-1 మ్యాచ్‌లో ఆదివారం కింగ్‌స్టౌన్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. 148 పరుగుల స్కోరును విజయవంతంగా కాపాడుకున్న అఫ్ఘనిస్థాన్ 21 పరుగుల తేడాతో మెరుపు విజయం నమోదు చేసింది. ఛేదనలో ఆసీస్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ (59, 41 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో పోరాడినా.. ఫలితం దక్కలేదు. ట్రావిశ్ హెడ్ (0), డెవిడ్ వార్నర్ (3), మిచెల్ మార్ష్ (12), టిమ్ డెవిడ్ (2), మార్కస్ స్టోయినిస్ (11) విఫలమయ్యారు. అఫ్గాన్ పేసర్లు నయిబ్, నవీన్ 8 ఓవర్లలో 40 పరుగులకే ఏడు వికెట్లు పడగొట్టి ఆసీస్ పతనాన్ని శాసించారు. అంతకుముందు ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (60, 49 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీం జద్రాన్ (51, 48 బంతుల్లో 6 ఫోర్లు) అర్థ సెంచరీలతో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 148 పరుగులు చేసింది. ఆసీస్ పేసర్ పాట్ కమిన్స్ (3/28) వరుసగా రెండో మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అఫ్గాన్ పేసర్ గుల్బాదిన్ నయిబ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



మాక్స్‌వెల్ పోరాడినా.. : 149 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా చతికిల పడింది. పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుంది. ట్రావిశ్ హెడ్ (0), డెవిడ్ వార్నర్ (3), మిచెల్ మార్ష్ (12) విఫలమయ్యారు. నవీన్, నబిలు పవర్‌ప్లేలో ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బకొట్టారు. గ్లెన్ మాక్స్‌వెల్ (59) ఓ ఎండ్‌లో ఒంటరి పోరాటం సాగించాడు. సహచరుల మద్దతు కొరవడినా పరుగుల వేటలో దూసుకెళ్లాడు. మాక్స్‌వెల్ క్రీజులో ఉండగా ఆసీస్ మ్యాచ్ రేసులో నిలిచింది. మిడిల్ ఓవర్లలో బంతి అందుకున్న గుల్బాదిన్ నయిబ్.. మ్యాచ్ గమనాన్ని శాసించాడు. నాలుగు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ ఆశలను ఆవిరి చేశాడు. మాక్స్‌వెల్, స్టోయినిస్ (11), టిమ్ డెవిడ్ (2), పాట్ కమిన్స్ (3)లను అవుట్ చేసిన నయిబ్ అఫ్గాన్ విజయానికి బాటలు పరిచాడు. స్లో బాల్స్‌తో మ్యాజిక్ చేసిన నయిబ్, నవీన్‌లు ఆసీస్ బ్యాటర్ల ఆట కట్టించారు. 19.2 ఓవర్లలోనే పది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 127 పరుగులే చేసింది.

ఓపెనర్ల దూకుడు : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన అఫ్గనిస్థాన్‌కు ఓపెనర్లు మంచి స్కోరు అందించారు. రహ్మనుల్లా గుర్బాజ్ (60), ఇబ్రహీం జద్రాన్ (51) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. ఆసీస్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న గుర్బాజ్, ఇబ్రహీం 15.5 ఓవర్లలో తొలి వికెట్‌కు 118 పరుగుల సెంచరీ భాగస్వామ్యం అందించారు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 44 బంతుల్లో గుర్బాజ్ అర్థ సెంచరీ సాధించగా.. ఆరు ఫోర్లతో 46 బంతుల్లో ఇబ్రహీం ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. ఓపెనర్లు స్వల్ప విరామంలో నిష్క్రమించగా.. డెత్ ఓవర్లలో అఫ్గాన్ ఆశించిన స్కోరు చేయలేదు. కరీం జనత్ (13), అజ్మతుల్లా (2), రషీద్ ఖాన్ (2) నిరాశపరిచారు. మహ్మద్ నబి (10 నాటౌట్) చివర్లో రెండు బౌండరీలతో మెరిశాడు. ఆసీస్ పేసర్ పాట్ కమిన్స్ వరుసగా రెండో మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టాడు. రషీద్ ఖాన్, కరీం జనత్, గుల్బాదిన్ నయిబ్‌లను అవుట్ చేసి టీ20 వరల్డ్‌కప్‌లో రెండో హ్యాట్రిక్ నమోదు చేశాడు. 20 ఓవర్లలో 6 వికెట్లకు అఫ్గాన్ 148 పరుగులు చేసింది. స్పిన్నర్ ఆడం జంపా (2/28) ఆకట్టుకున్నాడు.

సంక్షిప్త స్కోర్లు :


అఫ్గనిస్థాన్ : 148/6 (గుర్బాజ్ 60, ఇబ్రహీం 51, పాట్ కమిన్స్ 3/28, ఆడం జంపా 2/28)

ఆస్ట్రేలియా : 127/10 (మాక్స్‌వెల్ 59, గుల్బాదిన్ నయిబ్ 4/20, నవీన్ ఉల్ హాక్ 3/20)

వ్యూహాత్మక తప్పిదమా?!

సూపర్8 పోరులో అఫ్గాన్‌ను ఆసీస్ తేలిగ్గా తీసుకుందా? విజయంపై అతి విశ్వాసం ప్రదర్శించిందా? తెలియటం లేదు. కింగ్‌స్టౌన్ గ్రౌండ్‌లో ఈ వరల్డ్‌కప్‌లో ఇప్పటివరకు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్టు విజయం సాధించలేదు. అయినా, టాస్ నెగ్గిన ఆసీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. నెమ్మదించిన పిచ్‌పై స్లో బాల్స్‌తో అఫ్గాన్ పేసర్లు అద్భుతం చేశారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో సైతం ఆసీస్‌ను అఫ్గాన్ వణికించింది. 292 పరుగుల ఛేదనలో ఆసీస్ 91/7తో ఓటమి కోరల్లో నిలిచింది. మాక్స్‌వెల్ (201 నాటౌట్) అసమాన ఇన్నింగ్స్‌తో ఆసీస్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. ఈ మ్యాచ్‌లోనూ మాక్స్‌వెల్ (59) మరోసారి ఆ ప్రదర్శన పునరావృతం చేసేలా కనిపించాడు. కానీ పాఠం నేర్చుకున్న అఫ్గాన్ బౌలర్లు స్లో బాల్స్‌తో మ్యాజిక్ చేశారు. వాంఖడేలో చేజారిన అద్వితీయ విజయాన్ని.. కింగ్‌స్టౌన్స్‌లో ఒడిసిపట్టుకున్నారు.





సూపర్8 దశ అంతిమ ఘట్టానికి చేరుకుంది. వరుస మ్యాచుల్లో విజయాలు సాధించిన భారత్.. నేడు చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. అఫ్గాన్ చేతిలో ఓటమితో ఆసీస్ సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. నేడు భారత్‌తో మ్యాచ్‌లో నెగ్గితేనే ఆ జట్టు నిలుస్తుంది. ఒత్తిడి లేకుండా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియాకు ఫలితంపై పెద్దగా ఆందోళన లేదు కాదు. కానీ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ తలనొప్పిగా మారుతోంది. గ్రాస్‌ఐలెట్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా సూపర్8 సమరం నేడు.

ఆ ఇద్దరు మెరిసేనా?

- నేడు ఆసీస్‌తో భారత్ పోరు
- కఠిన సవాల్‌కు సిద్ధమైన రోహిత్‌సేన
- కంగారూలకు ఇక చావోరేవో

రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్

నవతెలంగాణ-గ్రాస్‌ఐలెట్

కోహ్లి, రోహిత్ రాణించేనా?

వరుస విజయాల ఊపుమీదున్న భారత్‌కు కీలక ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ ఆందోళనగా మారింది. గ్రూప్ దశలో కోహ్లి పూర్తిగా నిరాశపరిచినా.. రోహిత్ ఓ అర్ధ సెంచరీతో మెరిశాడు. సూపర్8లో దంచికొడ్తారని అనుకుంటే ఇక్కడ ఇద్దరూ విఫలమవుతున్నారు. భారత్ ధనాధన్ వ్యూహంతో ఆడుతోంది. దీంతో ఓవర్లో తొలి నాలుగు బంతులు బౌండరీ దాటినా.. చివరి రెండు బంతులను సైతం భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే రోహిత్, కోహ్లి వికెట్ పారేసుకుంటున్నారు. సహజశైలిలో ఆడుతూనే దండిగా పరుగులు రాబట్టే ప్రణాళిక ఈ ఇద్దరు తక్షణమే ఆలోచన చేయాలి. లేదంటే, కీలక సెమీఫైనల్ ముంగిట కోహ్లి, రోహిత్ భారత్‌కు బలహీనతగా మారే ప్రమాదం లేకపోలేదు. ఇక మిడిల్ ఆర్డర్ గొప్పగా కనిపిస్తోంది. రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య ఫామ్‌లో ఉన్నారు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లు బ్యాట్‌తో సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నారు. బౌలింగ్ విభాగంలో కుల్దీప్ యాదవ్ చేరిక వైవిధ్యత తీసుకొచ్చింది. కుల్దీప్ మాయ, బుమ్రా పేస్ ప్రత్యర్థులను హడలెత్తిస్తోంది. నేడు ఆసీస్‌పై అర్షదీప్, కుల్దీప్, బుమ్రా ఏం చేస్తారో చూడాలి.

కంగారూలకు చావోరేవో

అఫ్గాన్ చేతిలో ఓటమి ఆసీస్‌ను ఇరకాటంలో పడేసింది. నేడు భారత్ చేతిలో ఆసీస్ ఓడి.. తర్వాతి మ్యాచ్‌లో బంగ్లాపై అఫ్గాన్ నెగ్గితే ఎటువంటి సమీకరణాలతో పని లేకుండా నేరుగా అఫ్గనిస్థాన్ సెమీఫైనల్‌కు చేరుకోనుంది. భారత్‌పై గెలుపొందినా.. బంగ్లాపై అఫ్గాన్ విజయం సాధిస్తే నెట్ రన్‌రేట్ తెరపైకి రానుంది. దీంతో ఎటు చూసినా ఆస్ట్రేలియాకు నేడు సూపర్8 పోరు అత్యంత కీలకం. ఓటమి నైరాశ్యంలో ఉన్నప్పటికీ ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేం. డెవిడ్ వార్నర్, ట్రావిశ్ హెడ్, మిచెల్ మార్ష్ గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డెవిడ్‌లు ఆసీస్‌కు కీలకం కానున్నారు. స్పిన్నర్లు జంపా, ఆగర్ భారత బ్యాటర్లకు సవాల్ విసిరేందుకు ఎదురు చూస్తున్నారు.

పిచ్, వాతావరణం

టీ20 వరల్డ్‌కప్‌లో అత్యధిక స్కోర్లు నమోదైన వేదిక గ్రాస్ ఐలెట్‌లోని డారెన్ సామీ క్రికెట్ స్టేడియం. భారత్, ఆసీస్ మ్యాచ్‌కు సైతం పరుగుల పిచ్‌ను సిద్ధం చేసే అవకాశం ఉంది. ఇక్కడ నమోదైన అత్యధిక స్కోరు 218 పరుగులు. ప్రపంచకప్‌లో ఇక్కడ ఐదు మ్యాచులు జరుగగా మూడు మ్యాచుల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు, రెండింట తొలుత బౌలింగ్ చేసిన జట్టు గెలుపొందింది. నేడు మ్యాచ్ ముంగిట భారీ వర్షం సూచనలు ఉన్నాయి. అర్థరాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు వర్షం కురువనుంది. కానీ మ్యాచ్ సమయంలో ఎటువంటి వర్షం సూచనలు లేవు. అవుట్‌ఫీల్డ్‌ను కవర్లతో కప్పి ఉంచితే మ్యాచ్‌కు పెద్దగా ఆటంకం కలిగే అవకాశం ఉండదు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

ఆస్ట్రేలియా : ట్రావిశ్ హెడ్, డెవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్ (కెప్టెన్), గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డెవిడ్, మాథ్యూ వేడ్, పాట్ కమిన్స్, ఆష్టన్ ఆగర్, ఆడం జంపా, జోశ్ హాజిల్‌వుడ్.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

- పాల్గొన్న 5 వేల మందికి రన్నర్లు



హైదరాబాద్ : ఒలింపిక్ డే రన్ లో ఐదు వేల మందికి పైగా రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు చార్మినార్, చాదర్‌ఘట్ విక్టరీ ప్లే గ్రౌండ్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, యూసఫ్‌గూడ ఇండోర్ స్టేడియం, జింఖానా స్టేడియం, డీపీఎస్ నాచారం, బోయిన్‌పల్లి, బషీర్‌బాగ్ నుంచి 8 బృందాలుగా మొదలైన రన్నర్లు ఎల్బీ స్టేడియం చేరుకుని పరుగుని పూర్తి చేశారు. ముగింపు వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ క్రీడారంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా ఫుట్‌బాల్ ప్లేయర్ కావడంతో క్రీడా రంగానికి మేలు జరగనుందన్నారు. రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో క్రీడలకు నిధుల కేటాయింపు ఎక్కువ కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వం అటకెక్కించిన స్పోర్ట్స్ పాలసీని ఆధునీకరించి, త్వరలో ప్రవేశపెడతామని తెలిపారు. తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే తెలంగాణ క్రీడాకారులకు బీఎండబ్ల్యూ కారును బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కోశాధికారి మహేశ్వర్, మాజీ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, హైదరాబాద్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు జి. నగేష్, బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.



రవితేజ

కాశ్మీర్ వ్యాలీలో మిస్టర్ బచ్చన్

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ప్రస్తుతం కాశ్మీర్ వ్యాలీలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే 90% షూటింగ్ పూర్తి చేసుకుని, ముగింపు దశకు చేరుకుంది.

తాజా షెడ్యూల్‌లో రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ పై బ్యూటీఫుల్ మెలోడీ డ్యూయెట్‌ని షూట్ చేస్తున్నారు. ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కాశ్మీర్‌లోని అద్భుతమైన లోకేషన్లలో ఈ పాట చిత్రీకరణ గత నాలుగు రోజులుగా కొనసాగుతోంది. లోకేషన్ సెలెక్షన్, సాంగ్ జోనర్ సినిమాలో విజువల్ ఫీస్ట్, ఎమోషనల్ ఎలిమెంట్‌ని యాడ్ చేస్తోంది.

90% చిత్రీకరణ పూర్తి కావడంతో, మిగిలిన పార్ట్స్‌ని చిత్రీకరించే దిశగా టీమ్ శరవేగంగా పని చేస్తోంది. రవితేజ, హరీష్ శంకర్, అద్భుతమైన ప్రొడక్షన్ టీమ్ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

జగపతి బాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ-సిరీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, డీవోపీ: అయనంక బోస్, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి.

మధురం హిట్ ఖాయం

- హీరో నితిన్

ఉదయ్ రాజ్ హీరోగా, వైష్ణవి సింగ్ హీరోయిన్‌గా శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై రాజేష్ చికిలే దర్శకత్వంలో నిర్మాత యం.బంగార్రాజు నిర్మిస్తున్న చిత్రం 'మధురం'. ఎ మెమొరబుల్ లవ్ అనేది ట్యాగ్ లైన్. టీనేజ్ ప్రేమ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, సెన్సార్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను హీరో నితిన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ఉదయ్ రాజ్, దర్శకుడు రాజేష్ చికిలే, నిర్మాత బంగార్రాజు, ప్రొడక్షన్ మేనేజర్స్ వర్మ, టోనీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో నితిన్ మాట్లాడుతూ, 'టీజర్ చాలా ప్రామిసింగ్‌గా ఉంది. డెఫినెట్‌గా మంచి హిట్ అవుతుంది. స్వీట్, ఇన్నోసెంట్, జెన్యూన్‌గా ఉంది. అవుట్ అండ్ అవుట్ లవ్ స్టోరీలా ఇది ప్రేక్షకుల్ని మెప్పించి, మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'నిర్మాత బంగార్రాజు ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. దర్శకుడు రాజేష్ అత్యద్భుతంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా నాకు టర్నింగ్ పాయింట్ అవుతుంది' అని హీరో ఉదయ్ రాజ్ చెప్పారు. దర్శకుడు రాజేష్ చికిలే మాట్లాడుతూ, '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్ స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, గొడవలు ఎలా ఉండేవో నేటి తరానికి కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాం. సినిమా చూశాక మీ స్కూల్ డేస్.. కాలేజ్ డేస్ గుర్తొస్తాయి' అని అన్నారు. నిర్మాత యం బంగార్రాజు మాట్లాడుతూ, 'మా సినిమా టీజర్ లాంచ్ చేసిన నితిన్‌కి థ్యాంక్స్. రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులందరికీ ఈ చిత్రం నచ్చేలా ఉంటుంది. సినిమా అంతా కంప్లీట్ అయ్యింది. ప్రస్తుతం సెన్సార్ వర్క్ జరుగుతోంది. అతి త్వరలోనే సినిమా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.



మత్స్యకారుల జీవన చిత్రం



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రేవు'. ఈ చిత్రంలో గురు తేజ్, సుమేష్ మాధవన్, హేమంత్ ఉద్భవ్, లీలా వెంకటేష్ కొమ్మూరి ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి నిర్మిస్తున్నారు. నవీన్ పారుపల్లి సమర్పకులుగా ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు, సినిమా ప్రొడక్షన్ పర్యవేక్షకులుగా ఫిలిం జర్నలిస్ట్ ప్రభు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ మూవీ టీమ్ ఫ్యాషన్ షో, స్పెషల్ పార్టీ నిర్వహించారు. ఈ షోలో చిత్ర బృందంతో పాటు మురళీ మోహన్, ఆర్జీవీ, అనన్య నాగళ్ల, సంపత్ నంది, ఉత్తేజ్ అతిథులుగా పాల్గొని సందడి చేశారు. నిర్మాత డాక్టర్ మురళి గింజుపల్లి మాట్లాడుతూ,'మత్స్యకారుల జీవన చిత్రానికి ఇదొక ప్రతిబింబం. ఒక మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం' అని తెలిపారు. 'యూఎస్ నుంచి వచ్చిన తర్వాత మురళికి ఈ సినిమా ఫస్ట్ కాపీ చూపించాం. ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. చాలా సహజంగా ఈ సినిమా సాగుతుంది. ఇందులోని ఎమోషన్ ఆకట్టుకుంటుంది. ఆర్టిస్టులు నేచురల్ పర్‌ఫార్మెన్స్ చేశారు' అని నిర్మాణ సూపర్ విజన్ జర్నలిస్ట్ ప్రభు అన్నారు.



ప్రభాస్

మూడు భిన్న ప్రపంచాలతో కల్కి

ప్రభాస్ నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఎడి'. ఈ చిత్ర ఫస్ట్ గ్లింప్స్ భారతీయ పురాణాలలో రూట్ అయిన 'కల్కి 2898 ఎడి' సినిమాటిక్ యూనివర్స్‌ని ప్రేక్షకులకు పరిచయం చేస్తే, తాజాగా రిలీజ్ చేసిన ట్రైలర్ ఇంకా డీప్‌గా ఎపిక్ నెరేటివ్‌ని మహా అద్భుతంగా చూపింది.

అమితాబ్ బచ్చన్ 'అశ్వత్థామ'గా డేరింగ్ స్టంట్స్ చేస్తే, కమల్ హాసన్ 'యాస్కిన్'గా గుర్తించలేని డెడ్లీ అవతార్‌లో కనిపించారు. 'బుజ్జి'తో కలిసి ప్రభాస్ 'భైరవ'గా బౌంటీ హంట్‌లో అదరగొట్టారు. దీపికా పదుకొనె 'సుమతి' పాత్రను పోషించింది. దిశా పటానీ 'రాక్సీ'గా పవర్ ఫుల్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది.

ఈ ట్రైలర్ ఈ సినిమాలోని మూడు డిఫరెంట్ వరల్డ్స్‌ని పరిచయం చేసింది. దర్శకుడు నాగ్ అశ్విన్ విజనరీ అప్రోచ్, అద్భుతమైన విజువల్స్, స్టోరీ టెల్లింగ్‌తో భారతీయ సినిమాని రిడిఫైన్ చేయగలదని, అది ఈనెల 27న నిరూపించగలదనే నమ్మకం ఉంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

నవచిత్రం

దేవరలో బోస్కో మార్టిస్ స్టెప్పులు



బోస్కో మార్టిస్, ఎన్టీఆర్

ఎన్టీఆర్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. కొరటాల శివ డైరెక్షన్‌లో ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ కొరియోగ్రఫీ చేయనున్న కొత్త పాట చిత్రీకరణ కోసం టీమ్ థాయిలాండ్ వెళ్లింది.

'పఠాన్, వార్, ఫైటర్' వంటి చిత్రాల్లో అద్భుతమైన స్టెప్స్‌ను కంపోజ్ చేసిన కొరియోగ్రాఫర్‌గా బోస్కో మార్టిస్‌కు మంచి క్రేజ్ ఉంది. ఆయన ఈ చిత్రానికి పని చేస్తుండటంపై బాగా ఎగ్జైట్ అయ్యారు. తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్టీఆర్‌తో ఉన్న ఫొటోను షేర్ చేశారు.

ఇటీవల 'ఫియర్ సాంగ్'ను రిలీజ్ చేయటంతో మేకర్స్ 'దేవర' మ్యూజికల్ ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేశారు. ఈ హై యాక్షన్ థ్రిల్లర్‌ను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'దేవర: పార్ట్ 1'ను తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల చేస్తున్నారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలను పోషించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను అత్యంత భారీగా నిర్మిస్తున్నారు.

మంత్రి సీతక్క విశిష్ట అతిథిగా..



ప్రతి ఏడాది మాదిరిగానే విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు పేరిట 'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సినిమా రంగంలో అన్ని విభాగాలల్లో మంచి ప్రతిభని చూపిన నటీ నటులకు, సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులను బహూకరించనున్నారు. ఈనెల 29న హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో ఈ వేడుకను సినీ, రాజకీయ ప్రముఖులతో సమక్షంలో అంగరంగ వైభవంగా జరుపనున్నారు. ఇందులో భాగంగా ఈ వేడుకకు విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) విచ్చేస్తున్నారు. కళావేదిక (ఆర్.వి. రమణ మూర్తి), రాఘవి మీడియా ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించబోయే ఈ వేడుకకు విశిష్ట అతిథిగా వచ్చేందుకు అంగీకరించినందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, ఈ వేడుకలో ఎన్టీఆర్ అభిమానులతోపాటు ప్రేక్షకులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాం అని కళావేదిక నిర్వాహకులు పేర్కొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నీట్ పై బాలికలకు ఉచిత అవగాహనా తరగతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ - 2025 కు సిద్ధపడుతున్న బాలికలకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమీ (హైదరాబాద్) తెలిపింది. ఈ మేరకు ఆదివారం అకాడమీ చైర్మెన్ ఎ.మనోజ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 25, 26, 27 తేదీల్లో ఉచిత హాస్టల్ వసతితో నిర్వహించే తరగతుల్లో నీట్ లో ఎదురయ్యే సవాళ్లు, మొదటి ప్రయత్నంలోనే నీట్ ఎలా సాధించాలి తదితర విషయాలపై మెడికోలు, సీనియర్ అధ్యాపకులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మొదట రిజిస్ట్రేషన్ చేసుకున్న 100 మందికి మాత్రమే ఈ అవకాశముందని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు 89199 26339లో సంప్రదించాలని సూచించారు.

ప్రకటన కార్యరూపం దాల్చేవరకు ఉత్తరాల ఉద్యమం కొనసాగిస్తా

- జనరల్ బోగీల సాధన సమితి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైళ్లలో జనరల్ బోగీలను పెంచుతామని కేంద్రం చేసిన ప్రకటన కార్యరూపం దాల్చేవరకు ఉత్తరాల ఉద్యమాన్ని కొనసాగిస్తామని జనరల్ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్ బోగీలు పెంచేందుకు మొదలెట్టిన కోటి ఉత్తరాల ఉద్యమంలో ఇప్పటి వరకు అన్ని రాష్ట్రాల నుంచి 10 లక్షల ఉత్తరాలు కేంద్రానికి చేరాయని తెలిపారు. దీంతో జనరల్ బోగీల పెంపు ప్రకటన చేసిందంటూ హర్షం వ్యక్తం చేశారు ఇదే ఉత్సాహంతో ఉద్య మాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ ఉత్తరాలు, ట్విట్టర్, ఈ-మెయిల్ ద్వారా ఆకాంక్షలను కేంద్రానికి తెలపాలని అశోక్ పిలుపునిచ్చారు.

జులై 3 న డీఎంఈ కార్యాలయం ముందు ధర్నా

- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జులై 3న డీఎంఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎం.నర్సింహులు మాట్లాడుతూ జీవో నెంబర్ 60 ప్రకారం కార్మికులకు రూ.15,600 ఇవ్వాల్సి ఉందనీ, అందులో పీఎఫ్, ఈఎస్ఐ మినహాయించుకున్న తర్వాత రూ.13,600 ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే చాలా ఆస్పత్రుల్లో రూ.11 వేలు మాత్రమే చెల్లిస్తుండగా, మరికొన్ని ఆస్పత్రుల్లో రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. కార్మికులకు అన్యాయం జరుగుతున్నా... అధికారులు పట్టించుకోవడం లేదనీ, అందుకే ధర్నా తలపెట్టినట్టు తెలిపారు.


బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

- మొక్కలు నాటిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ బోర్డు మెంబర్ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయం ఆవరణంలో వారు మొక్కలు నాటారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, జి.ప్రేమేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ విజయరామారావు, ఎండల లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

టీఆర్టీఎఫ్ నూతన ప్రధాన కార్యదర్శిగా మారెడ్డి అంజిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారెడ్డి అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి కావలి అశోక్ కుమార్ ఈ నెల పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఈ పదవికి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా మానేటి ప్రతాప్ రెడ్డి, లక్కిరెడ్డి సంజీవరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి కావలి అశోక్ కుమార్ ఈ నెల ఉద్యోగ విరమణ చేయనున్నారు.ఈ సందర్భంగా మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఏకగ్రీవంగా గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి అశోక్ కుమార్, ద్రాక్షపు విష్ణుమూర్తి, కటకం రవికుమార్, సుంకిశీల ప్రభాకర్ రావు, విష్ణుమూర్తి, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు, 33 జిల్లాల నుండి రాష్ట్ర కౌన్సిలర్సు హాజరయ్యారు.

కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చిన వారి తప్పులు బయటపెడతా...

- విద్యుత్ శాఖ మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపై ఏర్పాటైన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చినవారి తప్పుల్ని బయటపెడతానని విద్యుత్ శాఖ మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేత రావుల చంద్రశేఖరరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మేరకు తనకు విచారణ కమిషన్ నోటీసులిచ్చిందనీ, వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరిందని తెలిపారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) ఇచ్చిన ఉత్తర్వులపై హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్టే ఇచ్చిందనీ, విచారణకు వారిని కూడా పిలుస్తారా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌ను, అక్కడి ఈఆర్సీని కూడా విచారణ చేస్తేనే కమిషన్‌కు సమగ్ర విషయం అవగాహన కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుబంధు సాయాన్ని ఆపడానికి వీల్లేదన్నారు. రైతు భరోసా పేరుతో రూ.15 వేలు ఇస్తామని మాట తప్పారనీ, దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఓ నాటకం అని కొట్టిపారేశారు. పింఛన్‌ల పెంపు గురించి ప్రభుత్వం నోరు మెదపట్లేదనీ, విద్యుత్ బిల్లులు మాఫీ కావడం లేదని అన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయనీ, పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అందరిపై దాడులు జరుగుతున్నాయనీ, వీధి కుక్కలు కూడా ప్రజలపై దాడులు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. విద్యుత్ కమిషన్ లీకులు ఇస్తే, ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్టే భావిస్తామన్నారు. తాము లేవనెత్తే అంశాలపై కమిషన్ విచారణ జరపాలనీ, లేకుంటే చైర్మెన్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలని షరతు విధించారు.

ఆశలు అడియాశలేనా?

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల ఆవేదన

- "చాయ్ తాగేలోపే సమస్య పరిష్కరిస్తా..": సమ్మె కాలంలో పీసీసీ అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి హామీ..
- ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా పరిష్కారం కాని వైనం



నవతెలంగాణ - తిమ్మాపూర్

"మీ సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావును గద్దె దింపాల్సిందే, 100 రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. మీ సమస్యలన్నీ మా దృష్టిలో ఉన్నాయి, మీ సంఘ నాయకులను సచివాలయంలోకి పిలిచి చాయ్ తాగేలోపు.. మీ సమస్యలు పరిష్కారం చేస్తా.." అని పీసీసీ అధ్యక్షుని హోదాలో 2023 సెప్టెంబర్ 13న వరంగల్ జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్న మాటలు ఇవి.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల సమస్యలు మాత్రం ఇప్పటివరకు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో 22వేల మంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. 2006 నుంచి 2012 వరకు వివిధ హోదాల్లో.. జిల్లా స్థాయిలో ఏపీవో, సిస్టమ్ అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్స్, డీఎల్ఎంటీ, మెసెంజర్, మండల స్థాయిలో ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐఆర్పీఎస్, మెసెంజర్, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీలు), పాఠశాల స్థాయిలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్స్, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీటీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, వాచ్‌మెన్, వంట చేసే సిబ్బంది (కుక్‌లు), స్కావెంజర్స్‌ను కాంట్రాక్టు పద్ధతిన రోస్టర్ మెరిట్ రోల్ ఆఫ్ రిజర్వేషన్, జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా ఉన్న కమిటీ.. ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 22వేల మంది విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ప్రతి ఏటా రెండు రోజులు లేదా మూడు రోజులు మినహాయింపుతో వీరిని తొలగించి, మరల రెన్యువల్ చేస్తారు. కాగా, వారంతా 18 సంవత్సరాలుగా ఒప్పంద ఉద్యోగులుగా విద్యాశాఖలో అంకితభావంతో విద్యార్థుల భావితరానికి బంగారు బాటలు వేసేందుకు చేస్తున్న సేవలను ఏనాడు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దాంతో 2023 ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 21 వరకు రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట 22రోజులపాటు నిరవధిక సమ్మె దీక్షలు నిర్వహించారు. అప్పటి ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి సమ్మె కాలం జీతం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంది. కాగా, అదే సమయంలో అంటే.. 2023లో సెప్టెంబర్ 13న పీసీసీ అధ్యక్షుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు మీ సంఘ సభ్యులను సచివాలయానికి పిలిచి చాయ్ తాగే లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు పరిష్కరించలేదు. దాంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయో, కావో అని సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివిధ రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణ

దేశంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ (కనీస వేతనం) అమలు చేస్తున్నారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు ఇచ్చిన జీవో 04 ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేస్తున్నారు. కానీ తెలంగాణలో అందుకు భిన్నంగా వేతనాలు అందిస్తున్నారు. అంతేకాకుండా విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే కనీసం దహన సంస్కార ఖర్చులు కూడా చెల్లించడం లేదు. అలాగే 61 ఏండ్లు నిండి ఉద్యోగ విరమణ చేస్తే కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వడం లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగుల మాదిరే ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఐకేపీ, అంగన్వాడీ, కాంట్రాక్ట్ లెక్చరర్‌లకు గత ప్రభుత్వం కనీస వేతనాన్ని అమలు చేసి రెగ్యులర్ చేసింది. వీటి ఆధారంగానైనా సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, వారిని క్రమబద్ధీకరించి కనీస వేతనాన్ని అమలుచేయాలని కోరుతున్నారు. అలాగే, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.20లక్షలు చెల్లించాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆశతో ఎదురు చూస్తున్నాం



మేము నిరవధిక దీక్షలు చేస్తున్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చినటువంటి హామీ నెరవేరుస్తారని ఆశతో ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మా సమస్యలు తీర్చలేదు. విద్యాశాఖ స్వయంగా ముఖ్యమంత్రి చూస్తున్నా సమస్యలను పరిష్కరించకపోవడంపై ఆందోళనకు గురవుతున్నాం. ముఖ్యమంత్రి మాపై దృష్టి సారించి మమ్మల్ని క్రమబద్ధీకరించాలని కోరుతున్నాం. అప్పటివరకు మినిమమ్ టైమ్ స్కేల్ అందజేసి మా జీవితాలను బాగుపరచాలని వేడుకుంటున్నాం.

- బెజ్జంకి ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ

వ్యవసాయ నేపథ్యమే ఉమ్మడి అంశం

- కొత్తగా ఎన్నికైన 148 మంది ఎంపీల వృత్తి అదే
- రైతులుగా ప్రకటించుకున్న 13 మంది

న్యూఢిల్లీ : వ్యవసాయ నేపథ్యం కలిగి ఉన్న ఎంపీల సంఖ్య 18వ లోక్‌సభలో ఎక్కువగా ఉన్నది. ఆ తర్వాత వ్యాపారం, సామాజిక పని రంగాలకు చెందిన వారున్నారు. లోక్‌సభ సెక్రెటేరియట్ వద్ద అందుబాటులో ఉన్న డేటా ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. దీని ప్రకారం.. కనీసం 316 మంది ఎంపీలు గ్రాడ్యుయేట్లు లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు కాగా, నలుగురు కనీసం మెట్రిక్యులేషన్ కూడా పూర్తి చేయలేకపోయారు. కొత్తగా ఎన్నికైన 148 మంది ఎంపీలు వ్యవసాయాన్ని తమ వృత్తిగా పేర్కొన్నారు. మరో 13 మంది ఎంపీలు తమను తాము రైతులుగా ప్రకటించుకున్నారు. 76 మంది సభ్యులు వ్యాపార నేపథ్యం కలిగి ఉండగా, 58 మంది సామాజిక కార్యకర్తలుగా ఉన్నారు. " మా డేటాబేస్ కోసం ఎంపీల గురించిన నేపథ్య సమాచారాన్ని సేకరిస్తాం. ఈ సమాచారం అంతా మా వెబ్‌సైట్‌తో పాటు 'హూ ఈజ్ హూ ఆఫ్ ది 18వ లోక్‌సభ' పుస్తకంలో కూడా అందుబాటులో ఉంటుంది" అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇక ఇదే లోక్‌సభలో 32 మంది అడ్వొకేట్లు, లాయర్లు ఉన్నారు. బీజేపీకి చెందిన అభిజిత్ గంగోపాధ్యాయ ఒక మాజీ హైకోర్టు న్యాయమూర్తి. ఈయన తుమ్లుక్ నుంచి విజయం సాధించారు. అలాగే, ఇందులో ఏడుగురు మెడికల్ ప్రాక్టీషనర్లు, నలుగురు ఇంజినీర్లు, పలువురు సినీ కళాకారులు, ఒక స్ట్రాటజీ కన్సల్టెంట్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కూడా ఉన్నారు.

కొత్త లోక్‌సభలో వయస్సుల వారీగా అత్యంత సీనియర్ సభ్యుడు డీఎంకేకు చెందిన టి.ఆర్ బాలు(83), సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ) ఎంపీ పుష్పేంద్ర సరోజ్(25) పిన్న వయస్కుడిగా ఉన్నారు. కాగా, సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కనీసం 191 మంది ఎంపీలు హిందీలో ప్రమాణం చేయాలనుకుంటున్నారు. 164 మంది ఎంపీలు హిందీ లేదా ఇంగ్లీషులో కాకుండా ఇతర భాషల్లో ప్రమాణం చేస్తామని చెప్పారు.

కొట్టుకుపోయిన అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన

- నిలిచిపోయిన మూడు మండలాల రాకపోకలు



నవతెలంగాణ-దహెగాం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై నిర్మించిన వంతెన పిల్లర్లు కుంగి పోవడంతో తాత్కలిక వంతెన వేశారు. శనివారం రాత్రి ఎగువన కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగులో వరద నీరు చేరడంతో ఆ తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దాంతో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాలతో పాటు దహెగాం, భీమిని మండలాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం నిత్యం కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ నిర్మాణం పూర్తిచేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

'జయశంకర్ పాలిమర్స్'లో భారీఅగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- రూ. కోటిన్నర నష్టమయినట్టు అంచనా
- మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది



నవతెలంగాణ-చివ్వెంల

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న జయశంకర్ పాలిమర్స్‌లో ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఐ కనకరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ పాలిమర్స్ కంపెనీలో షార్ట్‌సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. యాజమాన్యం, కార్మికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో రెండు ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఆ మంటల్లో పేపర్‌ప్లేట్స్‌కు సంబంధించిన ముడి సరుకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందని కంపెనీ యజమాని ఎలగందుల సిద్ధార్థ తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు యజమానిని పరామర్శించారు.

స్పౌజ్ కేసులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి

- సీఎంకు గురుకుల జేఏసీ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

317 జీఓ ద్వారా ప్రభుత్వ గురుకులాల్లోని కేటాయింపుల్లో అన్ని స్పౌజ్ కేసులను పరిగణనలోకి తీసుకోవాలని గురుకుల జేఏసీ సీఎంకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె జనార్దన్, టీజీ సోషల్ వెల్ఫేర్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు గౌడ్, ఎస్ గణేశ్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పౌజ్ కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారని, సెంట్రల్ గవర్నమెంట్, జ్యుడీషియరీ, రైల్వేలు, బ్యాంకులు, ఇతర పబ్లిక్ సెక్టార్ల వారికి కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2022లో జరిగిన కేటాయింపు తర్వాత ఉన్నటువంటి అన్ని మెడికల్ కేసులను కూడా పరిగణలోకి తీసుకుని వారికీ న్యాయం చేయాలని కోరారు. విద్యాశాఖలో ఉపాధ్యాయులకు ఇస్తున్న బదిలీల అవకాశాన్ని అన్ని గురుకుల పాఠశాలలకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం సానుకూలంగా స్పందించారని జేఏసీ నేతలు తెలిపారు.

రీజనల్ రింగ్ రోడ్డు వద్దంటూ..

- భూ నిర్వాసిత రైతుల ఆందోళన



నవతెలంగాణ-రాయపోల్

"రీజనల్ రింగ్ రోడ్డు వద్దు.. మా భూములు మాకు కావాలి.. లేదా రోడ్డు అలైన్‌మెంట్ అయినా మార్చాలి" అంటూ రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసిత రైతులు ఆందోళన చేపట్టారు. ఆదివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ చీమల జగదీష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్డు బేగంపేట, ఎల్కల్ గ్రామాల గుండా వెళ్తుందని ఆ రోడ్డు వద్దని, భూములే కావాలని, వాటిని నమ్ముకునే జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు వల్ల భూమిని కోల్పోతే బతుకుదెరువు కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో రోడ్డు మార్గం అలైన్‌మెంట్ మార్చాలన్నారు. అదీ కుదరకపోతే 2013 భూ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రస్తుత మార్కెట్ విలువ కన్నా రెండింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాయపోల్ మండలంలోని ఎల్కల్, బేగంపేట్ గ్రామాల రైతులకు వ్యవసాయమే జీవనాధారమని, భూములు కోల్పోతే బతుకుదెరువు లేదన్నారు. గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సురేష్ కుమార్, ఎల్కల్ బేగంపేట గ్రామాల రైతులు కుమార్, పిట్ల స్వామి, జాల రాజయ్య, మల్లేశం, శ్రీశైలం, బర్కం మల్లేష్, స్వామి, రమేష్, చిన్న మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నడ్డాకు సమన్లపై కర్నాటక హైకోర్టు స్టే



బెంగళూరు : ముస్లింలను లక్ష్యంగా చేసుకొని వీడియోలో అభ్యంతరకరమైన ప్రచారం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ప్రచార విభాగం అధిపతి అమిత్ మాల్వియాలను విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు జారీ చేయాల్సిన అవసరం లేదని కర్నాటక హైకోర్టు తెలిపింది. విచారణను కొనసాగించవచ్చునని, అయితే వ్యక్తిగతంగా హాజరు కావాలని వీరిద్దరినీ ఒత్తిడి చేయకూడదని న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ ఆదేశించారు. నడ్డా, మాల్వియాలకు గత నెల 8న సమన్లు జారీ చేసిన కర్నాటక పోలీసులు వారిద్దరినీ వారం రోజుల్లో హాజరు కావాలని సూచించారు. బీజేపీ కర్నాటక రాష్ట్ర సామాజిక మాధ్యమ హ్యాండిల్స్‌లో మే 4న అప్‌లోడ్ అయిన యానిమేటెడ్ వీడియోపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. దీనిని పురస్కరించుకొని ఆ మరునాడే నడ్డా, మాల్వియాలపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అప్‌లోడ్ చేసిన వీడియోలను మాల్వియా ఆపరేట్ చేశారని, నడ్డా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆదేశాల మేరకు దానిని షేర్ చేశారని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

సీనియర్ పాత్రికేయులు మురళీధర్ రెడ్డి మృతి

- ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం


(ఫైల్)

న్యూఢిల్లీ : సీనియర్ పాత్రికేయులు, హిందూ దినపత్రిక న్యూఢిల్లీ బ్యూరో ప్రతినిధి మురళీధర్ రెడ్డి అనారోగ్య సమస్యలతో మరణించారు. శనివారం రాత్రి ఢిల్లీ ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. ది హిందూ ఢిల్లీ బ్యూరోలో దాదాపు మూడు దశాబ్దాలపాటు పనిచేసిన బి.మురళీధర్ రెడ్డి, వార్తాపత్రిక పాకిస్తాన్ శ్రీలంక కరస్పాండెంట్‌గానూ పనిచేశారు. సీనియర్ పాత్రికేయులు బి.మురళీధర్ రెడ్డి మతికి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ది హిందూ పత్రికతో పాటు పలు పత్రికల్లో ఆయన ఎంతో సమర్ధవంతంగా పనిచేశారని చంద్రబాబు చెప్పారు. ఢిల్లీతో పాటు శ్రీలంక, పాకిస్తాన్ లో కూడా కరస్పాండెంట్ గా పని చేసిన మురళీధర్ రెడ్డి రిపోర్టింగ్ లో తనదైన ముద్ర వేశారని అన్నారు. మురళీధర్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆయన మతి విచారకరమని సీఎం అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. 1980లో ది హిందూ ఢిల్లీ ఎడిషన్‌ను ప్రారంభించినప్పుడు మురళీధర్ రెడ్డి జర్నలిస్టుగా పేరుగాంచారు. రాజకీయ ప్రతినిధిగా, వార్తాపత్రిక కోసం అనేక ప్రధాన సంఘటనలను కవర్ చేశారు. 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేత గురించి కూడా ఆయన నివేదించారు. 2000లో, ది హిందూ అతనిని పాకిస్తాన్ కరస్పాండెంట్‌గా ఇస్లామాబాద్‌కు, ఆ తర్వాత వార్తాపత్రిక శ్రీలంక కరస్పాండెంట్‌గా కొలంబోకు పోస్ట్ చేసింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ పూర్వ విద్యార్థి, శ్రీ రెడ్డి ది హిందూలో చేరడానికి ముందు మెయిన్ స్ట్రీమ్ నేషనల్ హెరాల్డ్‌తో కలిసి పనిచేశారు. తన వత్తిపరమైన వ్యక్తిగత జీవితంలో చాలా మంది స్నేహితులను సంపాదించిన అతని స్నేహపూర్వక సహాయకరమైన వ్యక్తిత్వం గలవారు.

ప్రచారంలో 'అందరికీ అన్నీ...'

- అధికారంలోకి వచ్చాక 'కొందరికే కొన్ని...'
- ఇదీ కాంగ్రెస్ సర్కార్ తీరు : ట్విట్టర్‌లో మాజీ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో 'అందరికీ అన్నీ' ఇస్తామని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక 'కొందరికే కొన్ని' స్కీంలు ఇస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. సీఎం అంటే కటింగ్ మాస్టరా? అని ఎద్దేవా చేశారు. ప్రతి పథకంలో లబ్దిదారుల సంఖ్యకు కోత పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తూ 'సీఎం' అనే పదానికి సరికొత్త నిర్వచనం ఇస్తున్నారని పేర్కొన్నారు. అప్పట్లో రైతుల్ని లోన్‌లు తెచ్చుకోమని చెప్పి, ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారన్నారు. మొదట్లో రుణమాఫీకి రూ.39 వేల కోట్లు అని, ఇప్పుడు రూ.31 వేల కోట్లకు కుదించారని రాసుకొచ్చారు. పాసుబుక్కులు లేవనే నెపంతో లక్షల మందికి శఠగోపం పెట్టే కుటిల ప్రయత్నం చేస్తే సహించబోమనీ, రేషన్ కార్డును సాకు చూపితే వదలబోమని హెచ్చరించారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని కొంతమందికీ, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఇంకొంతమందికీ శూన్యహస్తాలు చూపితే సహించేదిలేదన్నారు. లక్షలాది మందిని రూ.500 సిలిండర్ పథకానికి దూరం చేశారనీ, 200 యూనిట్ల పథకానికి ఆంక్షలు పెట్టి ఆగమాగం చేశారని పేర్కొన్నారు. నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతుబంధుకు ఇప్పటికీ దిక్కులేదనీ, ఎకరానికి రూ.7500 రైతు భరోసా అడ్రస్సే లేదని విమర్శించారు. రుణమాఫీపై మాట తప్పితే, లక్షలాది రైతు కుటుంబాల తరపున ప్రశ్నిస్తూ, పోరాడుతామని హెచ్చరించారు.